# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - సోమవారం 2 ఫిబ్రవరి 2026 | సంపుటి: 10 | సంచిక: 29 | పేజీలు:12 | వెల రూ.5

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA







# కార్పొరేట్లకు కాసులు
# కామన్ మ్యాన్‌కు నిరాశలు

## 2026-27 కేంద్ర బడ్జెట్‌ను ప్రతిపాదించిన నిర్మలా సీతారామన్

### రక్షణ రంగానికి రూ.7.85 లక్షల కోట్లు కేటాయింపు

### టెక్ కంపెనీలకు 20 ఏండ్ల పాటు ట్యాక్స్ హాలీడే

ఎన్నికల కమిషన్‌కు ఎక్కువ కేటాయింపులు

మూడు కర్తవ్యాల స్ఫూర్తిగా బడ్జెట్ రూపొందించామన్న కేంద్ర ఆర్థిక మంత్రి

వికసిత్ భారత్ పద్దుగా ప్రశంసించిన ప్రధాని.. పెదవి విరిచిన విపక్షాలు

సుస్థిరాభివృద్ధిని కొనసాగిస్తూ.. అంతర్జాతీయ ఒత్తిడులను తట్టుకునే లక్ష్యంతో 2026-27 సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ ను ఆదివారం ఉదయం 11 గంటలకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ లోక్ సభలో ప్రవేశపెట్టారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఆదివారం వార్షికపద్దును ప్రవేశపెట్టడం ఇదే తొలిసారి. అంతకు ముందు నిర్మలా తన బృందంతో పాటు రాష్ట్రపతి భవన్ లో ఫస్ట్ సిటిజెన్ ద్రౌపదీ ముర్మును కలిశారు. రాష్ట్రపతికి బడ్జెట్ పత్రాలు అందజేశారు. సంప్రదాయాన్ని అనుసరిస్తూ మంత్రికి రాష్ట్రపతి మిఠాయి తినిపించారు. అనంతరం బడ్జెట్‌కు క్యాబినెట్ ఆమోదం తెలపడంతో.. మంత్రి లోక్ సభలో బడ్జెట్ ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. 'పవిత్ర మాఘపౌర్ణిమ రోజున బడ్జెట్ తీసుకువస్తున్నాం. కర్తవ్య భవన్లో రూపొందించిన మూడో బడ్జెట్ ఇది. యువశక్తి కేంద్రంగా దీనిని ప్రవేశపెడుతున్నాం. భారత దేశ ఆర్థిక ప్రయాణం స్థిరంగా సాగుతోంది. ప్రపంచ మార్కెట్లతో భారత్ను అనుసంధానిస్తున్నాం. ప్రజల ఆకాంక్షలను ఆచరణలో తీసుకొస్తున్నాం. నైపుణ్యం, పోటీతత్వం, ఉత్పాదకతతో భారత్ను ప్రపంచస్థాయికి తీసుకెళ్తాం. రైతులు, దళిత, గిరిజన సమూహాలకు అభివృద్ధి ఫలాలు చేరాలి'' అని ఆమె పేర్కొన్నారు.




**ఆర్థికాభివృద్ధికి ఊతమిస్తుంది**



**దేశంలో వాస్తవ సంక్షోభాలను పట్టించుకోని బడ్జెట్**



**సామాన్యులకు మేలు చేయని బడ్జెట్**
పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ



**విద్యారంగంపై పూర్తి నిర్లక్ష్యం**
పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్



## తెలంగాణకు అన్యాయం

### కేంద్ర బడ్జెట్‌పై ఉప ముఖ్యమంత్రి భట్టి స్పందన

తీవ్ర నిరాశను కలిగించిన నిర్మలా పద్దుపై
రాష్ట్ర ఎంపీలందరూ కేంద్రంపై ఒత్తిడి పెంచాలి

హైదరాబాద్, ఫిబ్రవరి 1: కేంద్ర బడ్జెట్ తెలంగాణను నిరాశకు గురి చేసిందని ఉపముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఈసారి బడ్జెట్లో ఆశించిన మేరకు కేటాయింపులు ఉంటాయని భావించినా.. ఈ ఏడాది కూడా అదే జరిగిందని వ్యాఖ్యానించారు. సీఎం రేవంత్ రెడ్డితో సహా మంత్రులంతా.. ఎంపీల బృందంతో ప్రధానిని, కేంద్ర మంత్రులను అనేక సార్లు కలిశామని అయినా ప్రయోజనం లేదని విమర్శించారు. మూసీ, రీజనల్ రింగ్ రోడ్డు, మెట్రో విస్తరణలకు బడ్జెట్లో కేటాయింపులు ఉంటాయని ఆశించామన్నారు. బయోఫార్మాపై ఫోకస్ చేశారని.. దాంట్లో కూడా తెలంగాణను గుర్తించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈసీఐఎల్ లాంటి కంపెనీని హైదరాబాద్లో పెట్టింది నాటి కాంగ్రెస్ ప్రభుత్వమేనన్న భట్టి.. కెమికల్ పార్క్ కూడా హైదరాబాద్కు చోటు దక్కలేదని విమర్శించారు.

ఆరెంజ్ ఎకానమీలో హైదరాబాద్ కేంద్రం.. . దానిని కూడా ముంబయికి తరలించారని, తెలంగాణ రాష్ట్రం ఏం తప్పు చేసిందని భట్టి ప్రశ్నించారు. రీజినల్ మెడికల్

...మిగతా 2లో



**మైనారిటీలపై వివక్ష**

## రాష్ట్రానికి సిల్లుగవ్వ

కేంద్ర బడ్జెట్‌లో మరోసారి గుండు సున్న

దీనిపై కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు, కేంద్ర మంత్రులు ప్రజలకు ఏం చెప్తరు? • బడ్జెట్‌పై కేటీఆర్ స్పందన



హైదరాబాద్, మనం ప్రతినిధి: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన తాజా బడ్జెట్లో తెలంగాణకు మరోసారి అన్యాయం జరిగిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు. తెలంగాణ రాష్ట్రానికి దక్కవలసిన నిధులు, ప్రాజెక్టులు, విభజన హామీల అమలు విషయంలో కేంద్రం పుష్కరకాలంగా వివక్షపూరిత వైఖరి కొనసాగిస్తోందని ఆరోపించారు. మరోవైపు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 60 సార్లు ఢిల్లీకి వెళ్లి వచ్చినప్పటికీ తెలంగాణకు ఒక్క రూపాయి ప్రయోజనం కూడా దక్కలేదని, రేవంత్ రెడ్డి ఢిల్లీలోని బిజెపి పెద్దల చుట్టూ చేసిన ప్రదక్షణలవల్ల కలిగిన ప్రయోజనం పైన తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బడాబాయ్ తో దోస్తీ చేసి తెలంగాణకు నిధుల వరద పారిస్తానని ప్రగల్బాలు పలికిన చోటాబాయ్ మాటలు అన్ని బూటకమే అని ఈరోజు కేంద్రం

...మిగతా 2లో

నాలుగున్నర గంటలు సాగిన దర్యాప్తు

## చిన్నబోయిన పెద్దాయన

### నిందితులంతా మీపేరే చెబుతున్నారు

### సార్‌కు...సిట్ సూటి ప్రశ్నలు

### మీ ఆదేశాల మేరకు ఫోన్ ట్యాపింగ్ జరిగిందా

- ఫోన్ ట్యాపింగ్ రికార్డులు ఎవరిచ్చారు
- 'సుప్రీం'మీరేనా అంటూ నేరుగా ప్రశ్న
- రిటైర్డ్ పోలీసులను ఎందుకు కొనసాగించారు
- నిందితుల వాంగ్మూలాలు ముందుంచి విచారణ
- కేసీఆర్ వాంగ్మూలం రికార్డు చేసిన సిట్

హైదరాబాద్,ఫిబ్రవరి 1(మనం,ప్రత్యేకప్రతినిధి): తెలంగాణ ఉద్యమ సమయంలో వ్యూహాలు రచించిన చోట ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ విచారణ చేపట్టడంతో పెద్దాయన చిన్నబోయాడు. ఈక్రమంలో ఫోన్ ట్యాపింగ్ కేసులో ఐదుగురు అధికారుల సిట్ బృందం

...మిగతా 2లో



## మూడు హైస్పీడ్ రైళ్లు

మెట్రో గురించి ప్రత్యేకంగా ఉండదు

తెలంగాణకు కేటాయింపులపై కిషన్ రెడ్డి



ఢిల్లీ, ఫిబ్రవరి 1: దేశ ఆర్థిక వ్యవస్థను స్థిరంగా ముందుకు తీసుకెళ్లేలా బడ్జెట్ రూపకల్పన చేశారని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. కేంద్ర బడ్జెట్ పై ఆయన ఢిల్లీలో విలేకర్లతో మాట్లాడారు. రైతులకు అండగా నిలిచేందుకు ఎరువుల రాయితీని కేంద్ర ప్రభుత్వం పెంచిందని చెప్పారు. ఎరువులపై రాయితీ వల్ల తెలంగాణ రైతులు కూడా లబ్ధి పొందుతారని పేర్కొన్నారు. కేంద్ర బడ్జెట్ గతేడాది కంటే ఈసారి పెరిగిందన్నారు. కాకతీయ టెక్స్టైల్ పార్కు లబ్ధి కలిగే పథకాన్ని కేంద్రం తీసుకొచ్చిందని తెలిపారు. 'ప్రతి జిల్లాలో ఒక్కో బాలికల హాస్టల్ను కేంద్రం ఏర్పాటు చేయనుంది. తెలంగాణలోని

...మిగతా 2లో

## మూడు కర్తవ్యాలే ప్రగతి బాటగా

యువశక్తి కేంద్రంగా బడ్జెట్ పెడుతున్నానన్న నిర్మలా సీతారామన్

2

## ఆరెంజ్ ఎకానమీకి అగ్రపీఠం

సృజనాత్మక రంగంలో మౌలిక సదుపాయాల పెంపు

దేశవ్యాప్తంగా కంటెంట్ క్రియేటర్ ల్యాబ్‌ల ఏర్పాటు




ఢిల్లీ, ఫిబ్రవరి 1: సృజనాత్మకత ఉన్న యువతే దేశానికి అసలైన ఆస్తి అని.. కంటెంట్ క్రియేటర్లను ప్రోత్సహిస్తామని ప్రధాని మోడీ ఇటీవల పేర్కొన్న విషయం తెలిసిందే. ఆ దిశగా అడుగులు వేసిన ప్రభుత్వం సృజనాత్మక రంగాలకు పెద్దపీట వేసే ప్రయత్నం చేసింది. 'ఆరెంజ్ ఎకానమీ' లక్ష్యంగా ఆయా రంగాల్లో సృజనాత్మకతను ప్రోత్సహించి, భవిష్యత్తులో సృష్టించే ఉపాధి అవకాశాలకు సరిపడే నైపుణ్యాలతో సిద్ధంగా ఉండేందుకు చర్యలు చేపడుతున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తన బడ్జెట్ ప్రసంగంలో పేర్కొన్నారు. ఇందుకోసం దేశవ్యాప్తంగా కంటెంట్ క్రియేటర్ ల్యాబులను ఏర్పాటు చేస్తున్నట్టు తెలియజేశారు.

**ఆరెంజ్ ఎకానమీ అంటే సృజనాత్మక రంగాలే!**

మీడియా, వినోదం, మేధోసంపత్తి వంటి క్రియేటివ్ రంగాలను సూచించే పదమే ఆరెంజ్ ఎకానమీ. భౌతిక ఉత్పత్తుల కన్నా ప్రధానంగా సృజనాత్మకత, ఆలోచనలు, సాంస్కృతిక సంపద నుంచి వచ్చే విలువను ఇలా పేర్కొంటారు. యానిమేషన్, వీఎఫ్ఎక్స్, గేమింగ్, కామిక్స్, డిజైన్, టూరిజం, వినోదం వంటి రంగాలు ఇందులోకి వస్తాయి.

**20 లక్షల నిపుణులు అవసరం..**

యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్ రంగం వేగంగా అభివృద్ధి చెందుతోందని, 2030 నాటికి 20 లక్షల మంది నిపుణులు అవసరమని కేంద్ర ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఈ మేర డిమాండును అందుకునేందుకు వీలుగా.. ముంబయిలోని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ క్రియేటివ్ టెక్నాలజీస్ (ఐఐసీటీ) నేతృత్వంలో దేశవ్యాప్తంగా 15వేల పాఠశాలలు, 500 కాలేజీల్లో ఏవీజీసీ కంటెంట్ క్రియేటర్ ల్యాబ్‌లను ఏర్పాటు చేయాలని తాజా బడ్జెట్లో ప్రతిపాదించింది.

స్టార్టప్లను ప్రోత్సహించడం,

...మిగతా 2లో

## వేడుకగా సమ్మక్క వన ప్రవేశం



**మేడారం, ఫిబ్రవరి 1:** మూడు రోజులపాటు పూజలందుకున్న సమ్మక్క తల్లిని భక్తుల జయజయధ్వానాల మధ్య పూజారులు వన ప్రవేశం చేయించారు. శనివారం రాత్రి నిర్వహించిన ఈ వేడుక ఆద్యంతం ఉద్వేగభరితంగా సాగింది. అమ్మను సాగనంపే క్రతువులో గిరిజన సంగీత వాయిద్యాల చప్పుళ్లకు, కొమ్ముబూరల శబ్దాలకు భక్తులు నత్యాలు చేశారు. శివసత్తులు పూనకాలతో ఊగిపోయారు. మిగతా గద్దెలపై పూజలందుకున్న సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులను సైతం ఆయా గొట్ల పూజారులు తమ ప్రాంతాల్లోని ఆలయాలకు తీసుకెళ్లారు. ఆదివాసీ పూజారులు సమ్మక్కను గద్దె నుంచి తీసుకొని చిలకలగుట్టకు చేర్చే వరకు దారిపొడవునా భక్తులు వెంటనడిచారు. మంత్రి సీతక్క, ములుగు కలెక్టర్ దివాకర, ఎస్పీ సుధీర్రాంనాథ్ కేకన్ సహా పలువురు ఉన్నతాధికారులు వనప్రవేశ వేడుకలో పాల్గొన్నారు. మరోవైపు సారలమ్మను రాత్రి సమయంలో కన్నెపల్లి, గోవిందరాజును ఏటూరునాగారం మండలం కొండాయికి చేర్చారు. పగిడిద్దరాజు

...మిగతా 2లో

## సౌమ్య కుటుంబానికి కోటి రూపాయలు

విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన ఎక్సైజ్ కానిస్టేబుల్ ఫ్యామిలీకి ఆర్థిక సాయం ప్రకటించిన ప్రభుత్వం



**హైదరాబాద్, ఫిబ్రవరి 1:** ఎక్సైజ్ కానిస్టేబుల్ గాజుల సౌమ్య (25) కుటుంబానికి తెలంగాణ ప్రభుత్వం ఆర్థిక సాయం ప్రకటించింది. రూ.కోటి నగదు, ఆమె కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వనున్నట్లు మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. విధి నిర్వహణలో సౌమ్య ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని.. ఆమె కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందన్నారు. ఎక్సైజ్ విధి నిర్వహణలో ఉన్న పోలీసులకు ఆయుధాలు సమకూర్చుతామని చెప్పారు. నిజామాబాద్లో జనవరి 23న అక్రమంగా గంజాయి తరలిస్తున్న ముఠాను పట్టుకునేందుకు ప్రాణాల్ని సైతం లెక్కచేయకుండా సౌమ్య ప్రయత్నించారు. ఈ క్రమంలో అక్రమ రవాణాదారులు ఆమెను వాహనంతో ఢీకొట్టారు. ఈ క్రమంలో తీవ్రగాయాలు కావడంతో హైదరాబాద్ నిమ్స్‌లో సౌమ్యకు చికిత్స అందించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె శనివారం రాత్రి మృతిచెందారు. దీనిపై స్పందించిన ప్రభుత్వం ఈ నష్ట పరిహారంప్రకటించింది.

# తెలంగాణకు అన్యాయం

(మొదటి పేజీ తరువాయి)

హబ్ అని మెన్షన్ చేసినా... అందులో కూడా తెలంగాణ లేదని ఆందోళన వ్యక్తం చేశారు. మూసీ ప్రక్షాళన కోసం ప్రధాని, కేంద్ర మంత్రులను కలిసినా సాయం అందలేదన్నారు. రామప్ప దేవాలయాన్ని యునెస్కో గుర్తించినా...టూరిజం విషయంలో కూడా రాష్ట్రానికి నిధులు కేటాయింపు జరగలేదన్నారు. సమ్మక్క. సారలమ్మ దర్శనానికి న్యూజిలాండ్ ట్రైబ్స్ కూడా వచ్చారని.. కానీ, కేంద్రం చిన్నచూపు చూస్తోందని ఆరోపించారు. బడ్జెట్లో జరిగిన అన్యాయంపై రాజకీయాలకు అతీతంగా.. రాష్ట్రంలోని ఎంపీలు అందరూ కలిసి కేంద్రంపై ఒత్తిడి పెంచాలని ఆయన పిలుపునిచ్చారు.

# తెలంగాణకు 3 హైస్పీడ్ రైళ్లు

(మొదటి పేజీ తరువాయి)

33 జిల్లాలకు బాలికల హాస్టళ్లు మంజూరు అవుతాయి. డేటా సెంటర్లకు ఉపయోగపడే నిర్ణయాన్ని మోదీ సర్కారు తీసుకుంది. డేటా సెంటర్లకు ఇచ్చే ప్రోత్సాహం వల్ల తెలంగాణకూ లాభం. విదేశీ విద్య కోసం వెళ్లే విద్యార్థులపై ఉండే పన్నును 5 శాతం నుంచి 2 శాతానికి తగ్గించారు. విదేశీ విద్యపై పన్ను తగ్గించటం వల్ల తెలుగు విద్యార్థులకు ఎంతో మేలు. రైల్వే బడ్జెట్ను రూ. 2.77 లక్షల కోట్లకు పెంచింది. రాష్ట్రానికి మూడు హైస్పీడ్ రైళ్లు రానున్నాయి. మెట్రో రైలు గురించి ప్రత్యేకంగా బడ్జెట్లో ఉండదు. మెట్రోపై డీపీఆర్ ఇస్తే.. పట్టణాభివృద్ధి శాఖ నిధులు ఇస్తుంది. మెట్రో రైలు ప్రాజెక్టుకు మంత్రివర్గ ఆమోదంతో నిధులు వస్తాయి. ప్రస్తుత మెట్రో ప్రాజెక్టు టేకోవర్ ప్రక్రియ పూర్తి చేసి డీపీఆర్ ఇస్తే కేంద్రం ఆమోదిస్తుంది. దేశంలో ఉపాధి అవకాశాలు పెంచేలా మోదీ సర్కారు చర్యలు చేపట్టింది' అని కిషన్ రెడ్డి వెల్లడించారు.

### టీవీ సీరియల్ గా కొనసాగుతున్న సిట్ విచారణ..

ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ సీఎం కేసీఆర్ను సిట్ అధికారులు విచారిస్తోన్న సంగతి తెలిసిందే. దానిపై మీడియా అడిగిన ప్రశ్నకు కిషన్ రెడ్డి స్పందించారు. ''ఫోన్ ట్యాపింగ్ కేసు టీవీ సీరియల్ మాదిరిగా కొనసాగుతోంది. ఇప్పటికే రెండేళ్లయ్యింది. ఇంకా ఎన్నాళ్లు సాగుతుందో తెలియదు. ఫోన్ ట్యాపింగ్ నిజమని స్వయంగా కేసీఆర్ కుమార్తె చెప్పారు. ఇంటి అల్లుడి ఫోన్ ట్యాప్ చేశారని స్వయంగా కవిత చెప్పారు.

# రికార్డు

నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రవేశపెట్టడం ఇది తొమ్మిదోసారి. ఇప్పటివరకూ మాజీ ప్రధాని మొరార్జీ దేశాయ్ అత్యధికంగా 10 సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టారు. అయితే ఆయన వరుసగా ప్రవేశపెట్టలేదు. వేర్వేరు సమయాల్లో అందించారు. మాజీ ఆర్థిక మంత్రి పి.చిదంబరం మొత్తం 9 సార్లు బడ్జెట్ ప్రవేశ పెట్టారు. కానీ ఆయన వరుసగా చేయలేదు. అలాగే నిర్మలా సీతారామన్ మరోఅరుదైన రికార్డును సొంతం చేసుకున్నారు. ఆమె 2019 మే 31న ఆర్థిక మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. 2026 జనవరి 31 నాటికి ఆమె ఈ పదవిలో 6 ఏళ్ల 8 నెలలు పూర్తి చేసుకున్నారు. గతంలో సి.డి.దేశ్ ముఖ్ ఆరేళ్ల రెండు నెలలపాటు నిరంతరాయంగా ఆర్థిక మంత్రిగా కొనసాగారు.

# చిన్నబోయిన...పెద్దాయన

(మొదటి పేజీ తరువాయి)

కేసీఆర్ను దాదాపు నాలుగున్నర గంటల పాటు ప్రశ్నించింది. ఈ కేసులో గతంలో సాక్షులు, నిందితులు ఇచ్చిన వాంగుల్మాలను గులాబీ బాస్ ముందు ఉంచి సిట్ బృందం ప్రశ్నల వర్షం కురిపించింది. కేసీఆర్ సమాధానాలు అన్నింటినీ అధికారులు వీడియో గ్రఫీ ద్వారా రికార్డ్ చేశారు. అంతేకాకుండా అప్పటి ప్రతిపక్ష నేత రేవంత్ ఇంటి సమీపంలో సూట్కేస్ యంత్రంతో ఫోన్ ట్యాపింగ్కు పాల్పడిన అంశాలపై అధికారులు పలు కీలక ప్రశ్నలు అడిగినట్లు తెలిసింది. 'సుప్రీం, పెద్దాయన' ఆదేశాల మేరకు ఫోన్ ట్యాపింగ్ చేశామంటూ ఈ కేసులో కీలక నిందితులు ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు, మాజీ డీసీపీ రాధాకిషన్ రావుల వాంగ్మూలాలపై ప్రత్యేకంగా విచారించారు. అదేవిధంగా ఈ కేసులో మిగిలిన నిందితులు భుజంగరావు, తిరుపతన్న, ప్రణీత్రావులు పదే పదే పెద్దాయన ఆదేశాలు పాటించామని చెప్పారని ఆ పెద్దాయన మీరేనా అంటూ సిట్ సూటి ప్రశ్నలను సంధించింది. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో పంజాగుట్ట పోలీస్ స్టేషన్లోని స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్లో ఆధారాల ధ్వంసంపైనా దర్యాప్తు చేపట్టారు.

### ఎందుకు చేశారు:

పోలీసు శాఖలో రిటైర్డ్ అయిన అధికారులను కీలక హోదాలు అప్పగించి ఎందుకు కొనసాగించారని సిట్ కేసీఆర్ను వివరణ కోరింది. ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు, టాస్క్ ఫోర్స్ మాజీ డీసీపీ రాధకిషన్ రావులతో మీరెప్పుడైనా మాట్లాడారా.. ఒకవేళ మాట్లాడితే ఏ అంశాలపై మాట్లాడారని ఆరా తీసింది. ఎస్ఐబీ కేంద్రంగా జరిగిన ఫోన్ ట్యాపింగ్ డేటాను మీకు ఎవరూ అందజేశారు , వాటిని ఎవరెవరు విన్నారు, మీరు ఎవరికి పంపారు అన్న విషయాలపై లోతుగా విచారణ చేపట్టారు. ముఖ్యంగా ఎమ్మెల్యే కొనుగోలు కేసుకు సంబంధించిన వీడియోలు మీకు ఎవరు ఇచ్చారని, వారి ఫోన్లను రికార్డుల చేయాలని ఆదేశించింది మీరేనా అంటూ ప్రశ్నించినట్లు తెలిసింది.

### చిన్నబోయిన:

తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు నందినగర్ నివాసంలో సిట్ విచారణ ఉత్కంఠ మధ్య కొనసాగింది ఫోన్ ట్యాపింగ్ కేసులో భాగంగా తన నివాసంలోని రెండో అంతస్తులో అధికారుల ప్రశ్నలను ఎదుర్కొంటున్న సమయంలో కేసీఆర్ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. ముఖ్యంగా మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఆయన మాట్లాడుతూ, తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి ఊపిరిపోసి, ఎన్నో చారిత్రాత్మక వ్యూహాలను రచించిన అదే గదిలో నేడు విచారణ ఎదుర్కోవాల్సి రావడం అత్యంత దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. స్వరాష్ట్ర సాధన కోసం ఎన్నో నిద్రలేని రాత్రులు గడిపి, ఉద్యమ రచన చేసిన ఈ గదిలోనే ఇలాంటి పరిస్థితి వస్తుందని తాను కలలో కూడా ఊహించలేదని ఆయన వ్యాఖ్యానించారు.మరోవైపు, ఈ విచారణ ప్రక్రియలో పోలీసులు అత్యంత కఠినమైన ఆంక్షలను అమలు చేశారు. విచారణ ప్రారంభం కాగానే మాజీ మంత్రి హరీష్ రావుతో పాటు ఇతర ముఖ్య నాయకులందరినీ నివాసం నుంచి బయటకు పంపించివేశారు. నిబంధనల ప్రకారం కేసీఆర్ తరపు న్యాయవాదులకు కూడా విచారణ సమయంలో లోపల ఉండటానికి సిట్ అధికారులు అనుమతి నిరాకరించారు. నందినగర్ ప్రాంతమంతా భారీ పోలీసు బందోబస్తుతో నిండిపోయింది.

### భద్రత నడుమ:

ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్ ను సిట్ విచారిస్తుండగా మరోవైపు తెలంగాణ భవన్ వద్ద బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళనకు దిగాయి. కేసీఆర్ నివాసం వద్దకు వెళ్లేందుకు వారు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. మరోవైపు సీఎం రేవంత్ రెడ్డి నివాసం ముట్టడికి బీఆర్ఎస్ ప్రయత్నించే అవకాశం ఉందని నిఘా వర్గాలు హెచ్చరికలతో పోలీసులు అప్రమత్తం అయ్యారు.

సీఎం రేవంత్ రెడ్డి నివాసం వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. ముఖ్యంగా నందినగర్ పరిసరాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. బారికేట్లు పెట్టి ఎవరినీ లోపలికి అనుతించటం లేదు. కేసీఆర్ నివాసంలోకి కుటుంబ సభ్యులు, సిట్ అధికారులకు మాత్రమే అనుమతించారు.

### డ్రోన్ కలకలం:

నందినగర్లోని కేసీఆర్ ఇంటి వద్ద డ్రోన్ కలకలం రేపింది. కేసీఆర్ ఇంటి పరిసరాల్లో ఉన్న బీఆర్ఎస్ శ్రేణులు ఇది చూసి ఆందోళన వ్యక్తం చేశారు.

అయితే, సిట్ విచారణ, కార్యకర్తల ఆందోళనల నేపథ్యంలో కేసీఆర్ నివాసం వద్ద డ్రోన్ ద్వారా పోలీసులు పర్యవేక్షిస్తున్నట్లు అధికారులు స్పష్టం చేశారు. కేసీఆర్ను విచారిస్తున్న సిట్ అధికారుల వద్ద పలు రకాల ఎలక్ట్రానిక్ పరికరాలు ఉన్నాయని తెలుస్తోంది. 5 లాప్ టాప్స్, మూడు డిజిటల్ కెమెరాలు, హార్డ్ డిస్కు, డేటా కేబుల్స్, సీసీ కెమెరాలు (టెంపరరీ సెటప్), మొబైల్ ఫోన్లు సిట్ అధికారుల వద్ద ఉన్నట్లు తెలుస్తోంది. అలాగే కేసుకు సంబంధించిన అన్ని ఫైళ్లను కూడా సిట్ అధికారులు తీసుకొచ్చి కేసీఆర్ను విచారించారు.

# రాష్ట్రానికి సిల్లుగవ్వ

(మొదటి పేజీ తరువాయి)

ప్రవేశపెట్టిన బడ్జెట్ సాక్షిగా తెలిపోయింది. తమ బడే భాయ్ - చోటే భాయ్ అనుబంధం వలన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ బడ్జెట్లో రాష్ట్రానికి ఏమి సాధించిందో వెల్లడించాలని ప్రశ్నించారు. కేవలం తనపై ఉన్న కేసులను, అవినీతి ఆరోపణల నుంచి కాపాడమని బిజెపి పెద్దల కాళ్లు పట్టుకోవడానికి రేవంత్ రెడ్డి ఇన్ని రోజులపాటు ఢిల్లీ పర్యటనలు చేశారు అని ఈ బడ్జెట్ లో జరిగిన సున్నా కేటాయింపులతో తేలిపోయింది అన్నారు. 60 సార్లు ఢిల్లీ చుట్టూ చక్కర్లు కొట్టిన ఆరు చిల్లర పైసలు కూడా తేలేని చేతగాని రేవంత్ రెడ్డి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉండడం దౌర్భాగ్యం అన్నారు. రేవంత్ రెడ్డి చేపట్టిన ఢిల్లీ టూర్లన్నీ రాహుల్ గాంధీకి మూటలు మూసేందుకు, తన సొంత ప్రయోజనాల కోసం, రాజకీయాల కోసం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన స్కాములపై విచారణ చేయకుండా, కేంద్రంలోని బీజేపీ నేతల వద్దకు వెళ్లడమే తప్ప తెలంగాణ హక్కుల కోసం గట్టి పోరాటం చేయలేదని కేటీఆర్ మండిపడ్డారు.

మరోవైపు తెలంగాణకు ఒక్క రూపాయి కూడా కేటాయించని ఈ బడ్జెట్పై బీజేపీ నేతలు కూడా ప్రజలకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచిపార్లమెంట్ చట్టం ప్రకారం తెలంగాణ రాష్ట్రానికి దక్కవలసిన విభజన హామీల నుంచి మొదలుకొని ఇప్పటివరకు ఒక్క రూపాయి, ఒక్క ప్రాజెక్టు కూడా కేటాయించకపోవడం కేంద్ర ప్రభుత్వ వివక్షకు నిదర్శనమని వ్యాఖ్యానించారు. రాష్ట్రం నుంచి పేరుకు ఇద్దరు కేంద్ర మంత్రులున్న తెలంగాణ పక్షాన కనీసం గొంతెత్తి అడగకపోవడం వల్లనే తెలంగాణకు చిల్లిగవ్వ కూడా కేంద్ర బడ్జెట్లో దక్కలేదు అన్నారు. పాలమూరు రంగారెడ్డి సాగునీటి ప్రాజెక్టుకు జాతీయ హోదా, మెట్రో విస్తరణ, రీజినల్ రింగ్ రోడ్, కొత్త రైల్వే లైన్లకు నిధులు, వరంగల్లో కోచ్ ఫ్యాక్టరీ, ఐఐటి, ఐఐఎం, విద్యాసంస్థల ఏర్పాటు, ఖమ్మంలో బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, సిరిసిల్లలో మెగా టెక్స్టైల్ పార్క్ వంటి అనేక కీలక డిమాండ్లపై తాము గత పది సంవత్సరాలకు పైగా కేంద్రానికి అనేక విజ్ఞప్తులు చేసినా. ఏ ఒక్కదానికి కూడా న్యాయం చేయలేదని విమర్శించారు. తెలంగాణ ఏర్పడిన నాటి నుంచి కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాన్ని వివక్షతో చూస్తున్నది అన్నారు.

తెలంగాణ నుంచి గెలిచిన కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు, కేంద్ర మంత్రులు, రాష్ట్ర ప్రభుత్వం, ఈ బడ్జెట్లో రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రాంతీయ పార్టీకి ప్రాతినిధ్యం ఉంటే ప్రతి బడ్జెట్లో నిధుల వరద పారుతుందని, పక్క రాష్ట్రాలకు బడ్జెట్లలో జరుగుతున్న కేటాయింపులను చూసి ప్రజలు గమనిస్తున్నారని కేటీఆర్ అన్నారు. జాతీయ పార్టీలు తెలంగాణ ప్రయోజనాలను కాపాడలేవని ఈ బడ్జెట్ మరోసారి నిరూపించిందని కేటీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణకు చిల్లిగవ్వ కూడా తీసుకురాలేకపోయిన సీఎం రేవంత్ రెడ్డి, బీజేపీకి చెందిన కేంద్ర మంత్రులు, కాంగ్రెస్, బీజేపీ పార్టీల ఎంపీలు తెలంగాణ ప్రజలకు బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఇతర రాష్ట్రాల ఎంపీలు తమ రాష్ట్రాలకు భారీగా నిధులు తెచ్చుకుంటుంటే, తెలంగాణకు చెందిన బీజేపీ ఎంపీలు, కేంద్ర మంత్రులు పూర్తిగా విఫలమయ్యారని ఘాటుగా వ్యాఖ్యానించారు. కాంగ్రెస్, బీజేపీ నుంచి చెరో ఎనిమిది మంది ఎంపీలను గెలిపించి పార్లమెంట్కు పంపినా తెలంగాణకు ఈ బడ్జెట్లో దక్కింది గుండు సున్నానే అని విమర్శించారు. నిధులు తెచ్చుకోలేని కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు తెలంగాణ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని మరోసారి డిమాండ్ చేశారు. స్వీయ రాజకీయ అస్తిత్వమైన బిఆర్ఎస్ పార్టీకి లోక్సభలో ప్రాతినిధ్యం లేకపోవడం వలన రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగిందన్న విషయం తెలంగాణ సమాజానికి అర్థమయిపోయిందన్నారు. తెలంగాణ పార్టీ ఉంటేనే ఢిల్లీలో రాష్ట్రానికి బలం, గళం ఉంటుందన్న వాస్తవం మరోసారి రుజువైందని పేర్కొన్నారు.

# బడ్జెట్ ఎఫెక్ట్: పెరిగేవి.. తగ్గేవి ఇవే..!

బడ్జెట్లో తీసుకొన్న నిర్ణయాలతో కొన్ని రకాల పరికరాలు, ఔషధాల ధరలు తగ్గి అందుబాటులోకి రానున్నాయి. ఈ నేపథ్యంలో ఈ బడ్జెట్ తర్వాత ధరలు పెరిగేవి.. తగ్గేవి ఏమిటో చూద్దాం.

### ధరలు తగ్గేవి..

విదేశీ పర్యాటక ప్యాకేజీలు: వీటిపై ట్యాక్స్ కలెక్ట్ ఎట్ సోర్స్ (టీసీఎస్)ను 2% శాతానికి తగ్గించారు.
విదేశీ విద్య: దీనిపై టీడీఎస్ ను లిబరలైజ్డ్ రెమిటెన్స్ స్కీం (ఎల్ఆర్ఎస్ కింద విద్యా ఖర్చుల కోసం తగ్గించారు.)
ఆల్కాహాలిక్ లిక్కర్ తుక్కు, కొన్ని రకాల ఖనిజాలు: వీటిపై కస్టమ్స్ డ్యూటీని 5% శాతం నుంచి 2% శాతానికి తగ్గించారు.
షూ అప్పర్ ఎగుమతులు: ఇందుకోసం అవసరమైన మెటీరియల్ దిగుమతిని డ్యూటీ రహితంగా ప్రకటించారు.
సోలార్ ప్యానల్స్: వీటికి సంబంధించిన కీలక మెటీరియల్పై బీసీడీ (బేసిక్ కస్టమ్స్ డ్యూటీని)ని తొలగించారు.
ఎనర్జీ ట్రాన్సిషన్ పరికరాలు: వీటిపై బీసీడీ తొలగింపు.
క్యాపిటల్ గూడ్స్, క్రిటికల్ మినరల్స్ పై బీసీడీ మినహాయింపు.
వ్యక్తిగత వినియోగానికి వాడే పరికరాలపై బీసీడీ 20% నుంచి 10% శాతానికి కుదింపు.
క్యాన్సర్, అరుదైన వ్యాధులు, డయాబెటిక్ చికిత్సకు వాడే 17 రకాల ఔషధాలపై బీసీడీ తొలగింపు.
మన దేశ తీరప్రాంతం నుంచి ప్రత్యేక ఆర్థికమండలి పరిధి వరకు ఉన్న సముద్ర జలాల్లో మన జాలర్లు పట్టుకొన్న చేపలు.
అణు విద్యుత్తు ప్రాజెక్టులకు వాడే పరికరాలు.
విద్యుత్తు వాహనాల్లో వాడే బ్యాటరీలు.
భారత్ లో తయారయ్యే స్మార్ట్ ఫోన్లు, ట్యాబ్లెట్లు.
విమానాల విడిభాగాలు

### ధరలు పెరిగే అవకాశమున్న సరుకులు

ఆదాయపు వివరాలు సరిగ్గా చూపని వారికి విధించే జరిమానా 100% పెంపు
బహిర్గతం చేయని చరాస్తులపై ఇప్పుడు జరిమానా విధింపు
ఫ్యూచర్స్-ఆప్షన్స్ ట్రేడింగ్
విలాసవంతమైన వాచులు ఆల్కహాల్, సిగరెట్లు, బీడీలు, పాన్ మసాల, గుట్కా
కాఫీ రోస్టింగ్, బ్రూవింగ్, వెండింగ్ యంత్రాలు
కొన్ని రకాల ఎరువులపై దిగుమతి ఫీజులను తొలగించారు. అమోనియం ఫాస్ఫేట్, అమోనియం నైట్రో ఫాస్ఫేట్ వంటి వాటి ధరలు పెరగొచ్చు.
చిత్రీకరణకు వాడే పరికరాలు, కెమెరాలు ధరలు పెరిగే అవకాశాలున్నాయి.

# బడ్జెట్పై స్పందనలు..

### దేశంలో వాస్తవ సంక్షోభాలను పట్టించుకోని బడ్జెట్

'దేశంలో యువతకు ఉద్యోగాలు లేవు. తయారీ రంగం పతనమవుతోంది. రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రపంచ దేశాల నుంచి ఎదురు దెబ్బలు తగులుతున్నాయి. ఈ సంక్షోభాల గురించి బడ్జెట్లో ఎక్కడా ప్రస్తావన లేదు. దేశంలో వాస్తవ సమస్యలను కేంద్రం పట్టించుకోవట్లేదు'

**- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్**

'ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పేలవంగా ఉంది. కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రసంగం కూడా పారదర్శకంగా లేదు.బడ్జెట్లో కీలక కార్యక్రమాలు, సంక్షేమ పథకాల కేటాయింపుల గురించి ఎటువంటి ప్రస్తావన లేదు'

**- కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్**

## విద్యారంగంపై పూర్తి నిర్లక్ష్యం

'వాస్తవాలకు దూరంగా ఉంది. విద్యారంగానికి నిధులు కేటాయించలేదు. విద్య లేకుండా నవభారతాన్ని ఎలా నిర్మిస్తారు'

**- సమాజ్ వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్**

### సామాన్యులకు మేలు చేయని బడ్జెట్

'మహిళలు, యువత, రైతులకు వ్యతిరేకంగా బడ్జెట్ ఉంది. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన బడ్జెట్తో సామాన్యులకు ప్రయోజనమేమీ లేదు'

**- పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ**

## ఆర్థికాభివృద్ధికి ఊతమిస్తుంది

కేంద్ర బడ్జెట్ 140 కోట్ల మంది ఆకాంక్షలకు ప్రతిబింబం. ఇది సంస్కరణల ప్రయాణాన్ని బలోపేతం చేస్తుంది. మూలధన వ్యయానికి, వృద్ధికి మధ్య సమతూకం పాటించిన బడ్జెట్ ఇది. వికసిత్ భారత్ నిర్మాణానికి మార్గనిర్దేశనం చేస్తున్న చరిత్రాత్మక బడ్జెట్ అని కొనియాడారు. ఆత్మనిర్భర్ భారత్ కు తగిన కేటాయింపులు చేశారు. 2047 మిషన్ లక్ష్యాల అనుగుణంగా ఈ బడ్జెట్ ఉంది. త్వరలో ఇండియా మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగేందుకు ఈ పద్దు ఊతమిస్తుంది.

**- ప్రధాని మోడీ**

## ప్రతి రంగానికి సాధికారత కల్పించే బడ్జెట్

**కేంద్ర హోం మంత్రి అమిత్ షా**

ఈ బడ్జెట్ ద్వారా ప్రధానమంత్రి మోడీ స్వావలంబన మరియు అభివృద్ధి చెందిన భారతదేశం కేవలం నినాదం కాదని, ప్రభుత్వ సంకల్పం అని నిరూపించారన్నారు. ఈ బడ్జెట్ ప్రతి రంగానికి, ప్రతి తరగతికి మరియు ప్రతి పౌరుడికి సాధికారత కల్పించడానికి స్పష్టమైన బ్లూప్రింట్ను అందించిందన్నారు. అంతే కాకుండా ప్రతి అడుగులో వారికి సహాయపడే ప్రోత్సాహాన్ని అందించడానికి ఒక పునాది దార్శనికతను కూడా అందిస్తుందని పేర్కొన్నారు. ప్రతి రంగంలోనూ ప్రపంచ అగ్రస్థానంలో ఉండే భారతదేశాన్ని నిర్మించడానికి ఒక దార్శనికత అని కొనియాడా

# మైనారిటీలపై వివక్ష

**హైదరాబాద్, ఫిబ్రవరి 1:** కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్లో మైనారిటీల సంక్షేమాన్ని కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2026-27 సంవత్సరానికి మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు కేటాయించిన మొత్తం రూ. 3,400 కోట్లు అని, గత ఏడాదితో పోలిస్తే ఇది కేవలం రూ. 50 కోట్లు మాత్రమే పెరిగిందన్నారు. దేశం మొత్తం బడ్జెట్ రూ. 50.65 లక్షల కోట్ల (2025-26) నుంచి రూ. 53.5 లక్షల కోట్లకు పెరిగినా, అందులో మైనారిటీలకు దక్కిన వాటా అల్పమని ఆయన పేర్కొన్నారు. దేశ జనాభాలో 15% ఉన్న మైనారిటీలకు ఈ కేటాయింపులు ఏ మూలకూ సరిపోవని విమర్శించారు. కాంగ్రెస్ పాలిత తెలంగాణ ఒక్కటే 2025-26 లో తన మైనారిటీ సంక్షేమ శాఖకు రూ. 3,591 కోట్లు కేటాయించిందన్నారు. కర్ణాటక ప్రభుత్వం కూడా దాదాపు రూ. 4,000 కోట్లను కేటాయించిందని ఆయన గుర్తు చేశారు. దేశం మొత్తం కోసం కేంద్రం కేటాయించిన్న రూ. 3,400 కోట్లు, తెలంగాణ రాష్ట్రం ఒక్కటే కేటాయించిన నిధుల కంటే తక్కువగా ఉండటం శోచనీయమని ఆరోపించారు. గతంలో యూపీయే (2013-14) ప్రభుత్వం లో అప్పట్లో మొత్తం బడ్జెట్ రూ. 16.65 లక్షల కోట్లు ఉన్నప్పుడే మైనారిటీలకు రూ. 3,531 కోట్లు కేటాయించారన్నారు.

ఎన్డీఏ కాలంలో (2026-27) బడ్జెట్ రూ53.5 లక్షల కోట్లకు చేరినప్పటికీ, కేటాయింపులు రూ3,400 కోట్లకు పడిపోవడం పురోగతి కాదు, తిరోగమనం అని ఆయన ధ్వజమెత్తారు. దెబ్బతిన్న విద్యా, ఉపాధి రంగాలు, మైనారిటీ విద్యార్థులకు ఇచ్చే స్కాలర్షిప్పు, ఫెలోషిప్పు, విద్యా సహాయ పథకాలు బలహీనపడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు.

# వేడుకగా సమ్మక్క వన ప్రవేశం



(మొదటి పేజీ తరువాయి)

కూడా రాత్రి సమయంలో బయలుదేరినా... మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం పూనుగొండ్లలోని గుడిలోకి ఆదివారం ఉదయం ప్రవేశం చేశారు.

శనివారం ఉదయం నాటికి రద్దీ కొంతమేరకు తగ్గిపోయింది. భక్తులు నేరుగా గద్దెల వద్దకు చేరుకొని వన దేవతలను దర్శించుకున్నారు. అయితే, వివిధ ప్రాంతాల నుంచి మేడారానికి రావాల్సిన వేల సంఖ్యలో వాహనాలు శుక్రవారం రాత్రి నుంచి శనివారం మధ్యాహ్నం వరకు ట్రాఫిక్లో చిక్కుకున్నాయి. దీంతో శనివారం మధ్యాహ్నం తర్వాత మళ్లీ క్యూలైన్లు నిండుగా మారాయి.

### రాత్రంతా వాహనాల్లోనే అవస్థలు

జాతరలో మొక్కుల సమర్పణ తర్వాత శుక్రవారం సాయంత్రం బస్సులు, సొంత వాహనాల్లో వెనుదిరిగిన భక్తులు ట్రాఫిక్లో చిక్కుకుని రాత్రంతా వాహనాల్లోనే నానాఅవస్థలు పడ్డారు. మేడారం-తాడ్వాయి(13 కిలో మీటర్లు), తాడ్వాయి-పస్రా (20 కిలోమీటర్లు) మార్గాల్లో వందల సంఖ్యలో ఆర్టీసీ బస్సులు నిలిచిపోయాయి. అర్ధరాత్రిలోపే హైదరాబాద్కు వెళ్లాల్సిన వాహనాలు ఉదయం 8 గంటలకుగానీ చేరలేదు. హనుమకొండ నుంచి మేడారానికి మూడు గంటల్లో రావాల్సిన భక్తులకు ఏకంగా పది గంటల సమయం పట్టింది. ఈ క్రమంలో ప్రయాణికులు తీవ్ర అసహనానికి గురై ములుగు సమీపంలో ఆర్టీసీ బస్సు అద్దాలను ధ్వంసం చేశారు. రోడ్ల విస్తరణ చేపట్టామని, ఏఐను వినియోగించి యాప్ ద్వారా ట్రాఫిక్ చిక్కులకు చెక్ పెడతామని అధికారులు చెప్పినా... శనివారం మధ్యాహ్నానికిగానీ సమస్య తొలగలేదు.





# ఆరెంజ్ ఎకానమీకి అగ్రపీఠం

(మొదటి పేజీ తరువాయి)

డిజిటల్, సృజనాత్మక రంగాల్లో ఉపాధి అవకాశాలను విస్తరించడం, కొత్తతరం సృష్టికర్తలను పెంపొందించే లక్ష్యంతో ఈ కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. వీటితోపాటు తూర్పు భారతంలో నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ డిజైన్ను ఏర్పాటు చేయనున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి వెల్లడించారు. దేశంలో డిజైన్ రంగం వేగంగా విస్తరిస్తున్నప్పటికీ.. శిక్షణ పొందిన డిజైనర్ల కొరత ఉందన్నారు.

ఆర్థిక సర్వే సూచనలకు అనుగుణంగా..

దీర్ఘకాలిక ఆర్థిక వృద్ధికి సృజనాత్మక ఆధారిత రంగాలే చోదకాలని ఆర్థిక సర్వే పేర్కొంది. ఉపాధి కల్పన, పట్టణ సేవలు, పర్యటక రంగాలకు కీలకమని చెప్పింది. ఈ రంగాలకు అపారమైన వృద్ధి సామర్థ్యాలున్నాయని పేర్కొంది. అయితే, పరిమిత కేంద్రాలు, నైపుణ్యాల్లో అంతరాలు, నియంత్రణ అడ్డంకులు వంటి సవాళ్లు ఉన్నాయని, ఇందుకోసం విధానపరమైన మద్దతు అవసరమని సూచించిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం తాజా ప్రతిపాదనలు చేసింది.

# మూడు కర్తవ్యాల ప్రగతి బాటగా

## యువశక్తి కేంద్రంగా బడ్జెట్ పెడుతున్నానన్న నిర్మలా సీతారామన్

**ఢిల్లీ, ఫిబ్రవరి 1:** భారతదేశ ఆర్థిక ప్రయాణం స్థిరంగా సాగుతోందని, యువశక్తి కేంద్రంగా బడ్జెట్ ను ప్రవేశపెడుతున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. ప్రజల ఆకాంక్షలను ఆచరణలోకి తీసుకొస్తున్నామని, రైతులు, దళిత, ఆదివాసీ సమూహాలకు అభివృద్ధి ఫలాలు చేరాలన్నారు. మూడు కర్తవ్యాలను స్ఫూర్తిగా తీసుకుని కర్తవ్యభవన్లో రూపొందించిన బడ్జెట్ ఇదని ఆమె ప్రకటించారు.

### ప్రథమ కర్తవ్యం

ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న అనిశ్చిత పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని దేశంలో ఉత్పాదకత, పోటీతత్వాన్ని పెంచి సుస్థిరతర ఆర్థికాభివృద్ధి సాధించడం. మొదటి కర్తవ్యంలో భాగంగా ఈ కింద సూచించిన ఆరు రంగాల్లో సుస్థిర అభివృద్ధి సాధించడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు మంత్రి తెలిపారు.

**ఏడు వ్యూహాత్మక, నిర్దేశిత రంగాల్లో ఉత్పాదతకను వేగవంతం చేయడం**
**పారిశ్రామిక రంగాన్ని పునరుజ్జీవింపజేయడం.**
**ఛాంపియన్ ఎంఎస్ఎంఈల కోసం ప్రత్యేక కార్యాచరణ**
**మౌలిక సదుపాయాల కల్పనకు బలమైన ఊతం**
**దీర్ఘకాలిక ఇంధన భద్రత, స్థిరత్వం**
**నగర ప్రాంత ఆర్థిక కార్యకలాపాల అభివృద్ధి**
**వీటికి అనుబంధంగా బడ్జెట్లో మరికొన్ని ప్రతిపాదనలనూ, ఆర్థిక మంత్రి చేశారు. అవి..**
**హైటెక్ టూల్ రూమ్స్ ఏర్పాటు, పరిశ్రమలకు విద్యాసంస్థల అనుసంధానం**
**మెగా టెక్స్టైల్ పార్కుల ఏర్పాటు. 5 సూత్రాలతో ప్రత్యేక కార్యక్రమం**
**టెక్స్టైల్ రంగం కోసం వచ్చే ఐదేళ్లకు రూ.10వేల కోట్లు**
**జౌళి ఉత్పత్తుల అంతర్జాతీయ బ్రాండింగ్ కోసం ప్రత్యేక కార్యాచరణ**
**రూ.10వేల కోట్లతో వచ్చే ఐదేళ్లకు బయో ఫార్మా శక్తి పథకం**
**ఫార్మా విద్య, పరిశోధనకు జాతీయ స్థాయిలో మూడు కొత్త విద్యా సంస్థల**

### రెండో కర్తవ్యం

ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంతో పాటు, వారి శక్తి సామర్థ్యాలను పెంపొందించి సుసంపన్న భారత్ దిశగా అడుగులు వేసేలా భాగం చేయడం. ఈ దిశగా ఇప్పటికే అడుగులు పడినట్లు తెలిపారు.

గత పదేళ్ల కాలంలో దేశంలో స్థిరమైన ప్రభుత్వం, సంస్కరణల కారణంగా సుమారు 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారని వెల్లడించారు.

**ప్రైవేటు రంగ భాగస్వామ్యంతో మెడికల్ టూరిజం సర్వీసులు**
**ఐదు రీజినల్ మెడికల్ హబ్స్ ఏర్పాటు**
**ఆయుష్ కేంద్రాల అప్గ్రెడేషన్, సంప్రదాయ వైద్య పరిశోధనకు జామ్ నగర్లో పరిశోధన కేంద్రం ఏర్పాటు**
**ప్రైవేటు రంగంలో పశువైద్య, డయాగ్నస్టిక్స్ ఏర్పాటుకు ప్రోత్సాహం**
**యువత కోసం వైద్య రంగంలో కొత్త కోర్సుల ఏర్పాటు**
**యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్ రంగాలకు చేయూత**
**నేషనల్ డిజిటల్ విజ్ఞాన కేంద్రం ఏర్పాటు**
**ఖేలో ఇండియా మిషన్లో భాగంగా క్రీడాభివృద్ధి**

### మూడో కర్తవ్యం

సబ్ కా సాత్ సబ్ కా వికాస్ విజన్ తో దేశంలోని ప్రతి కుటుంబం, వర్గం, మతం, రంగానికి వనరులు, సదుపాయాలు, అవకాశాలను అందిస్తూ అభివృద్ధిలో అర్థవంతమైన భాగస్వాములుగా చేయడం.

**రైతుల ఆదాయం పెంచడమే లక్ష్యం**
**దివ్యాంగుల కోసం దివ్యాంజన్ కౌశల్ యోజన, దివ్యాంగ్ సహకార యోజన**
**మానసిక వ్యాధుల చికిత్సకు నిమ్హ్యాన్స్-2. రాంచీ, తేజ్పూర్లలో నేషనల్ మెంటల్ హెల్త్ ఇనిస్టిట్యూట్ అప్గ్రెడేషన్**
**భారత్ విస్తార్ (వర్చువల్ ఇంటిగ్రేటెడ్ సిస్టమ్ టు యాక్సెస్ అగ్రికల్చర్ రిసోర్స్) వ్యవసాయ రంగానికి కృత్రిమ మేధను అనుసంధానం చేయడం ద్వారా ఉత్పత్తి పెంపు, మదింపు చేసి, రైతులు సస్యరక్షణ చర్యలు తీసుకునేలా ప్రోత్సహించడం**
**తూర్పు ప్రాంతంలోని 5 పూర్వోదయ రాష్ట్రాల్లో పర్యాటక ప్రాంతాల అభివృద్ధి, ఇందు కోసం 4వేల ఇ-బస్ల అందించటం**
**అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం, అస్సాం, మణిపూర్, మిజోరం, త్రిపుర రాష్ట్రాల్లో బుద్ధిస్ట్ సర్క్యూట్ అభివృద్ధి**

మొదటి రెండు కర్తవ్యాలు దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తే,

మూడో కర్తవ్యం ద్వారా 2047 నాటికి సమగ్రాభివృద్ధితో వికసిత్ భారత్గా మారడానికి మార్గాన్ని సుగమం చేస్తుందని బడ్జెట్ ప్రసంగం సందర్భంగా నిర్మలా సీతారామన్ తెలిపారు.

# తెలంగాణకు గుండు సున్నా.. కార్పొరేట్లకు వరం

● సీపీఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

హైదరాబాద్, ఫిబ్రవరి 1 : కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్లో తెలంగాణకు గుండు సున్నా ఇచ్చిందని, కార్పొరేట్లకు వరంగా మారిందని సీపీఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం విమర్శించారు. ఇవాళ పార్లమెంటులో ప్రవేశపెట్టిన 2026-27 వార్షిక బడ్జెట్ తెలంగాణ ప్రజల ఆశలపై నీళ్లు చల్లిందని, ఇది పూర్తిగా నిరాశజనకమని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఆదివారం బడ్జె ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రం నుండి కేంద్రానికి వేల కోట్ల రూపాయల పన్నులు వెళ్తున్నప్పటికీ, తిరిగి నిధులు కేటాయించడంలో కేంద్రం మరోసారి తెలంగాణ పట్ల వివక్ష చూపిందని ఆయన మండిపడ్డారు. విభజన హామీలైన కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు పరిశ్రమ ఊసే ఎత్తకపోవడం కేంద్ర ప్రభుత్వ చిత్తశుద్ధి లేమికి నిదర్శనమని అన్నారు. వ్యవసాయ ఆధారిత దేశంలో, రైతుల సంక్షేమాన్ని కేంద్రం గాలికి వదిలేసిందని, స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం పంటలకు కనీస మద్దతు ధర (ఎమ్ఎస్పీ) చట్టంపై ఎలాంటి ప్రకటన చేయకపోవడం దారుణమని అన్నారు. ఎరువుల సబ్సిడీలలో కోత విధించడం నల్లగొండ వంటి వ్యవసాయ ఆధారిత జిల్లాల రైతులపై పెనుభారం మోపుతుందని వివరించారు.

**చేనేత రంగానికి అన్యాయం:**

పోచంపల్లి, నారాయణపూర్, పుట్టపాక వంటి ప్రాంతాల్లోని చేనేత కార్మికులు ఎప్పటినుండో కోరుతున్నట్లుగా, చేనేత ఉత్పత్తులపై జీఎస్టీని ఎత్తి వేయకపోవడం శోచనీయమన్నారు. ముడి సరుకుల ధరలు పెరిగి నేతన్నలు ఇబ్బంది పడుతుంటే, బడ్జెట్లో వారికి ఎలాంటి ఊరట కల్పించలేదని పేర్కొన్నారు. నల్లగొండ జిల్లా ఫ్లోరోసిస్ బాధితుల పునరావాసానికి లేదా ఫ్లోరోసిస్ రీసెర్చ్ సెంటర్ బలోపేతానికి ప్రత్యేక నిధులు కేటాయించకపోవడం విచారకరం. అలాగే రీజినల్ రింగ్ రోడ్ భూసేకరణ కు సంబంధించి కేంద్ర వాటా నిధులపై స్పష్టత లేదు.

**నిరుద్యోగం – ధరల పెరుగుదల:**

పెట్రోల్, డీజిల్ ధరలను జీఎస్టీ పరిధిలోకి తీసుకురాకపోవడం వల్ల నిత్యావసర ధరలు సామాన్యుడికి అందుబాటులో లేకుండా పోతున్నాయని, దేశంలో నిరుద్యోగం పెరుగుతుంటే, యువతకు ఉపాధి కల్పించే నిర్దిష్ట ప్రణాళికలేవీ ఈ బడ్జెట్లో లేవని ఆరోపించారు. తెలంగాణకు రైల్వే లైన్లు, కోచ్ ఫ్యాక్టరీ, విమానాశ్రయాల అభివృద్ధి, భారత్ ఫ్యూచర్ సిటీ, మెట్రో కారిడార్, నిరుద్యోగం రూపు మాపేందుకు, ఉద్యోగ, ఉపాధి మార్గాలు, కొత్త జాతీయ రహదారులకు బడ్జెట్ లో ఏమాత్రం కేటాయింపులు లేకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వంపై వివక్ష చూపిందని ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ పై మండిపడ్డారు. యువత, మహిళ సంస్కరణలను ఎన్డీఏ ప్రభుత్వం విస్మరించిందని ఇఖ్తౌ నెల్లికంటి సత్యం ఆరోపించారు. కేంద్ర మంత్రి నిర్మల సీతారామన్ 9 సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టినా అంకెల గారడీ తప్పా.. పేద, మధ్య తరగతి, రైతు, మహిళలకు ఒరిగింది ఏమీ లేదని, పెరిగిన ధరలకు అనుగుణంగా కేంద్ర బడ్జెట్ లో ఎలాంటి చర్యలు తీసుకోలేదని చివరగా, ఈ బడ్జెట్ కేవలం అంకెల గారడీ తప్ప, సామాన్య ప్రజలకు, రైతులకు, కార్మికులకు ఒరిగేదేమీ లేదని, ఇది పూర్తిగా కార్పొరేట్ అనుకూల బడ్జెట్ అని ఆయన అభివర్ణించారు. రాష్ట్ర హక్కుల సాధన కోసం రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో గళం విప్పుతామని హెచ్చరించారు.



మనం దిన పత్రిక ప్రచురణా సంస్థ నవతరం పబ్లికేషన్స్ ఫైనాన్స్ జనరల్ మేనేజర్గా ఛార్జి తీసుకున్న అభిషేక్ కుమార్ పటేల్, అడ్మిన్ జనరల్ మేనేజర్గా ఛార్జి చేపట్టినచాముండేశ్వరికి స్వాగతం పలికి సత్కరిస్తున్న మనం ఎడిటర్ వుప్పురి రమేశ్, అసోసియేట్ ఎడిటర్ టీ. కృష్ణ, ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ ఎన్. మదనయ్య, నెట్ వర్క్ ఇన్ఛార్జి కె. విజయ్ కుమార్, ఏపీ స్టేట్ ఇన్ఛార్జి జ్ఞానేశ్వర్, స్పెషల్ కరస్పాండెంట్ చెన్నూరి నాగ శ్రీధర శర్మ, తదితరులు.

# దేశాభివృద్ధిలో రాజీ లేని బడ్జెట్

## మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్

ఢిల్లీ, ఫిబ్రవరి 1 : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్.. దేశాభివృద్ధిలో రాజీ పడకుండా ఉందని బీజేపీ మల్కాజ్ గిరి ఎంపీ ఈటల రాజేందర్ వ్యాఖ్యానించారు. రూ.53 లక్షల కోట్లకు పైగా అంచనాలతో బడ్జెట్ ఉందని పేర్కొన్నారు. దేశ ప్రజల హితమే ధ్యేయంగా బడ్జెట్ ఉందని చెప్పుకొచ్చారు. ఢిల్లీ వేదికగా ఆదివారం ఈటల రాజేందర్ మీడియాతో మాట్లాడారు. గత బడ్జెట్ కంటే ఎక్కువగా రూ.1.50 లక్షల కోట్ల నిధులను గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కేటయించారని వెల్లడించారు. దేశంలో 7 శాతం జీడీపీ పెరగడానికి యువత, విద్యార్థులను ప్రోత్సహించేందుకు స్టార్ట్ అప్లకు పెద్ద పీట వేశారని తెలిపారు.

**యువతను ప్రోత్సహించేలా..**

యువతను ప్రోత్సహించేలా కేంద్ర ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుందని ఎంపీ ఈటల రాజేందర్ తెలిపారు. క్యాపిటల్ ఇన్వెస్ట్మెంట్కి కేంద్రం రూ.12 లక్షల కోట్ల నిధులు కేటాయించిందని వివరించారు. ప్రతి జిల్లాకు ట్రామా సెంటర్ ఏర్పాటు కానుందన్నారు. కేన్సర్తో సహా 17 రకాల మందుల ధరలు తగ్గనున్నాయని తెలిపారు. దేశవ్యాప్తంగా వివిధ రంగాల వారీగా.. బడ్జెట్లో పెద్దపీట వేశారని చెప్పుకొచ్చారు. దిగుమతులు తగ్గించుకునేలా చర్యలు తీసుకున్నారని తెలిపారు. మొత్తంగా బడ్జెట్లో పేదలు, యువత, విద్యార్థులకు పెద్దపీట వేశారని ఎంపీ ఈటల రాజేందర్ పేర్కొన్నారు.



**ఫోన్ ట్యాపింగ్ కేసుపై ఈటల కీలక వ్యాఖ్యలు..**

ఫోన్ ట్యాపింగ్ కేసుపై ఎంపీ ఈటల రాజేందర్ కీలక వ్యాఖ్యలు చేశారు. మాజీ సీఎం కేసీఆర్ సిట్ విచారణపై స్పందించారు. ఫోన్ ట్యాపింగ్ జరిగిందని ఇప్పటికే రుజువైందని తెలిపారు. సిట్కి లోబడి విచారణ ఉంటుందని ఎంపీ ఈటల రాజేందర్ వెల్లడించా

# బడ్జెట్లో గుండు సున్నా: కల్వకుంట్ల కవిత ఫైర్

హైదరాబాద్,ఫిబ్రవరి 1(మనం,ప్రత్యేకప్రతినిధి): కేంద్రంలోని బీజేపీ సర్కారు తెలంగాణకు గుండు సున్నానే దక్కిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. 12వ బడ్జెట్లోనూ తెలంగాణకు నిధులు ఇవ్వలేదని కవిత కేంద్ర బడ్జెట్ పై ఎక్స్ వేదిక స్పందించారు. పన్నెండేళ్లుగా తెలంగాణను మోసం చేయడం బీజేపీకి అలవాటుగా మారిందన్నారు. కో-ఆపరేటివ్ ఫెడరలిజం అంటూ ప్రధాని మోడీ నిత్యం చెబుతుంటారు కానీ ఆచరణలో మాత్రం పూర్తి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారన్నారు. విభజన హామీలు సహా తెలంగాణ ప్రాజెక్టులకు రావాల్సిన నిధులన్నింటినీ పెండింగ్లో పెట్టారని విచారం వ్యక్తం చేశారు. స్థిరత్వం, క్రమశిక్షణ, వృద్ధి అంటూ నినాదాలు చెప్పే బీజేపీ పెద్దలు ఎందుకు తెలంగాణ విషయంలో వివక్ష చూపుతున్నారో చెప్పాలని ప్రశ్నించారు.

**8 మంది ఉన్నా ఏం లాభం :**



తెలంగాణ నుంచి బీజేపీకి 8 మంది ఎంపీలను ఇస్తే రాష్ట్రానికి ఏమాత్రం లాభంలేదని, రాష్ట్రానికి నిధులు రావాల్సిన దానికి బదులు పెండింగ్ ఫైల్స్ వస్తున్నాయని కవిత పేర్కొన్నారు. రూ. 34 వేల 367 కోట్లతో చేపట్టాల్సిన రీజినల్ రింగ్ రోడ్, హైవేలు, రేడియల్ రోడ్లకు నిధులు నిలిచిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. మెట్రో ఫేజ్ 2 విస్తరణకు ఇవ్వాల్సిన 50 శాతం నిధులు ఇవ్వలేదన్నారు. కొత్త రైల్వే లైన్స్ కు క్లియరెన్స్ లు ఇవ్వకపోగా, వరంగల్ కోచ్ ఫ్యాక్టరీని అటకెక్కించారని మండిపడ్డారు. తెలంగాణకు దక్కాల్సిన ఐఐఎం, 16 నవోదయ విద్యాలయాలు, 9 కేంద్రీయ విద్యాలయాలను ఇవ్వడం లేదన్నారు. విభజన చట్టం హామీలైన బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీని పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే విధంగా పారిశ్రామిక ప్రోత్సహకాలు ఏమీ ఇవ్వలేదన్నారు. ఇలా చెప్పుకుంటే పోతే తెలంగాణకు బీజేపీ చేసిన అన్యాయాల జాబితా చాంతాడంతా ఉందన్నారు. ప్రధాని మోడీ చెప్పే కో ఆపరేటివ్ ఫెడరలిజం అంటే తెలంగాణ ప్రయోజనాలను కాలరాయమటేనా అని కవిత ప్రశ్నించారు.

# డైవర్షన్, సబ్ వెర్షన్, పర్ వర్షన్

## కేసీఆర్ సిట్ విచారణపై కేటీఆర్



హైదరాబాద్, ఫిబ్రవరి 1 : వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మళ్లించడమే కాంగ్రెస్ పాలన అని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. కేసీఆర్ సిట్ విచారణ ముగిసిన తర్వాత నందినగర్లోని నివాసంలో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. ''రెండేళ్ల కాంగ్రెస్ పాలన గురించి మూడు ముక్కల్లో చెప్పాలంటే.. డైవర్షన్, సబ్ వెర్షన్, పర్ వర్షన్. ఇది ఈ రాష్ట్రంలో రెండేళ్లుగా జరుగుతున్న కాంగ్రెస్ పాలన తీరు. 8 + 8 గుండుసున్నా అన్నట్టుగా రాష్ట్ర పరిస్థితి ఉంది. కాంగ్రెస్, భాజపా అసమర్థత వల్ల రాష్ట్రానికి అన్యాయం జరుగుతోంది. కేంద్ర బడ్జెట్లో గత రెండు సార్లు దక్కింది సున్నా, ఈ సారి కూడా రాష్ట్రానికి గుండుసున్నా అని తెలుసు కాబట్టే ఆగమేఘాల మీద విచారణ తెరపైకి తెచ్చారు. కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి అన్యాయం జరిగితే ఒక్కరూ స్పందించలేదు.

ప్రజల్లో అపోహలు, అసత్యాలు సృష్టించేందుకే సిట్ విచారణ పేరుతో నాటకాలు సిట్ అధికారులు చట్టాన్ని గౌరవించలేదు. రాష్ట్ర ప్రభుత్వం ఆడించినట్లుగా సిట్ ఆడుతోంది. చట్ట ప్రకారం కేసీఆర్ ఉన్న చోటే విచారణ జరగాల్సి ఉంది. మేం కోర్టుకు వెళ్తే మాకు అనుకూలంగా తీర్పు వచ్చే అవకాశం ఉంది. అయినా, చట్టాన్ని గౌరవిస్తూ కేసీఆర్.. సిట్ విచారణకు హాజరయ్యారు. రాష్ట్రంలో దిగజారిన శాంతిభద్రతల గురించి పట్టించుకునేవారే లేరు. ఎక్సైజ్ కానిస్టేబుల్ను గంజాయి ముఠా చంపితే కూడా పట్టించుకునేవారు లేరు. మేడారం జాతరలో పరిస్థితులు అధ్వానంగా ఉన్నాయని ప్రజలు అంటున్నారు. సిట్ విచారణల పేరుతో కాలక్షేపం చేయడమే కాంగ్రెస్ ఉద్దేశం. దిల్లీకి 50..60 ట్రిప్పులు కొట్టారు గానీ, సాధించిందేమీ లేదు. ఇకనైనా డైవర్షన్ రాజకీయాలు మానుకొని అభివృద్ధిపై దృష్టి సారించాలి'' అని కేటీఆర్ అన్నా

# కుట్రలు, కక్షలు, అక్రమ కేసులు

హైదరాబాద్, మనం ప్రతినిధి : ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ తెలంగాణ రాజకీయ వర్గాల్లో తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తోంది. సిట్ విచారణకు ముందు ఆదివారం మధ్యాహ్నం బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్.. పలు డాక్యుమెంట్లతో హైదరాబాద్ నందినగర్ నివాసానికి చేరుకున్నారు. ఈ మొత్తం ప్రక్రియను సిట్ అధికారులు వీడియో రికార్డు చేస్తున్నారు. ఈ విచారణ కోసం కేసీఆర్ ఉదయం ఎర్రవల్లి ఫాంహౌజ్ నుంచి నందినగర్ నివాసానికి చేరుకున్నారు.

ఆయనకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్వాగతం పలికారు. విచారణకు సిట్ అధికారులు పూర్తి సన్నద్ధతతో రాగా, కేసీఆర్ కూడా తన వెంట ఒక నోట్బుక్, కొన్ని ముఖ్యమైన పత్రాలను తెచ్చుకున్నారు. అయితే, కేసీఆర్ వెంట మాజీ ఎంపీ సంతోశ్ రావు ఉండేందుకు అనుమతి ఉందని, ఈ విషయాన్ని బీఆర్ఎస్ లీగల్ టీమ్ సిట్కు తెలియజేసినట్లు సమాచారం. మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సిట్ విచారణకు ముందు మధ్యాహ్న భోజన సమయంలో కేసీఆర్ తీవ్ర భావోద్వేగానికి లోనైనట్లు తెలిసింది.

తెలంగాణ సాధనకు వ్యూహరచన చేసిన గదిలోనే ఇప్పుడు విచారణ ఎదుర్కోవాల్సి రావడం తనను తీవ్రంగా బాధిస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 'స్వరాష్ట్ర సాధన కోసం ఇదే గదిలో ఎన్నో నిద్రలేని రాత్రులు గడిపాను. కీలక చర్చలు జరిపాను. అలాంటి చోట ఈ పరిస్థితి వస్తుందని ఊహించలేదు' అని కేసీఆర్ వ్యాఖ్యానించినట్లు సమాచారం. విచారణ నేపథ్యంలో పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. నందినగర్ పరిసరాల్లో భారీ బందోబస్తు మోహరించారు. విచారణ ప్రారంభం కాగానే మాజీ మంత్రి హరీష్ రావుతో పాటు ఇతర నేతలను బయటకు పంపించారు. నిబంధనల ప్రకారం కేసీఆర్ తరపున న్యాయవాదులను లోపలికి అనుమతించేందుకు సిట్ అధికారులు నిరాకరించారు.

తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ను ఫోన్ ట్యాపింగ్ కేసులో స్పెషల్ ఇనివెస్టిగేషన్ టీమ్ (సిట్) అధికారులు.. నందినగర్ లోని ఆయన నివాసంలో ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు కేసీఆర్ను ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో అంతకుముందు ఎర్రవెల్లిలోని ఫాంహౌస్ నుంచి బయలుదేరిన కేసీఆర్కు దారి పొడవునా బీఆర్ఎస్ శ్రేణులు, మద్దతు దారులు సంఘీభావం తెలిపారు. కేసీఆర్ సిట్ విచారణకు హాజరవుతున్న నేపథ్యంలో తెలంగాణ పోలీసు శాఖ అప్రమత్తమైంది. ఇదిలాఉంటే, తమ అధినేత కేసీఆర్కు సిట్ నోటీసులు, విచారణను జీర్ణించుకోలేని బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున నందినగర్కు చేరుకోవడానికి ప్రయత్నించారు.

దీంతో కేసీఆర్ నివాసం చుట్టుపక్కల పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

**ఇంటెలిజెన్స్ చీఫ్ హెచ్చరిక**

కేసీఆర్ విచారణ నేపథ్యంలో బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టే అవకాశం ఉందని కమిషనర్లు, ఎస్పీలను ఇంటెలిజెన్స్ చీఫ్ హెచ్చరించారు. ముందస్తు భద్రతా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. విచారణ ముగిసే వరకు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద పరిస్థితులపై వేగంగా స్పందించాలని సూచించారు.

**ట్రాఫిక్ ఆంక్షలు..**

నందినగర్, బసవతారకం రోటరీ, అగ్రసేన్ జంక్షన్, ఎన్టీఆర్ భవన్, రోడ్ నెంబర్-12 ప్రాంతాల్లో వాహనాల రాకపోకలపై ఆంక్షలు విధించనున్నట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. వాహనాలను నిలిపివేయడం లేదా మళ్లించడం చేయనున్నట్లు వివరించారు. ప్రయాణికులు ప్రత్యామ్నాయ మార్గాలు వినియోగించుకోవాలని సూచించారు.

# అది సిట్ కాదు?.. సీఎం ఇన్స్ట్రక్షన్ టీమ్

## కేసీఆర్కు నోటీసులు నూరుశాతం కక్షసాధింపే

## పాలన వైఫల్యాల దృష్టి మళ్లించేందుకే కొత్త డ్రామా

## చట్టబద్ధం కాకపోయినా కేసీఆర్ దర్యాప్తునకు సహకరిసున్నరు?



హైదరాబాద్, మనం ప్రతినిధి : ఫోన్ ట్యాపింగ్ కేసులో ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)పై బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఇది 'సిట్' కాదని, 'సీఎం ఇన్స్ట్రక్షన్ టీమ్' అని ఆయన కొత్త అర్థం చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విదేశాల నుంచి ఫోన్లో ఏది చెబితే, ఇక్కడి పోలీసులు అదే పాటిస్తున్నారని ఆరోపించారు. సిట్ స్వతంత్రంగా పనిచేయడం లేదన్నారు. సీఎం కార్యాలయం నుంచి వచ్చే ఆదేశాల ప్రకారమే నడుచుకుంటోందని, 'సిట్ అంటే సిట్, స్టాండ్ అంటే స్టాండ్' అన్నట్లుగా వారి వైఖరి ఉందని ఎద్దేవా చేశారు. ఇక, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్కు సిట్ నోటీసులివ్వడం రాజకీయ కక్షసాధింపు చర్యల్లో పరాకాష్ఠ అని హరీశ్ రావు అభివర్ణించారు. ఈ నోటీసుల వెనుక చట్టం లేదని, కేవలం సీఎం రేవంత్ రెడ్డి అహంకారం, రాజకీయ ప్రతీకారం మాత్రమే ఉన్నాయని ధ్వజమెత్తారు. పదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన నేతకు కనీస మర్యాద ఇవ్వకుండా, ఆయన నివాసం ఎక్కడ ఉందో రాష్ట్రమంతటికీ తెలిసినా, నందినగర్లోని ఇంటి గోడకు నోటీసులు అంటించడం కాంగ్రెస్ ప్రభుత్వ చౌకబారు రాజకీయాలకు నిదర్శనమని మండిపడ్డారు.

పాలన చేతకాక, ఇచ్చిన హామీలు నెరవేర్చలేక, ప్రజా సమస్యలకు సమాధానం చెప్పలేక ప్రభుత్వంపై పెరుగుతున్న వ్యతిరేకతను పక్కదారి పట్టించేందుకే ఈ సిట్ డ్రామా ఆడుతున్నారని హరీశ్ రావు ఆరోపించారు. వరుస కుంభకోణాల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు, మున్సిపల్ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే ఈ చిల్లర రాజకీయాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. చరిత్రను సృష్టించిన వ్యక్తి కేసీఆర్ అయితే, ఆ చరిత్రను మలినం చేయాలని చూస్తున్న చరిత్రహీనుడు రేవంత్ రెడ్డి అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వం ఇచ్చిన నోటీసులు చట్టబద్ధం కానప్పటికీ, అనుసరించిన విధానం రాజ్యాంగ విరుద్ధమైనప్పటికీ.. కేసీఆర్ ఒక బాధ్యతాయుతమైన ప్రతిపక్ష నేతగా, భారత పౌరుడిగా దర్యాప్తునకు పూర్తిగా సహకరిస్తున్నారని హరీశ్ రావు స్పష్టం చేశారు. అయినప్పటికీ పోలీసులు అతిగా ప్రవర్తిస్తున్నారని, గజ్వేల్ నుంచి హైదరాబాద్ వరకు వేలాది మందిని మోహరించి, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను అక్రమంగా అరెస్టులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ వారిని ఇబ్బందులకు గురిచేస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. రైతుల కష్టాలు, యువత ఉద్యోగాలు, పింఛన్ల పెంపు వంటి అంశాలను గాలికొదిలి, ప్రతిపక్షాలను లక్ష్యంగా చేసుకోవడమే కాంగ్రెస్ ప్రభుత్వం పనిగా పెట్టుకుందని విమర్శించారు.

# ఎన్ని కుట్రలు చేసినా తలొగ్గేది లేదు?

● తలసాని శ్రీనివాస్ యాదవ్

హైదరాబాద్, మనం ప్రతినిధి : కాంగ్రెస్ ప్రభుత్వం రాజ్యాంగాన్ని కాలరాస్తున్నదని మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ విమర్శించారు. 160 సీఆర్పీసీ నోటీసులను తుంగలో తొక్కేలా పోలీసులు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. మున్సిపల్ ఎన్నికల్లో ఓడిపోతామన్న భయంతోనే సిట్ విచారణ పేరుతో కాంగ్రెస్ సర్కార్ డ్రామాలు ఆడుతోందని తలసాని శ్రీనివాస్ యాదవ్ విమర్శించారు. బీఆర్ఎస్పై కక్షపూరిత రాజకీయాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఎన్ని కుట్రలు చేసినా తలొగ్గేది లేదని.. ప్రజల పక్షాన పోరాడుతూనే ఉంటామని స్పష్టం చేశారు. మహబూబ్నగర్ జిల్లా జడ్చర్లలో మాజీ మంత్రి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ చౌరస్తా నుంచి నల్ల బ్యాడ్జీలు, నల్లజెండాలతో బైక్ ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ బైక్ ర్యాలీ చేపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందని మాజీ మంత్రి సి.లక్ష్మారెడ్డి విమర్శించారు. కేసీఆర్ను సిట్ విచారణకు పిలవడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ సిట్ నోటీసులు, విచారణ అంతా డ్రామా అని అన్నారు. కేసులో పసలేకనే రెండేళ్లుగా సాగదీస్తున్నారని విమర్శించారు.

# అహింసా పట్టు.. ఇప్పుడిది జాతీయ ట్రెండు

హైదరాబాద్, ఫిబ్రవరి 1 : పట్టు వస్త్రాలంటే అందరికీ మక్కువే. అందులోనూ బెనారసీ, కంచి, మైసూర్.. తదితర పట్టుచీరలంటే మహిళలకు మరింత ప్రియం. ఈ వస్త్రాల తయారీలో వేర్వేరు నైపుణ్యాలున్నా.. పట్టు సేకరణలో ఒకే విధానం ఉంటుంది. పట్టు తంతువు పొడవుగా లభించాలంటే పురుగు బయటకు రాకముందే మరిగే నీటిలో పట్టుగూడు (కకూన్)ను వేసి దారం (తంతువు) తీస్తారు. వేడి నీటిలో వేయడంతో పురుగు చనిపోతుంది. దీనికి భిన్నంగా పురుగును చంపకుండా తీసే పట్టుకు 'అహింసా పట్టు' అని పేరొచ్చింది. దీన్ని ఎరి పట్టు అంటారు. ఈ ప్రక్రియలో చిమ్మట (పురుగు)ను పట్టుగూడు నుంచి వేరుచేసి గూడును మాత్రమే వేడినీటిలో మరిగించి దారం తీస్తారు. ఈ ప్రక్రియలో పొడవైన తంతువు రాదు. చిన్న ముక్కలుగా విరిగిపోతుంది. వీటిని మెలివేసి పట్టు నూలు తయారు చేస్తారు.

ఇది సాధారణ పట్టు కంటే కాస్త గట్టిగా, మృదువుగా ఉంటుంది. గూడు నుంచి వేరుచేసిన పురుగులు మళ్లీ గుడ్లు పెడతాయి. ఎరి అంటే.. ఆముదం (హిందీలో ఎరండీ అంటారు) ఆకులను ఈ పట్టుపురుగులకు ఆహారంగా వేస్తారు. అందుకే వీటిని ఎరి పట్టు పురుగులంటారు. ఈ పట్టు రకాన్ని 'ఎరి పట్టు' అని పిలుస్తారు. ఈ వస్త్రాలను ఎక్కువగా ఈశాన్య రాష్ట్రాలైన అరుణాచల్ప్రదేశ్, అస్సాం, మణిపుర్, మేఘాలయ, మిజోరం, నాగా లాండ్, త్రిపుర, సిక్కింలలో తయారు చేస్తుంటారు. తరాలుగా ఈ కళను (విధానాన్ని) పరిరక్షిస్తున్న మేఘాలయలోని ఖాసీ సమాజాన్ని ప్రధాని మోదీ మన్ కీ బాత్ కార్యక్రమంలో ప్రశంసించారు.

# ట్రంప్ టారిఫ్లకు చెక్!

## సుంకాల ప్రభావం మోసే వాటికి 'రిలీఫ్' కలిగించిన కేంద్రం




ఢిల్లీ, ఫిబ్రవరి 1 : ట్రంప్ టారిఫ్లతో దేశీయంగా కొన్ని రంగాల ఎగుమతులపై ప్రతికూల ప్రభావం పడింది. ముఖ్యంగా సీఫుడ్, జౌళి పరిశ్రమలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. దీంతో ఈ రంగాలకు ఊరటనిచ్చేలా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్లో పలు కీలక ప్రతిపాదనలు చేశారు. దీంతో పాటు దేశీయ తయారీని ప్రోత్సహించే దిశగా విమాన తయారీ నుంచి అణు విద్యుత్ ప్రాజెక్ట్ వరకు అనేక రకాల ముడి పదార్థాలు, వస్తువులను కస్టమ్స్ సుంకాలను మినహాయించారు.

**ఎగుమతిదారులకు ఊరట..**

- ◆ అమెరికా సుంకాల ప్రభావం ఎక్కువగా ఉన్న జౌళి, సీఫుడ్ పరిశ్రమల్లో ఎగుమతుల పోటీతత్వాన్ని పెంపొందించే లక్ష్యంగా బడ్జెట్లో పలు చర్యలు తీసుకున్నారు.
- ◆ ఎగుమతి చేసే సముద్రపు ఆహార పదార్థాల ప్రాసెసింగ్ కోసం ఉపయోగించే నిర్దిష్ట ముడిసరుకులపై సుంకం లేని దిగుమతుల పరిమితిని 1 శాతం (ఫ్రీ ఆన్ బోర్డ్ విలువలో) నుంచి 3శాతానికి పెంచారు.
- ◆ ప్రస్తుతం ఎగుమతి చేసే లెదర్, సింథటిక్ ఫుట్ వేర్ కు వర్తిస్తున్న విధంగానే.. షూ అప్పర్లకు కూడా నిర్దిష్ట ముడి పదార్థాల దిగుమతులపై సుంకం మినహాయింపును అనుమతిస్తున్నట్లు తెలిపారు.
- ◆ లెదర్, జౌళి ఉత్పత్తులు, సింథటిక్ ఫుట్వేర్ ఫైనల్ ప్రొడక్ట్ ఎగుమతుల గడువును 6 నెలల నుంచి ఏడాదికి పెంచా

**వీటిపై కస్టమ్స్ సుంకాల మినహాయింపు..**

- ◆ అణు విద్యుత్ ప్రాజెక్టులకు అవసరమయ్యే ఉత్పత్తుల దిగుమతులపై ప్రస్తుతమున్న బేసిక్ కస్టమ్స్ డ్యూటీ మినహాయింపు 2035 వరకు కొనసాగుతుంది.
- ◆ కీలక ఖనిజాలకు అవసరమయ్యే మూలధన ఉత్పత్తుల దిగుమతులపై కస్టమ్స్ సుంకం మినహాయింపు
- ◆ పౌర, రక్షణ రంగానికి సంబంధించి శిక్షణ, ఇతర విమానాల తయారీకి అవసరమయ్యే విడిభాగాల దిగుమతులపై కస్టమ్స్ డ్యూటీ మినహాయింపు
- ◆ మైక్రోవేవ్ ఓవెన్ల తయారీకి అవసరమైన కొన్ని ఎంపిక చేసిన ఉత్పత్తులపై దిగుమతి సుంకం మినహాయింపు
- ◆ బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ తయారీ భాగాలు, సోలార్ గ్లాస్లో ఉపయోగించే సోడియం యాంటీమోనేట్ వంటివాటికి కూడా దిగుమతి సుంకం నుంచి మినహాయింపు కల్పించారు.
- ◆ ఎక్స్క్లూజివ్ ఎకనమిక్ జోన్లో ఫిషింగ్బోట్లకు చేపల వేటపై సుంకం మినహాయింపు ఇచ్చారు.
- ◆ కొరియర్ ద్వారా చేసే ఎగుమతుల కన్సైన్మెంట్లపై ప్రస్తుతం ఉన్న రూ.10లక్షల పరిమితిని తొలగిస్తున్నట్లు ప్రకటించారు. దీని వల్ల ఎంఎస్ఎంఈలు, స్టార్టప్లకు ప్రపంచ మార్కెట్ అవకాశాలు లభించనున్నాయి.

**జౌళి రంగానికి బూస్ట్..**

జౌళి రంగం బలోపేతం కోసం పలు ప్రోత్సాహకాలను బడ్జెట్లో ప్రతిపాదించారు.

- ◆ సిల్క్, ఉన్ని, జనపనార, కొత్తతరం ఫైబర్ల స్వావలంబన కోసం 'నేషనల్ ఫైబర్ స్కీమ్'ను ప్రకటించారు. సంప్రదాయ క్లస్టర్లను ఆధునికీకరించడం కోసం 'టెక్స్టైల్ ఉపాధి పథకాన్ని' ప్రతిపాదించారు. మెగా టెక్స్టైల్ పార్కులను ఏర్పాటు చేస్తామన్నావీటిపై కస్టమ్స్ సుంకాల మినహాయింపు..
- ◆ అణు విద్యుత్ ప్రాజెక్టులకు అవసరమయ్యే ఉత్పత్తుల దిగుమతులపై ప్రస్తుతమున్న బేసిక్ కస్టమ్స్ డ్యూటీ మినహాయింపు 2035 వరకు కొనసాగుతుంది.
- ◆ కీలక ఖనిజాలకు అవసరమయ్యే మూలధన ఉత్పత్తుల దిగుమతులపై కస్టమ్స్ సుంకం మినహాయింపు

పౌర, రక్షణ రంగానికి సంబంధించి శిక్షణ, ఇతర విమానాల తయారీకి అవసరమయ్యే విడిభాగాల దిగుమతులపై కస్టమ్స్ డ్యూటీ మినహాయింపు

- ◆ మైక్రోవేవ్ ఓవెన్ల తయారీకి అవసరమైన కొన్ని ఎంపిక చేసిన ఉత్పత్తులపై దిగుమతి సుంకం మినహాయింపు
- ◆ బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ తయారీ భాగాలు, సోలార్ గ్లాస్లో ఉపయోగించే సోడియం యాంటీమోనేట్ వంటివాటికి కూడా దిగుమతి సుంకం నుంచి మినహాయింపు కల్పించారు.
- ◆ ఎక్స్ క్లూజివ్ ఎకనమిక్ జోన్లో ఫిషింగ్బోట్లకు చేపల వేటపై సుంకం మినహాయింపు ఇచ్చారు.

కొరియర్ ద్వారా చేసే ఎగుమతుల కన్సైన్మెంట్లపై ప్రస్తుతం ఉన్న రూ.10లక్షల పరిమితిని తొలగిస్తున్నట్లు ప్రకటించారు. దీని వల్ల ఎంఎస్ఎంఈలు, స్టార్టప్లకు ప్రపంచ మార్కెట్ అవకాశాలు లభించనున్నాయి.

## పునాదిరాయి పరితాపం

విరామానికీ విరామానికీ మధ్య
పునఃపున ప్రసవ వేదనలు
సుదీర్ఘ ప్రసవ వేదనల తరువాతే
ఉద్యమాల ఉతుకులాటలు
ఉప్పొంగే స్వేచ్ఛాగాన ఝరుల్లో
కాంతి కెరటాలు ఎగిసేదెప్పుడు..
ఉష్ణరక్త గీతుల జోల పాటల్లో
ఉద్యమ శిశువుల
చెడుగుడాటల వినోదా లెప్పుడు..
కాలం నుదుటి మీద పొద్దుపొడుపై
భవిష్యత్తు దిక్సూచుల్లా నిలిచే
జన చైతన్య కేతనాలేవీ..
స్వప్న జీవన పథాన
ఇరు వైపులా విరిగిన క్రరలే...
ముందుకు నడిపే మైలు రాళ్లేవీ..
మల్లెపొదనుంచి వీచే చల్ల గాలిలా
సువాసనలు గుబాలించాల్సిన జ్ఞాపకం
గులాబీ ముల్లులా గుచ్చు కుంటున్నది.
... ... ... ... ...
చిన్నప్పుడు
ఒక నేస్తాన్ని ఎత్తి పడేసి
మరో నేస్తం చేతిలో..
పడిపోయిన దృశ్యాలు
గుండె గొంతుకలో కొట్టుక లాడుతున్నయ్..
లొట్టిలేని గెలనుంచి కారే
కల్లు చుక్కలకు నోరెల్లబెట్టినట్టు
ఒకటే ఎదురు చూపు.
ఎన్నిచుక్కలు గాలిలో కలిశాయో
ఒకటి కంట్లోపడి మంట పెడితే
మరొక్కటి నోట్లో...
జిహ్వ చావదు దాహం తీరదు..
ఒకటే నిరంతర నిరీక్షణ..
తుట్టెను దులిపి
తేనె పట్టును తెచ్చింది నేనే
ఈగలెన్ని కుట్టినా
పట్టును పిండి పాత్రలు నింపింది నేనే
తీరా చూస్తే ఏమీలేదు
ముంజేతి మీదపడ్డ మూడు చుక్కలే..
మోచేతి దాకా నాకిస్తున్నరు.
స్వరకల్పనలేని స్వైర కల్పనలో
మాగన్ను పడ మరిపిస్తున్నరు.
కొత్త దారులు మరిచి
పాత పాటలే
మళ్లీ మళ్లీ వినిపిస్తున్నరు.
నేను పునాది రాయిని
గోపుర కలశాన్ని స్ప ృశించలేను.
ఎన్నడూ
శిఖరాగ్రాన్ని తాకలేను.
మీ బహుళ హర్మ్యాల నేల లోతుల్లో
శాశ్వత జీవ సమాధి చేసి
సుఖస్పర్శలేని నిద్ర పుచ్చండి..

**- బోధనం నర్సిరెడ్డి**
9985663225

# నిష్పాక్షికతను, నిజాయితీని అన్వేషించిన పరిశోధన



ముస్లిం ప్రపంచానికి రెండు పెద్ద పర్వదినాలుగా చెప్పుకునే రంజాన్, బక్రీద్ పర్వదినాలు లాగా తెలుగు సాహిత్యానికి ఇద్దరు ఇస్మాయిల్లు. ఒకరు 'చెట్టుకవి' ఇస్మాయిల్, మరొకరు 'ఖాళీసీసాలు' ఇస్మాయిల్. పాఠకులు గందరగోళం చెందకూడదనే ఖాళీసీసాలు ఇస్మాయిల్ తన పేరులో స్మైల్ మాత్రం మిగుల్చుకున్నాడు. ఈ వాక్యాలు నన్ను చాలా ఆకర్షించాయి. ఇవి డాక్టర్ మద్దాల పెద్దిరాజు పరిశోధన గ్రంథంలోనివి. ఆ పరిశోధన పేరు స్మైల్‌రచనలు-అనుశీలన.

పరిశోధకుడు డాక్టర్ మద్దాల పెద్దిరాజు తన సిద్ధాంత గ్రంథంలో ఇస్మాయిల్ జీవితాన్ని,కవిత్వాన్ని, కథలను, అనువాదాలను, నాటకాలను,లేఖా సాహిత్యం, సాహిత్య విమర్శనను సంక్షిప్తంగా, సమగ్రంగా సోదాహరణంగా విశ్లేషిస్తూ ఈ గ్రంథాన్ని అందించారు. ఈ గ్రంథాన్ని చదివిన తర్వాత స్మైల్ సాహిత్య దృక్పథాన్ని చక్కగా అవగాహన చేసుకుంటారు.

సాహిత్యంలో కూడా కుట్రపూరిత రాజకీయాలు ప్రవేశించి కవి /రచయిత పేరును బట్టి ప్రాంతాన్ని బట్టి సాహిత్యాన్ని అంచనా వేసే ఒక అవాంఛనీయ సాహిత్య విమర్శ ధోరణి కూడా అక్కడక్కడ కనిపిస్తోంది. స్మైల్ గారిని ఆయన సాహిత్యం ద్వారా చెప్పాలనుకున్న అంశాలను అంతే స్పష్టంగా ఈ పరిశోధకుడు వివిధ ఆకరాలతో సమన్వయించిన తీరు పరిశోధకుడికి ఉండవలసిన నిజమైన పరిశోధన అన్వేషణను తెలియజేస్తుంది.

'స్మైల్'గా ప్రఖ్యాతి పొందిన మహమ్మద్ ఇస్మాయిల్ (1942-2008) 66 సంవత్సరాలు జీవించారు. పుట్టింది కృష్ణాజిల్లా అయినప్పటికీ అనుబంధం అంతా అత్యధికంగా ఏలూరు,తూర్పుగోదావరి జిల్లాలోని రాజమండ్రి,కాకినాడ తదితర ప్రాంతాల సాహితీవేత్తలతో గడిపారు. స్మైల్ వృత్తిరీత్యా కమర్షియల్ టాక్స్ డిపార్ట్‌మెంట్‌లో ఆఫీసర్‌గా పని చేశారు. ప్రవృత్తి రీత్యా ఆయన ఒక సాహితీవేత్త.

ప్రముఖ సాహితీవేత్తలు శ్రీశ్రీ, చాసో, కాళీపట్నం రామారావు, రాచకొండ విశ్వనాథ శాస్త్రి,కాళోజీ నారాయణరావు, ఆచార్య వెల్చేరు నారాయణరావు,ఆచార్య బేతవోలు రామబ్రహ్మం, ఆచార్య చేకూరి రామారావు, వేగుంట మోహన్ ప్రసాద్, భమిడిపాటి రామగోపాల్,నగ్నముని, జ్వాలాముఖి, దేవీ ప్రియ, చెట్టుకవిగా పేరుపొందిన ఇస్మాయిల్ ఆచార్య ఎండ్లూరి సుధాకర్, పతాంజలి శాస్త్రి,ఇంద్రగంటి శ్రీకాంత్ శర్మ,కడియాల రామ్మోహన్ రాయ్, కొండేపూడి నిర్మల, జయప్రభ, అఫ్సర్, మహమ్మద్ ఖదీర్ బాబు మొదలైన వాళ్ళతో సాహిత్య పరిచయాలు ఉన్నాయి. తనకంటే పూర్వం ఇస్మాయిల్ పేరుతో ఎంతో ప్రసిద్ధి చెందిన ఒక కవి ఉండటం ఆ పేరు తన పేరు ఒకేలా ఉండటం వల్ల తన పేరును స్మైల్‌గా మార్చుకున్న సహృదయుడు తెలివైన రచయిత.

ఇస్మాయిల్ పేరుతో మరొక ప్రసిద్ధ కవి ఉన్నాడనుకున్నాం కదా! ఆయన 1928లో జన్మించి 2003లో మరణించారు. చిలుకలువాలిన చెట్టు (1980) చెట్టు నా ఆదర్శం (1982) వంటి ఇమేజరీ పోయెట్రీని, కప్పుల నిశ్శబ్దం,బాల్చీలో చంద్రోదయం వంటి హైకూ కవితల సంపుటాలను రాయడంలోనూ ఆయన బాగా చేయి తిరిగిన కవి. వృత్తిరీత్యా ఒక అధ్యాపకుడు, తత్వశాస్త్రాన్ని బోధించే అధ్యాపకుడు. పుట్టింది నెల్లూరు జిల్లా కావలి అయినప్పటికీ ఆయన విద్యాభ్యాసమంతా కాకినాడ, విశాఖపట్నం లోను ఉద్యోగం మాత్రం కాకినాడ, విజయవాడ లోనూ కొనసాగింది. ఆయన ప్రిన్సిపాల్ గా పదవీ విరమణ చేశారు.

పరిశోధకుడు తన సిద్ధాంత గ్రంథంలో సంక్షిప్తంగానే చెప్పినా స్పష్టంగా అర్థమయ్యేలా ఇస్మాయిల్ గారు స్మైల్‌కి అభిమానమైన కవుల్లో ఒకరని వివరించారు. వీళ్ళిద్దరినీ పోల్చి చెప్పకుండా పరిశోధకుడు చక్కని సంయమాన్ని పాటించడం బాగుంది. వాళ్ల ఉత్తమత్వాలను బేరీజు వేయకుండా ఇస్మాయిల్ పేరుతో ఇద్దరున్నా ఇస్మాయిల్, స్మైల్ వేరు వేరు సాహితివేత్తలని తన పరిధి వరకే చెప్పి ఆగిపోయాడు.

పరిశోధకుడు స్మైల్‌గురించి మొదటి అధ్యాయంలో కొండను అద్దంలో చూపించినట్లుగా ఆయన జీవితాన్ని, రచనలను దృక్పథాన్ని స్పష్టంగా వివరించాడు. స్మైల్‌తన విద్యాభ్యాసాన్ని కొనసాగించేటప్పుడు పురుషోత్తం గారనే ఒక తెలుగు పండితుని ప్రభావం తనను పద్యాలను కంఠస్థం చేసేలా చేసిందని అదే ఆయనలో చక్కని తెలుగు భాష నేర్చుకోవడానికి, ఉత్తమ సాహిత్య సృజన కారణమైందని పరిశోధకుడు ప్రతిపాదిస్తూ తన సిద్ధాంతాన్ని మొదలుపెట్టాడు.

తల్లిదండ్రులు మత దృక్పథంతో కాకుండా స్వేచ్ఛగా అనేక పుస్తకాలను చదివించడం వల్ల స్మైల్‌లో కుల, మత దృక్పథాలతో సాహిత్యాన్ని చూసే దృష్టి రాలేదని వ్యాఖ్యానించాడు. తన ముగ్గురు పిల్లలకూ కులాంతర వివాహాలు చేసి సమాజానికి ఆదర్శప్రాయుడయ్యాడు. స్మైల్ వర్గాలకి, కుల,మతాలకి, భాషా ప్రాంతాలకి అతీతంగా జీవించిన 'మహామనిషి' అని సిద్ధాంతికరిస్తూనే పరిశోధకుడు ఒక కవితాత్మక వాక్యంతో ఆయన్ని అభివర్ణించాడు. ఎప్పుడూ పరిశుభ్రంగా, డేవిడ్ రోజ్ పువ్వులా ఉండేవాడు. అదే పరిస్థితిలో స్మైల్‌పేడన, వివక్షలకు గురి అవుతున్న ముస్లిం రచయితలకు మద్దతుగా నిలిచిన రచయితగా కూడా పరిశోధకుడు నిరూపించాడు.

స్మైల్‌రాసిన 10 కథలను సంక్షిప్తంగా పరిచయం చేస్తూనే ఆ మూలంలో ఉన్న కథలను చదవాలనిపించేలా విశ్లేషణ చేశాడు.స్మైల్ కి ఎంతో పేరు తీర్చిన కథలలో ఖాళీ సీసాలు ఒకటి, ప్రభుత్వ ఆసుపత్రులలో రోగులకు ఉచితంగా వైద్యం చేసి మందులు అరుకు(syrup) వంటివి ఇచ్చినా, ఆ అరుకును తీసుకోవడానికి ఖాళీసీసాలు ఇవ్వరు. తన తల్లి రోగం బాగుపడాలంటే అరుకు పోయాలి. అరుకు పోయాలంటే తనకి ఒక ఖాళీసీసా కావాలి. ఆ సీసా కోసం ఆ బాలుడు వెతుకుతూ బయటకు వస్తాడు. ఖాళీ సీసాలు అమ్ముకుని బ్రతికే ఇద్దరు ఆడవాళ్ళ మధ్య జరిగిన సంఘటన కేంద్రంగా చేసుకొని కథ రాశారు. ఒకామె వయసులో ఉన్నది. మరొకరు వయసు వుడిగినామె. తమ కుటుంబం పోషించుకోవడం కోసం ఖాళీ సీసాలు అమ్ముకొని జీవిస్తూవుంటారు. ఈ అబ్బాయి దగ్గర తక్కువ డబ్బులు ఉండటం ఆ డబ్బులతో ఒక ఆమె దగ్గర ఖాళీ సీసా కొనడంతో ఇద్దరి మధ్య గొడవ ప్రారంభమవుతుంది. అది చివరికి ఒక ఆమె చీర లాగేసే వరకు వెళుతుంది. ఆ చీర లాగేసిన తర్వాత నగ్నంగా రోడ్డు మీద నిలబడ్డ ఆమెను ఆధారం చేసుకుని రచయిత వర్ణించిన భావాలు ఈ సమాజంలో ఉన్న వికృత స్వభావాన్ని పట్టి చూపిస్తాయి.

ఇలా కథలను పరిచయం చేస్తూనే ఆ కథలపై వచ్చిన విశ్లేషణలతో తన ప్రతిపాదనలను పరిశోధకుడు ముందుకు తీసుకువెళ్ళాడు. స్మైల్ కథలు ద్వారా సామాజిక స్ప ృహను, దేశభక్తిని గుర్తించవచ్చునని పరిశోధకుడు ప్రతిపాదించాడు. పరిశోధకుని కొన్ని ప్రతిపాదనలను ఈ క్రింది విధంగా క్రోఢీకరించే అవకాశం ఉంది.

స్మైల్‌జాతీయ భావాలున్న,ప్రత్యేక శైలీ విన్యాసంతో కొత్త నిర్మాణంతో కథలు రాసిన రచయిత.

సమాజంలో స్త్రీ,పురుష లైంగిక సంబంధాలతో ముడిపడిన అనేక సమస్యలను తన రచనల ద్వారా సమాజం ముందు ఉంచిన రచయిత. తన కథలలో అస్తిత్వవాద ఛాయలను మానసిక సంఘర్షణ లను మనిషి అంతర్గత స్వభావాలను చిత్రించడంలో స్మైల్ చేయి తిరిన రచయిత. కంబళి వంటి కథను పరిచయం చేస్తూ స్త్రీ పురుష లైంగిక సంబంధాలు ఒకవేళ సక్రంగా లేకపోతే అవి హోమో సెక్సువల్ కి ఎలా దారి తీస్తాయో చెప్పిన కథ. ఆధునిక తెలుగు కవిత్వాన్ని సుసంపన్నం చేసినా కవిత సంపుటల్లో స్మైల్ 'ఒఖడే' ఒకటి. స్మైల్‌కాలంలో కవిత్వ రచనా నిర్మాణం, వస్తువు, రూపపరమైన మార్పులు రావడం ఆ మార్పులలో స్మైల్‌కూడా ఒక కీలక పాత్ర పోషించారు. ఈయన కవిత్వంలో వాస్తవికత కన్నా నిక్షిప్తమైన తాత్విక ధోరణి అధికంగా కనిపిస్తుంది. స్మైల్‌సంప్రదాయక నాటకం కంటే ప్రయోగ దృష్టితో వాస్తవికతకు దగ్గరగా జీవచైతన్యత ఉండాలని భావిస్తాడు దాన్ని నిరూపిస్తూ 'ఆ!'అనే నాటకం రాశాడు.

రచనకు అనుగుణమైన వర్ణనలు, సామెతలు, జాతీయాలు, పలుకుబడులు ఆ రచనకు ఉపయోగపడుతూనే వాటి ప్రత్యేక అస్తిత్వాన్ని కూడా నిలుపుకునేలా రచన చేయడం స్మైల్ ప్రత్యేకత. జీవితానుభవాలను, వాస్తవికంగా కళ్ళెదుట జరుగుతున్న పర్యావరణ విధ్వంసాన్ని గమనించి పర్యావరణ, పరిరక్షణ ఆవశ్యకతను తెలిపేలా కూడా కవిత్వాన్ని రాశాడు. స్మైల్ ఆంగ్ల సాహిత్యాన్ని బాగా చదివేవాడు. తనకు నచ్చిన రచనలను తెలుగులో కూడా అనువాదం చేసేవాడు. అనువాదం కూడా సహజమైన సొంత రచనలా అభివ్యక్తం కావడం వీరి అనువాద శైలి ప్రత్యేకత. సాహిత్య విమర్శలో సమకాలీన సాహిత్య చర్చలో పాల్గొని నిష్పక్షపాత దృష్టితో నిజాయితీగా స్మైల్‌తన భావాలను స్పష్టంగా చెప్పేవారు. నవలలు, కథల పైన సమకాలీన అంశాలపై వచ్చిన వ్యాసాల పైన తన విమర్శను కొనసాగించడం ఆయన విమర్శకు ఉన్నటువంటి పరిధి.

స్మైల్‌అనువాదానికి సంబంధించిన పరిశోధకుడు లోతైన పరిశీలన చేశాడు. అది ప్రత్యేకంగా ఒక పరిశోధన చేయవలసిన అవసరం ఉందనిపించేలా ఆ రచనలను సోదాహరణంగా విశ్లేషించాడు. నిజానికి దీనిలో ఉన్న ప్రతి అధ్యాయం ఒక్కొక్క ప్రత్యేక పరిశోధన చేసే అవకాశం ఉన్న విభాగంగా అనిపించేలా పరిశోధకుడు విస్తృతమైన సమాచార సేకరించి దాన్ని సమన్వయించి తన ప్రతిపాదనలను మన ముందుంచాడు.

పరిశోధనలో సాధారణంగా నూతన సత్యాలను ఆవిష్కరించడం, నూతన సిద్ధాంతాలను సమన్వయం చేయడం లేదా పూర్వ సిద్ధాంతాలను ఖండించి తన సిద్ధాంతాన్ని నిరూపించడం వంటిది ఏదో ఒకటి జరగాలి. ఈ సిద్ధాంత గ్రంథంలో- స్మైల్‌తన జీవితమంతా సాహిత్యేతర వృత్తిలో ఉన్నప్పటికీ తాను తనకున్న సాహిత్యాభిరుచితో ఒక సృజనాత్మక రచయితగా సమాజంలోని అట్టడుగున ఎంతోమందికి కనిపించని అనేక సమస్యలను వస్తువులుగా స్వీకరించి, వాటిని ప్రయోగాత్మకంగా ప్రజలకు చేరువ చేసే ప్రక్రియలలో సాహిత్య సృష్టి చేసిన ఒక అభ్యుదయ వాదిగా కనిపిస్తారు. ఒక సిద్ధాంతాన్ని ఈ గ్రంథంలో పరిశోధకుడు డాక్టర్ మద్దాల పెద్దిరాజు ఎంతో శాస్త్రీయంగా ప్రతిపాదించాడు.




ఇంత చక్కని పరిశోధన గ్రంథం తెలుగు సాహిత్య చరిత్ర బృహత్తర గ్రంథానికి పరిశోధకుడుతన వంతు ఎంతో కృషి చేసినట్లుగా ఈ సిద్ధాంత గ్రంథాన్ని బట్టి తెలుస్తుంది. పేర్లను బట్టీ, ప్రాంతాలను బట్టీ సంకుచిత దృష్టితో రచయితలను రచనలను అంచనా వేయకూడదని ఒక విశ్వజనీన దృక్పథాన్ని అలవర్చుకోవడం ఎలాగో ఈ పరిశోధన గ్రంథంచదివితే తెలుస్తుంది.

స్మైల్ పుట్టింది ఒక ముస్లిం కుటుంబంలోనే అయినా అతను పెరిగిందీ,అతను తన రచనల్లో ప్రతిపాదించేలా చేసిందీ మాత్రం మానవత్వమేనని నిరూపించాడు. ఇంత మంచి పరిశోధన చేసిన పరిశోధకుడు డాక్టర్ మద్దాల పెద్దిరాజుని ఈ సందర్భంగా హృదయపూర్వకం గా అభినందిస్తున్నాను.

**- ఆచార్య దార్ల వేంకటేశ్వరరావు**

## హిందీకి మోటూరి సేవలు అమోఘం

మోటూరి సత్యనారాయణ హిందీ భాష ప్రచారానికి ఎనలేని సేవలు అందించిన విద్యావేత్త. భారత రాజ్యాంగాన్ని రూపొందించిన భారత రాజ్యాంగ సభలో సభ్యులు. 1966 వరకు రాజ్యసభలో నామినేటెడ్ సభ్యులు. భారత రాజ్యాంగంలో హిందీని అధికారిక భాషగా మార్చడంలో ఆయన ముఖ్యపాత్ర పోషించారు. రాజభాష కమిషన్ సభ్యులుగా, స్వాతంత్ర్య సమర యోధులుగా, హిందీ వికాస సమితి స్థాపకులుగా, హిందీ ప్రచార సభ ప్రధాన కార్యదర్శిగా, బహుభాషా వేత్తగా బహుముఖ సేవలు అందించిన ప్రతిభాశాలి. భారత ప్రభుత్వ పద్మశ్రీ, పద్మ భూషణ్ పురస్కారాల గ్రహీత.



మోటూరి సత్యనారాయణ (ఫిబ్రవరి 2, 1902 - మార్చి 6, 1995) 1902, ఫిబ్రవరి 2 వ తేదీన కృష్ణా జిల్లా దొండపాడు గ్రామంలో పెద పిచ్చయ్య, రత్తమ్మ దంపతులకు జన్మించారు. ప్రాథమిక విద్య అనంతరం తెలుగు, సంస్కృతం అభ్యసించాడు. ఆంధ్ర జాతీయ కళాశాలలో ఉన్న తులైన గురువుల వద్ద శిక్షణ పొంది హిందీ బాగా అభ్యసించారు. తర్వాత ఇంగ్లీషు, తమిళం, కన్నడం, మలయాళం, మరాఠీ, గుజరాతీ, బెంగాలీ మొదలైన భాషలు కూడా నేర్చుకున్నారు. ఆయనకు రాజకీయ, సాహిత్య, సాంస్కృతిక, ఐతిహాసిక, వైజ్ఞానిక, సాంకేతిక విషయాలలో లోతుగా ప్రవేశం ఉండేది. అయన హిందీ ప్రచారంతో జీవితాన్ని ప్రారంభించి క్రమంగా సంఘటకులుగా, కార్యదర్శిగా, చివరకు 1938లో హిందీ ప్రచార సభకు ప్రధాన కార్యదర్శి అయి 1961 వరకు కొనసాగారు. ఆ సంస్థ ప్రథమ ప్రధాన కార్యదర్శి పండిత హరి హర శర్మకు కుడిభుజంగా ఉండి సహకరించారు. అయన దూరదృష్టి, అవగాహన వల్లనే ఈ సభ హిందీ సాహిత్య సమ్మేళనం, ప్రయాగవారి బంధనం నుండి విముక్తి పొంది 1927లో స్వతంత్ర సంస్థగా ఆవిర్భవించింది.

మోటూరి ప్రధాన కార్యదర్శిగా ఉన్నంతకాలం దక్షిణ భారత హిందీ ప్రచారసభ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖింప దగినది. 1936లో ప్రచారసభకు 4 రాష్ట్రాలలో, 4 ప్రాంతీయ శాఖల నిర్మాణం అయన దూరదృష్టిని నిరూపిస్తుంది.

మోటూరి సత్య నారాయణ... మహాత్మాగాంధీ, రాజేంద్ర ప్రసాద్ లకు అత్యంత విశ్వాస పాత్రులు. 1946లో జరిగిన సభ రజతోత్సవానికి బాపూజీ 12 రోజులు ఉండి సమావేశాలు జరిపించారు. ప్రతి దినం గాంధీ ప్రార్థనా సమావేశాలలో వేలాది మంది పాల్గొనేవారు. మద్రాసు కార్పొరేషన్ నుండి త్యాగరాయ నగరంలో సుమారు ఐదున్నర ఎకరాల భూమిని సంపాదించి అప్పటి అవసరాల కనుగుణంగా భవనాలను నిర్మించారు. ముద్రణాలయం, పుస్తక ప్రచురణ, పరీక్షలు నిర్వహించడం ద్వారా ఆదాయం సమకూర్చారు. హిందీ ప్రచారాన్ని పెంపొందించడానికి ప్రతి రాష్ట్రంలోను, కొన్నిజిల్లాలలోను, మండలాల వారీగా సంరక్షకులను ఏర్పాటుచేసి నూతన ప్రణాళికల ద్వారా దక్షిణ భారతమంతా మారుమూలల వరకు హిందీని వ్యాపింప జేశారు. మోటూరి నేతృత్వ కృషి ప్రజలలో హిందీ పట్ల ప్రేమ, గౌరవం పెంచింది. 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో జైలు శిక్ష అనుభవించారు. స్వాతంత్ర్య సమర యోధులుగా తామ్రపత్ర గ్రహీతలయ్యారు. రాజకీయ రంగంలో కూడా విలువైన సేవలు అందించారు. భారత రాజ్యాంగ చట్టంలో 17వ భాగం రాజభాష అధ్యాయ నిర్మాణంలోను, దాని డ్రాఫ్టింగ్, రాజ్యాంగ సభలో నెగ్గించడంలో అయన కృషి, సహకారం ఎంతో ఉన్నాయి.

రాష్ట్రపతి ద్వారా 1954 నుండి 1966 వరకు వరుసగా రెండుసార్లు రాజ్యసభ సభ్యుడిగా నామినేట్ చేయబడ్డారు. 1956లో రాజభాషా కమిషన్‌కు సభ్యులుగా పనిచేశారు. తెలుగు భాషా సమితి స్థాపక కార్యదర్శిగా 'తెలుగు విజ్ఞాన సర్వస్వం' 16 భాగాలలో ప్రచురించారు. అదే విధంగా హిందీ వికాస సమితిని కూడా స్థాపించి హిందీలో 'విశ్వవిజ్ఞాన సంహిత' పేరుతో హిందీ విజ్ఞాన సర్వస్వాలను ప్రచురింప చేశారు.

ఆంధ్ర విశ్వ విద్యాలయం ఆయనను కళా ప్రపూర్ణతో గౌరవిస్తే, కొన్ని విశ్వ విద్యాలయాలు గౌరవ డాక్టరేట్‌తో సన్మానించాయి. భారత ప్రభుత్వం ఆయనకు పద్మశ్రీ (1958), పద్మ భూషణ్ (1962) పురస్కారాల్ని ఇచ్చి గౌరవించింది. అయన సేవలను పురస్కరించుకుని హైదరాబాదులో రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ అధ్యక్షతన 1957లో పెద్ద ఎత్తున అభినందన సభ జరిపి అభినందన గ్రంథం సమర్పించారు. ఆయన 1995 సంవత్సరం మార్చి 6 వ తేదీన పరమపదించారు.

**ఫిబ్రవరి 2 మోటూరి సత్యనారాయణ జయంతి**

**- రామ కిష్టయ్య సంగన భట్ల**
9440595494

ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు
manamlekhalu@ gmail.com మెయిల్ అడ్రస్‌కు పంపగలరు.

# మానవీయ స్త్రీవాద కవయిత్రి డా.అనామిక

కవిత్వమే జీవితమయిన అపురూప స్త్రీవాద హిందీ కవయిత్రి డా.అనామిక. సాహిత్యాకాశంలో ఓ మానవీయ అక్షరం...

ఆగస్టు 17,1961న బీహర్‌లోని ముజఫర్ పూర్‌లో జన్మించిన అనామిక సమకలీన భారతీయ కవయిత్రి, సామాజిక కార్యకర్త, హిందీలో నవలా రచయిత్రి, ఆంగ్లంలో రాసే అనువాదకులు. అనామిక తొలి గురువైన ఆమె తండ్రి డా.శ్యాంనందన్ కిషోర్. జాతీయ కవులయిన దినకర్ ,గోపాల్ సింగ్‌ల కాలంలో ప్రఖ్యాత గీత రచయిత, కవి పద్మశ్రీ గ్రహీతయిన తండ్రి నుండి అవగాహనను, కవిత్వ రచనను నేర్చుకున్నారు. ఆమె పెద్ద కుటుంబంలో పెరిగినా తోటివారులేక ఒంటరితనం చవిచూశారు. ఇంట్లో అందరూ సాహిత్య ప్రియులే. ఆమెకు సహచరులు తండ్రి లైబ్రరీలోని పుస్తకాలే. వాటితో తన సొంత భావప్రపంచాన్ని ఏర్పరుచుకున్నారు. తన చుట్టుపక్కల గల స్త్రీల బాధలను జాగ్రత్తగా వినేందుకు ఆమె చెవిని తెరిచిపెట్టారు.

అనామిక బహు అవార్డులు గెలుచుకున్న కవి, రచయిత తన వ్యక్తిగతం గురించి 'నేను ముక్కుసూటి వ్యక్తిని మాత్రమే కాదు, ఇవన్నీ నా సంక్లిష్ట వ్యక్తిత్వంలోని విభిన్న అంశాలు. స్త్రీ ఒక స్త్రీ మాత్రమే, అలాగే ఒక సోదరి, భార్య, తల్లి కూడా. అదేవిధంగా, నాలో ఒక కవి, రచయిత, విమర్శకురాలిని నేను కనుగొన్నాను మరి వారందరినీ ప్రోత్సహించాను. నేను ఆంగ్ల సాహిత్య ఉపాధ్యాయురాలిని, నేను హిందీలో రాస్తాను. ఎందుకంటే అది నా స్వంత భాష.మనం మాట్లాడే భాష హిందీ. కాబట్టి నేను హిందీలో రాయడం ద్వారా మరింత సంతృప్తి చెందాను' అని అన్నారు.

'మా సీట్లలో గడ్డకట్టుకుని/ మేము అమ్మాయిలము ఆశ్చర్యపోయాము / స్థలం, ఆ స్థలం ఎలా ఉంటుంది? / మేము ఇప్పటికే స్థలం లేకుండా ఉన్నాము!' అని లింగ వివక్ష అసమానతలను అద్దంలో చూపిస్తున్నారు. తన భావోద్వేగాల కవిత్వంలోని శక్తితో నిజమైన స్త్రీవాదిగా నిరూపించుకున్న డాక్టర్ అనామిక గొప్ప హిందీ కవయిత్రి.

ఎన్నో బయటికి చెప్పలేని విషయాలు ప్రతి కాలంలోనూ స్త్రీల జీవితాల్లో తొంగిచూడడం కాదనలేని చారిత్రక సత్యం. కవిత్వం ఒక శక్తివంతమైన సృజన. అది భావాలను వ్యక్తీకరించడానికి ఓ అద్భుతమైన,సున్నితమైన తొవ్వ. అందుకే స్త్రీలు పురుషుల కన్నా కవిత్వాన్ని ఎక్కువగా ఉపయోగించుకుంటున్నారు. స్త్రీలు నిత్యం బహిరంగంగా వ్యక్తపరచలేని అనేక భావోద్వేగ విషయాలను కవిత్వంలో అలవోకగా ప్రతిక్షేపించి చూపారు. అటువంటి నేపథ్యంలో, కవిత్వం వారి అవ్యక్త ఆలోచనలను వ్యక్తీకరించడానికి ఉత్తమ సాధనంగా మారింది. అయితే తమ సొంత పిల్లల్లాగే కవిత్వాన్ని పెంచిన స్త్రీలు సాహిత్య అకాడమీ అవార్డును లోగడ అందుకోకపోవడం ఎంతో విడ్డూరం, విచారం కూడా. కానీ 2020 కవి అనామిక సాహిత్య అకాడమీ అవార్డును గెలుచుకున్న మొదటి మహిళా కవయిత్రిగా



అవతరించింది. ఇది ఒక కొత్త ఒరవడికి నాంది పలికింది. యుక్త వయసులోనే ఆమె ప్రఖ్యాత కవుల గ్రంథాలను చదివారు. ఆమె ఢిల్లీలోని తీన్ మూర్తి భవన్‌లో ఆమె ఫెలోషిప్ చేస్తున్నారు. ఆమె 'సమకాలీన బ్రిటిష్ మరింకా హిందీ కవిత్వంలో మహిళల తులనాత్మక అధ్యయనం'పై పరిశోధన చేస్తున్నారు.

అనామిక 'మై టైప్ రైటర్ ఈజ్ మై పియానో' ఆంగ్లంలోకి అనువదించిన కవితా సంకలనం. ఆమె స్త్రీవాద కవిత్వానికి ప్రసిద్ధి చెందింది. కవయిత్రి డా.అనామిక వ్యక్తిగత జీవితం కవిత్వ రచన,బోధన మాధ్యమాల మధ్య విద్యార్థిలా గడిచింది. అనామిక తల్లి ఆశా కిరణ్ ప్రొఫెసర్‌గా, విభాగాధిపతిగా పనిచేయడంతో తల్లి నుండి బోధన నైపుణ్యాలను అందిపుచ్చు కున్నారు.

అనామిక చాలా కాలంగా రచనలు చేస్తోంది. కానీ, 90లోనే ఆమె కవిత్వం స్త్రీవాద చర్చలో గణనీయమైన స్థానాన్ని సంపాదించుకుంది. ఈ దశాబ్దంలో భారతీయ సమాజంలో ముఖ్యమైన సంఘటనలు చోటు చేసుకున్నాయి. ప్రపంచ ఆర్థిక సరళీకరణ తరంగంతో సమాజ కిటికీ తెరుచుకోవడం ప్రారంభమైంది. మహిళలు జాతీయ సమానత్వంలో తమ హక్కును చాటుకోవడం ప్రారంభించారు.

స్త్రీవాద ఆలోచన ఇకపై మహిళల స్వీయ వాదనకు మాత్రమే పరిమితం కాలేదు. ప్రధాన స్రవంతి సామాజిక రాజకీయ విభాగంలో వారు ఎక్కువ భాగస్వామ్యాన్ని కోరుతున్నారు. ఈ సమయంలో సాహిత్య సాంస్క ృతిక చరిత్ర కూడా కొత్త యుగం అంచున ఉంది. ఆ అంచుల నుండి స్వరాలు పుంజుకుంటున్నాయి అట్లాగే వినిపించబడుతున్నాయి. అనామిక కవిత్వం ఈ సమస్యలన్నింటినీ మరింత సున్నితత్వంతో స్పృశిస్తుంది.

అనామిక ఎనిమిది కవితా సంకలనాలు రచించిన కవయిత్రి. అందులో అనుష్టప్, దూబ్-ధాన్, ఖుర్దారీ హతేలియాన్, టోక్రీ మే దిగాంత్, ఇంకా పానీ కోసబ్ యాద్ థా. ఆమె కవితలు ఆంగ్లంలోకి అనువదమయినవి కూడా. 'మై టైప్రైటర్ ఈజ్ మై పియానో' అనే కవితా సంకలనంగా వచ్చాయి. అనామిక 'యుద్ధానంతర అమెరికన్ మహిళా కవయిత్రులలో ప్రేమ,మరణం యొక్క చికిత్స' అనే అంశంపైన పోస్ట్ డాక్టోరల్ పరిశోధన చేస్తుంది. తన 'బుట్టలో భూమి' ('టోక్రీ మే దిగంత్') కవిత్వరచనకు జాతీయ సాహిత్య అవార్డును అందుకున్నారు. డా.అనామిక తన శక్తివంతమైన, ఆలోచింపజేసే అత్యుత్తమ కవిత్వాలతో ప్రపంచాన్ని కదిలించడమే కాకుండా, పితృస్వామ్యాన్ని కొత్త కోణం నుండి చూడటానికి కూడా దోహదపడింది.

ఇక కవి అంతర్ముఖంగా, బయటి మాటగా పితృస్వామ్యాన్ని ఎత్తిచూపడంపైన ఓ వివరణాత్మక పరిశీలన, సులభంగా అర్థం చేసుకోవడానికి పితృస్వామ్యానికి సంబంధించిన కొన్ని ప్రముఖ సారాంశాలను సౌకర్యవంతంగా కలిపి ఉంచారు అనామిక. ఇక మరింత ఆలస్యం చేయకుండా గొప్ప ప్రాముఖ్యత కలిగిన భాగాలను చూసి అర్థంచేసుకుంటే వినపడే సారాంశంగా రేఖ సేథి అనువదించిన అనామిక పతివ్రత నుండి తీసుకొన్న డా.అనామిక వైఖరి మొత్తంగా సమానత్వం కంటే సమానత్వం యొక్క స్ఫూర్తి గురించే. ఆమె కేవలం పురుషులకు వ్యతిరేకంగా స్త్రీలను లేదా పురుషులకు వ్యతిరేకంగా ఏదైనా లింగాన్ని పోటీ చేయడానికి ఒక సాధారణ వ్యూహం కోసం వెతకడం లేదు. అది ఆమె అంతిమ లక్ష్యం ఏమాత్రం కూడా కాదు.

విశాలమైన కాన్వాస్‌పై పెయింటింగ్ లాగా అనామిక కవిత్వం విభిన్న అంశాల నుండి చిత్రాలను అల్లుతుంది. చాలా వరకు ఇది మధ్య తూర్పు భారతదేశంలోని జానపద మౌఖిక సంప్రదాయాలలో అనాదిగా లోతైనది. ఆమె మన జీవితాల అనుభవాలతో జ్ఞానాన్ని సమర్థవంతంగా అనుసంధానిస్తుంది. అలాగే ఈ ప్రక్రియలో అనేక అసంబద్ధతలు, వైరుధ్యాలు, వ్యంగ్యాలను తెరుస్తుంది. భాషలోని చమత్కారాన్ని, శ్లేషను ఉపయోగించి ఆమె పితృస్వామ్య భూస్వామ్య కోటను నేరుగా సవాలు చేసే చిత్రాలను అలవోకగా సృష్టిస్తుంది. అనామిక కవితలన్నీ అణచివేతతో కూడిన ఆ సంబంధాల యొక్క సూక్ష్మముద్రగా ఉంటాయి. అదే సమయంలో అవి ఈ అధికారాన్ని ధిక్కరించే, సవాలు చేసే స్త్రీ ధైర్యం లాగా కనిపిస్తాయి. ఆమె అత్యంత ప్రజాదరణ పొందిన కవితలలో ఒకటైన 'డోర్' (దర్వాజా) నుండి దాదాపు ఐకానిక్ లైన్ ఇలా ఉంది, నేను ఒక తలుపు / వారు నన్ను ఎంత ఎక్కువగా కొడితే అంత ఎక్కువగా నేను తెరిచాను. (అనువాదం రీతు మీనన్ ) అలాగే అనామిక పతివ్రత, స్త్రీ (స్త్రీయాన్)నుండి మరికొన్ని పంక్తులు ఉదాహరించారు కూడా. కృష్ణ సోబ్తిరాసిన లడ్కి వచనం 'వినండి, అమ్మాయి' జ్ఞాపకాల పొరల నుండి యాదిగా మెదలడం సహజమే. ఈ గ్రంథంలోని స్త్రీ జీవితం యొక్క కథనం ఉంది.' ఒక స్త్రీ వైవాహిక బంధంలోకి అడుగుపెట్టినప్పుడు కలిగే గందర గోళ కుదుపుల కంటే భూకంపం తక్కువ కాదు' అనే అభివ్యక్తి వాస్తవ దూరం కాదు. పితృస్వామ్యం స్త్రీ ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసే విధంగా పని చేస్తుంది, ఆమె వ్యక్తిత్వాన్ని అణిచివేస్తుంది. ఒకవేళ భర్త మంచి మనిషి అయితే కవి అనామిక ఆలోచించిన తీరుగా' పురుషులు బాగుపడటానికి అతీతులు కారు' అంటారు.

'బెజాగా' కవితలో 'స్త్రీలు సేవా జీవితానికి సిద్ధంగా ఉంటారు' ఆమె. అనామిక రాసిన 'విత్‌ఔట్ ఎ ప్లేస్' లేదా 'బెజాగా' అనే ఈ హిందీ కవితలో స్త్రీల ఆక్షేపణీయ స్థితిని చక్కగా చిత్రీకరిస్తుంది. ఇలా ఎనిమిది కవితా సంకలనాలు వెలువరించిన అనామిక 'బుట్టలో భూమి,నీ గాథ'('టోక్రీ మే దిగంత్,తేరిగాథ)కు 2020లో ప్రతిష్టాత్మక కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు అందుకున్నారు. భరత్ భూషణ్ అగర్వాల్ అవార్డు, రాష్ట్రభాషా పరిషత్ అవార్డు, రజా ఫౌండేషన్ అవార్డు, సాహిత్యకార్ సమ్మాన్, గిరిజా మాథుర్ సమ్మాన్, సాహిత్యసేతు సమ్మాన్, పరంపర సమ్మాన్, కృతి సమ్మాన్ వంటి గౌరవాన్ని పొందారు. డా.అనామిక 'బేజాగా' కవితకు అర్లీన్ జైడ్ ఆంగ్లానువాదం చేసిన 'విత్‌ఔట్ ఎ ప్లేస్' కు నా తెలుగు అనువాదంతో మీకోసం 'ఓ స్థలం లేకుండా'...

గడ్డకట్టుకుపోయి మా సీట్లలో/ ఆశ్చర్యపడ్డ బాలికలం మేము/ స్థలం, ఎలాంటిది అది?
ఇప్పటికే మేము ఏ స్థలం లేని వాళ్ళమే కదా!
మా స్థలం మాకు చూపించలేదు
ముందుగా ప్రాథమిక పాఠ్యాంశాలలో కూడా
'రామ్,నీ పుస్తకం తీసుకొని రా'/ 'రాధా, పోయి వంటజెయ్యి'/'రాధా! చీపురు తీసుకురా, నీ సోదరుని గది శుభ్రంగా ఊడ్చేయ్'.
ఒక్కసారిగా రాధ లేచి/అది సోదరుని గది,మరి నాది?/ఆ ప్రశ్నకు అందరూ నవ్వి/నీవు మా చిట్టి సూర్యకాంతి!/ నీకు ఓ గది ఇవ్వబడలేదు.'..ఇక లోపలికి చొచ్చుకొని వెళ్ళడమే ఏకైక మార్గం అని నమ్ముతున్న ప్రసిద్ధ కవి డా.అనామిక. ఆమె అన్ని లింగ ఆధారిత మెట్లను విచ్ఛిన్నం చేయాలనీ అనుకుంటుంది. గొప్ప సామాజిక బాధ్యతగల శక్తివంతమైన స్త్రీవాద కవయిత్రి డా. అనామిక.

**- డా.టి.రాధాకృష్ణమాచార్యులు**
9849305871

# కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశం

- రంగుల బ్రోచర్లకే పరిమితమైన గత పాలన.. చేతల్లో చూపిస్తున్న ప్రజా ప్రభుత్వం
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్




**వేములవాడ, ఫిబ్రవరి1(మనం న్యూస్):** వేములవాడ పట్టణంలోని ఎస్ఆర్ఆర్ ఫంక్షన్ హాల్లో కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశం ఘనంగా జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని అన్ని వార్డుల కౌన్సిలర్ అభ్యర్థులు, పార్టీ ముఖ్య నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, ఈ నెల 11న జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని, ఆ అభివృద్ధికి మద్దతుగా కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం వేములవాడ అభివృద్ధిని కేవలం రంగుల బ్రోచర్లకే పరిమితం చేసిందని, కేసీఆర్ తన లగ్గం ఇక్కడే అయిందని చెప్పి రాజన్న ఆలయ అభివృద్ధిని మోసం చేశారని మండిపడ్డారు. ప్రస్తుతం తమ ప్రభుత్వం రాజన్న ఆలయాన్ని 4 ఎకరాల విస్తీర్ణంలో, వెయ్యి సంవత్సరాల పాటు నిలిచిపోయేలా అభివృద్ధి చేస్తోందని తెలిపారు. పట్టణ ప్రజల 50 ఏళ్ల కల అయిన రోడ్డు వెడల్పు పనులను శరవేగంగా పూర్తి చేస్తున్నామని, మూలవాగులో మురుగునీరు కలవకుండా 10 కోట్లతో పనులు చేపడుతున్నామని వివరించారు.

గత ప్రభుత్వం ఎన్నికల వేళ కుల సంఘాలకు నకిలీ మంజూరు పత్రాలిచ్చి మోసం చేస్తే, తమ ప్రభుత్వం 56 కుల సంఘాలకు 3 కోట్ల పైచిలుకు నిధులు మంజూరు చేసిందని గుర్తు చేశారు. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టి, కాళేశ్వరాన్ని 'కులేశ్వరం'గా మార్చిన బీఆర్ఎస్ కు బుద్ధి చెప్పాలని కోరారు. పట్టణంలోని ప్రతి గల్లీలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం జరుగుతోందని, ఇల్లు లేని అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేగా తాను ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటానని, మున్సిపల్ ఎన్నికల్లో హస్తం గుర్తుకు ఓటు వేసి పట్టణ అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# కేసీఆర్ పై ప్రభుత్వం కక్షసాధింపు చర్యలు



- బొగ్గు కుంభకోణం, జలదోపిడీపై బిఆర్ఎస్ పోరాటాన్ని తట్టుకోలేకే కుట్రలు
- కాంగ్రెస్ నాయకులకు మున్సిపల్ ఎన్నికల్లో ఓటమి భయం
- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్

**గోదావరిఖని, ఫిబ్రవరి 01 (మనం న్యూస్):** తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన కేసిఆర్ పైనే అనవసరపు ఫోన్ టాపింగ్ల పేరుతో సిట్ దర్యాప్తు చేయడం దుర్మార్గమైన చర్య అని, కాంగ్రెస్ నాయకులకు మున్సీపల్ ఎన్నికల్లో ఓటమి భయం పట్టుకుందని అన్నారు మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే, పెద్దపల్లి జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కోరుకంటి చందర్. ఈ మేరకు గోదావరిఖని పట్టణ ప్రధాన చౌరస్తాలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు నల్ల జెండాలు, బ్యాడ్జీలు ధరించి రహదారిపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన ప్రదర్శన చేపట్టారు. సిఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేయడానికి ప్రయత్నించగా వారిని పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బొగ్గు కుంభకోణం, జలదోపిడీపై బిఆర్ఎస్ పోరాటాన్ని తట్టుకోలేకే రేవంత్ రెడ్డి ప్రభుత్వం కుట్రలు చేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం తెలుగు సీరియల్ లాగా రోజుకో నోటీసులు రోజుకొకరికీ చొప్పున పంపిస్తూ కాలం వెలదీస్తూ పాలనను మర్చిపోయారని మండిపడ్డారు. కాంగ్రెస్ నాయకులకు మున్సిపల్ ఎన్నికల్లో ఓటమి భయం పట్టుకుందన్నారు. కాంగ్రెస్, బిజెపి ప్రభుత్వాలు ఎప్పుడైతే అవినీతిలో కూరుకుపోతాయో అప్పుడే ఇలాంటి నోటీసుల పేరిట ప్రజల దృష్టి మరల్చేందుకు నాటకానికి తెరదీస్తారని, రాష్ట్ర అభివృద్ధి విషయంలో కేసీఆర్ తో పోటీ పడాలి కానీ, ఈ విధంగావిధ్వంసం చేయడమేంటని ప్రశ్నించారు. మాజీ సీఎం కేసీఆర్ ఎర్రవెల్లిలోని నివాసంలో ఉంటే, నంది నగర్లో నోటీసులు ఇవ్వడం ఏంటని నిలదీశారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రతిపక్ష నాయకులపై అక్రమ ఫోన్ ట్యాపింగ్ అంశాన్ని సాకుగా చేసుకుని కేసీఆర్ ప్రతిష్టను దెబ్బ తీయాలనే కుట్ర జరుగుతోందని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమంలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా ప్రతిపక్షంపై దాడులు చేస్తోందని అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతిపక్షాన్ని గౌరవించాల్సిన అవసరం ఉందని, కానీ ప్రస్తుతం రాష్ట్రంలో రాజకీయ కక్షపూరిత పాలన సాగుతోందని మండిపడ్డారు. ప్రజలు ఈ పరిణామాలను గమనిస్తున్నారని, రానున్న రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. ఎన్ని నోటీసులు ఇచ్చినా, ఎన్ని కేసులు పెట్టినా బిఆర్ఎస్ పార్టీ వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# ప్రజావాణి కార్యక్రమం రద్దు

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**పెద్దపల్లి, ఫిబ్రవరి 1 (మనం ప్రతినిధి):** కలెక్టరేట్లో సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు వినతులు ఇవ్వడానికి కలెక్టరేట్ కు రావద్దని విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ ఎన్నికలు మాడల్ కోడ్ అమలులో ఉన్నందున అధికారులంతా క్షేత్రస్థాయిలో ఎన్నికల విధులలో ఉన్నందున ప్రజావాణి రద్దు చేస్తున్నట్లు, పురపాలక ఎన్నికల అనంతరం ప్రజావాణి నిర్వహణపై మరోసారి పత్రిక ప్రకటన విడుదల చేస్తామని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



# నేటి ప్రజావాణి కార్యక్రమం రద్దు

- ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్

**రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 1(మనం ప్రతినిధి):** జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఒక ప్రకటనలో తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం ప్రజల నుండి వినతులను స్వీకరించే ప్రజావాణి కార్యక్రమాన్ని మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో రద్దు చేసినట్లు పేర్కొన్నారు. ప్రజావాణి కార్యక్రమం రద్దయిన విషయాన్ని జిల్లా ప్రజలు గమనించాలని సూచించారు. ఎన్నికల కోడ్ ముగిసేంతవరకు ప్రజావాణి కార్యక్రమము ఉండదని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ స్పష్టం చేశారు.

# అన్ని శాఖల సమన్వయంతో ఆపరేషన్ స్మైల్-11 విజయవంతం

- జిల్లా లో 37 మంది బాల కార్మికులకు విముక్తి
- జిల్లా ఎస్పీ అశోక్ కుమార్

**జగిత్యాల, ఫిబ్రవరి 01 (మనం ప్రతినిధి):** బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి సంవత్సరంలో రెండు సార్లు ఆపరేషన్ స్మైల్, మరియు ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాలను నిర్వహించి తప్పిపోయిన బాలలను గుర్తించి వారి తల్లిదండ్రుల వద్దకు చేర్చడానికి జిల్లా వ్యాప్తంగా ఆపరేషన్ స్మైల్ కార్యక్రమం అన్ని శాఖల సమన్వయంతో విజయవంతంగా నిర్వహించడం జరిగింది. ఆపరేషన్ స్మైల్ విజయవంతం కోసం ఒక్కో సబ్ డివిజన్ పరిధిలో ఒక సబ్- ఇన్స్ పెక్టర్, ముగ్గురు కానిస్టేబుల్స్,ఒక మహిళ కానిస్టేబుల్ ను ప్రత్యేకంగా కేటాయించి చైల్ లైన్ తో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ప్రభుత్వేతర స్వచ్చంద సంస్థలను గుర్తించి విస్తృతంగా తనిఖీలు నిర్వహించడం జరిగింది . ఇందులో భాగంగా ఈ సంవత్సరం జనవరి 1 నుండి 31 వరకు ఆపరేషన్ స్మైల్-11 కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా నిర్వహించడం జరిగింది ఇందులో 37 మంది బాలకార్మికులను గుర్తించి చైల్ వెల్ఫేర్ కమిటీ ముందు హాజరుపరచడం జరిగింది. అదేవిధంగా 18 సంవత్సరాలలోపు ఉన్న పిల్లల తో పని చేస్తున్న వారి పై ఐదు కేసులు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ... బాలల హక్కులను కాపాడాల్సిన బాధ్యత మానందరిపైనా ఉన్నదని, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం బాధ్యతాయుతంగా కృషి చేయాలని కోరారు. బాలల హక్కులను, బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి ఆపరేషన్ స్మైల్, మరియు ముస్కాన్ కార్యక్రమాలను నిరంతరం నిర్వహించడం జరుగుతుంది అని అలాగే ఎవరైనా బాలలను పనిలో పెట్టుకున్న, ఎక్కడైనా పనిచేసిన, తప్పిపోయిన వదిలివేయబడిన బాలల సమాచారం తెలిసిన వెంటనే డయల్ 100 కి కాల్ చేసి పోలీసు వారికి సమాచారం ఇవ్వగలరు అని తెలిపారు. బాలకార్మికులుగా పెట్టుకున్న వారిపై కూడా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. పోలీసు శాఖతో కలిసి ఆపరేషన్ స్మైల్-11 విజయవంతం చేయడంలో కృషి చేసిన వివిధ శాఖల అధికారులను, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.



# కేసీఆర్‌పై సీఎం కక్ష సాదింపు చర్యలు



**మంథనిఫిబ్రవరి01 (మనంన్యూస్)** తెలంగాణ జాతిపిత, తెలంగాణ రాష్ట్ర సాధకులు మాజీ సీఎం కేసీఆర్ను ఈ సమాజం,ప్రజల ముందు చులకనగా చూపించేందుకు రేవంత్రెడ్డి కుట్రలు చేస్తున్నాడని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. రాజకీయ కక్ష సాధింపు కార్యక్రమంలో భాగంగా తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కు అక్రమంగా సిట్ పోలీసులు నోటీసులు ఇవ్వడాన్ని నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్త నిరసనలో బాగంగా రామగిరి మండలం నాగేపల్లి ఎక్స్ రోడ్ నుండి సెంటినరీ కాలనీ తెలంగాణ చౌరస్తా వరకు బైక్ ర్యాలీ అనంతరం తెలంగాణ చౌరస్తాలో ప్రభుత్వం దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఆనాడు సోనియాగాంధీ మెడలు వంచి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకుని పదేళ్ల కాలంలో రాష్ట్రాన్ని అగ్రగామిలో నిలిపిన గొప్పనాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. ఆంధ్రావాళ్లకు తొత్తుగా మారి సంచులు మోసే రేవంత్రెడ్డి తెలంగాణ పోరాట పటిమ, ఉద్యమం గురించి తెలియని మూర్ఖుడు అని అన్నారు.ఓటుకు నోటు కేసులో రెడ్హ్యాండెడ్గా రేవంత్రెడ్డి దొరికిన విషయాన్ని యావత్ తెలంగాణ ప్రజలు గమనించారని ఆయన గుర్తు చేశారు.కుట్రలు కుతంత్రాలతో కేసీఆర్ను సమాజం ముందు చిన్నగా చూపించాలనే ప్రయత్నాన్ని ప్రజలు గమనిస్తూనే ఉన్నారని అన్నారు.ఏదో ఒక నింద మోపి దాని మీద బతుకాలనే నీచ ఆలోచనకు యావత్ తెలంగాణ సమాజం కాంగ్రెస్ ప్రభుత్వ నీతిని అర్థంచేసుకుంటున్నారని,నేటి యువ ఓటర్లకు కాంగ్రెస్ నీతిని రేవంత్రెడ్డి చూపిస్తున్నాడని అన్నారు.తెలంగాణ ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేయాలని పార్టీ ఆదేశిస్తే రామగిరిలో ముందుగానే గమనించి ఈ ప్రభుత్వం అనాథగా మారిందని, ప్రజల నుంచి తిరస్కరించబడిందని ముందే వాళ్లు దహనం చేయడం సంతోషంగా ఉందన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం,రేవంత్ పాలనపై విసుగు చెందిన యావత్ తెలంగాణ ప్రజలు ఎన్నికలు ఎప్పుడు వస్తాయని రోజులు లెక్కపెడుతున్నారని, అవకాశం వస్తే రేవంత్రెడ్డిని, ప్రభుత్వాన్ని సముద్రంలో కలుపాలని, కృష్ణాగోదావరిలో సాగనంపాలని ఎదురుచూస్తున్నారని అన్నారు.కాంగ్రెస్ పార్టీలో ఉండే వంద మంది నాయకుల్లో పది మంది తొత్తులు తప్ప మిగితా 90మంది ఈ ప్రభుత్వాన్ని చీడనాడుతాండ్లని ఆయన గుర్తు చేశారు. పదేళ్లలో ఈ రాష్ట్రాన్ని సమాజాన్ని అగ్రస్థానంలో నిలిపిన కేసీఆర్ను చిల్లర నోటీసులు ఇచ్చి ఫోన్ ట్యాంపింగ్ పేరుతో బదనాం చేస్తున్నారని, ఫోన్ ట్యాంపింగ్ ఎవరు చేస్తారో దానికి సంబంధించిన విధివిధానాలు రాజ్యాంగంలో రాసి ఉన్నా కేసీఆర్ కుట్రలు చేస్తున్నారని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వనీతిని ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేయడంతో నియోజకవర్గ బీఆర్ఎస్ శ్రేణులు ముందు వరుసలో ఉండాలన్నారు. ప్రభుత్వ పనితీరుపై నిరసన తెలుపడం ప్రజాస్వామ్యం కల్పించిన హక్కు అని, ఈ విషయంలో పోలీసులు అత్యుత్సాహం చూపించవద్దని ఆయన హితవు పలికారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పాల్గొన్నారు.

# కూచిపూడి నృత్యం భారతీయ సంస్కృతికి చిహ్నం

- నాట్య మయూరి ఉజ్వలకు ఘనసన్మానం
- ఖని ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి గడ్డం శ్యామ్ కుమార్



**గోదావరిఖని, ఫిబ్రవరి 01 (మనం న్యూస్):** కూచిపూడి నృత్యం భారతీయ సంస్కృతికి ఒక చిహ్నమని గోదావరిఖని ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి గడ్డం శ్యామ్ కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక కోదండ రామాలయం ఆవరణలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో జనవరి 26 గణతంత్ర దినోత్సవం వేడుకలలో భాగంగా ఢిల్లీలో కూచిపూడి నృత్య ప్రదర్శన చేసిన నృత్య ఖని వ్యవస్థాపకురాలు గుమ్మడి ఉజ్వలను గడ్డం శ్యామ్ కుమార్ సన్మానించారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ... దేశ రాజధాని ఢిల్లీలో ప్రతి సంవత్సరం నిర్వహించే రిపబ్లిక్ డే సందర్భంగా కూచిపూడి నృత్య ప్రదర్శనకు తెలంగాణ రాష్ట్రం నుండి 30 మంది నృత్య కళాకారులు ఎంపిక చేయగా పారిశ్రామిక ప్రాంతానికి చెందిన ఉజ్వల ఆ ప్రదర్శనకు ఎంపిక కావడం, ఆ ప్రదర్శన విజయవంతమై ప్రముఖుల మన్ననలు పొందడం గర్వకారణమని అన్నారు. సంప్రదాయ కళలు అంతరించిపోతున్న ఈరోజుల్లో కూచిపూడి నృత్యాన్ని మరింత విస్తరింపజేసేందుకు ఉజ్వల చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కూచిపూడి నృత్యంలో మాస్టర్ డిగ్రీ పూర్తి చేసిన ఉజ్వల గడిచిన రెండు దశాబ్దాలుగా పారిశ్రామిక ప్రాంతంలో నృత్య ఖని పేరుతో వందలాది మందికి కూచిపూడి నృత్యంలో శిక్షణ ఇస్తున్నారని, నృత్య ప్రదర్శనలో ఉజ్వలది అద్భుతమైన అభినయమని, భవిష్యత్తులో ఉజ్వల మరిన్ని ప్రదర్శనలు ఇచ్చి రాష్ట్రానికి, మన ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఉజ్వలకు ఎల్లవేళల సహాయ సహకారాలు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గుమ్మడి పెద్దులు, నిర్మలాదేవి, తగరపు శంకర్, సొత్కు రమేష్ తో పాటు విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఆదివారం అంబేద్కర్ స్మరణం

- బలమైన సమాఖ్య వ్యవస్థను అందించిన డా. బి. ఆర్.అంబేద్కర్



**జగిత్యాల ఫిబ్రవరి 01(మనం న్యూస్):** జగిత్యాల జిల్లాలో కేంద్రంలో ఆదివారం ప్రబుద్ధ భారత్ ఇంటర్నేషనల్, హైదరాబాద్ కార్యవర్గసభ్యుడు, డిక్కి జిల్లా కోఆర్డినేటర్ నల్ల శ్యామ్ ఆధ్వర్యంలో డా. బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి బోనగిరి దేవయ్య, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, జగిత్యాల, రాష్ట్ర కార్యదర్శి - తెలంగాణ ప్రాంతీయ ఉపాధ్యాయుల సంఘం పూల మాలతో నివాళ్లు అర్పించి సేవలను స్మరించారు. అంబేద్కర్ దేశానికి అందించిన అమూల్యమైన సేవలు, సమానత్వం, న్యాయం సామాజిక సంస్కరణలో వారి ఆలోచనలు, ఆశయాలను, ఆదర్శాల ద్వారా భవిష్యత్ తరాలు స్ఫూర్తి పొందటంతో పాటు స్మరించుకోవాలని కార్యక్రమం ప్రతి ఆదివారం నిర్వహిస్తున్నామని నల్ల శ్యామ్ తెలిపారు. అంబేద్కర్ గురించి విస్తతంగా తెలుసుకొనుటకు స్వచ్ఛందంగా ప్రతి ఆదివారం నిర్వహిస్తున్న ఇట్టి కార్యక్రమం అందరూ హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి మాట్లాడుతూ.... భారత దేశ భవిష్యత్ ముఖ చిత్రాన్ని రాజ్యాంగం ద్వారా బాబా సాహెబ్ ఆవిష్కరించారని అన్నారు. స్వతంత్ర భారతవానికి బడుగు బలహీన వర్గాలు, రాజకీయ, పౌర హక్కులు, రక్షణలు అన్ని సమగ్రంగా పొందుపరిచారని పేర్కొన్నారు. అగ్రరాజ్యంగా పిలువబడే అమెరికా లాంటి దేశాల్లో తీవ్రమైన రాజకీయ అనిచ్చితి ఉన్నా మనం దేశంలో బలమైన సమాఖ్య వ్యవస్థను దూర దష్టితో ఏర్పాచారని అన్నారు. అంబేద్కర్ బహుజనులు, దళిత, సబ్బండ వర్గాలకు జాతి నాయకుడు అని కొనియాడారు. కార్యక్రమం నిర్వాహకులు నల్ల శ్యామ్ కు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియాఅంబెడ్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్దెల నారాయణ పెన్షనర్ సంఘం జగిత్యాల పట్టణ ప్రధాన కార్యదర్శి కంటి అంజయ్య, తెలంగాణ శక్తి ఎడిటర్ అనంతుల కాంతారావు, ఎస్సీ ఎస్టీ ఉద్యోగస్తుల సంఘం జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్, అంబేద్కర్ సంఘం జిల్లా సీనియర్ నాయకులు ధూమాల గంగారం, సుంకరపల్లి అశోక్, నల్ల సురేష్, మాజీ సర్పంచ్ దాసరి లచ్చయ్య, దాసరి ప్రవీణా, రాగం రమేష్, కలబండ వెంకటి ఎస్ రాజేందర్, పడేగల లక్ష్మణ్. అంబేద్కర్ సంఘం జిల్లా కార్యదర్శి గజ్జల రాజు, బొల్లం ప్రభాకర్, సురేష్ బిట్ల ప్రకాష్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు

# బెల్లంపల్లి మున్సిపాలిటీలో 252 మంది అభ్యర్థులు,361 నామినేషన్ల దాఖలు.




- కాంగ్రెస్ బీఫామ్ రాదని తెలిసినవారు రాత్రికి రాత్రే బిఆర్ఎస్ లోకి జంపు
- కొందరు ఏకంగా రెండు పార్టీల అభ్యర్థులుగా నామినేషన్లు దాఖలు

**బెల్లంపల్లి, ఫిబ్రవరి 1, (మనం న్యూస్)**

బెల్లంపల్లి మున్సిపాలిటీలో రెండవ సాధారణ ఎన్నికల సందర్భంగా బెల్లంపల్లి మున్సిపాలిటీలో 252 మంది అభ్యర్థులు 361 నామినేషన్లు ఇప్పటివరకు దాఖలు అయినట్లు మున్సిపల్ కమిషనర్ సంపత్ రెడ్డి తెలిపారు. 1 వార్డులో కాంగ్రెస్ 3, బిఆర్ఎస్ 2, 2 వార్డులో బిఆర్ఎస్ 1, కాంగ్రెస్ 2, బిజెపి 1, 3 వార్డులో టిఆర్ఎస్ 1, ఇండిపెండెంట్ 1, కాంగ్రెస్ 4, 4 వార్డులో కాంగ్రెస్ 3, బిఆర్ఎస్ 3, బిజెపి 2, బి ఎస్ పి 2, ఇండిపెండెంట్ 1, 5 వార్డులో బిజెపి 1, కాంగ్రెస్ 4, బిజెపి 1, బిఆర్ఎస్ 1, ఇండిపెండెంట్ 2, 6 వార్డులో బిజెపి 1, కాంగ్రెస్ 2, టిఆర్ఎస్ 2, డి వి పి 1, సిపిఐ 1, ఇండిపెండెంట్ 3, 7 వార్డులో కాంగ్రెస్ 3, బిఆర్ఎస్ 4, 8 వార్డులో సిపిఐ 2, బిఆర్ఎస్ 2, కాంగ్రెస్ 5, బిజెపి 1, 9 వార్డులో కాంగ్రెస్ 3, బిఆర్ఎస్ 1, బిజెపి 1, బి ఎస్ పి 1, 10 వార్డులో కాంగ్రెస్ 4, బిఆర్ఎస్ 2, బిజెపి 1, సిపిఐ 1, ఇండిపెండెంట్ 1, 11 వార్డులో బిఆర్ఎస్ 2, కాంగ్రెస్. 3, సిపిఐ 1, బిజెపి 1, ఇండిపెండెంట్ 1, 12 వార్డులో బిఆర్ఎస్ 1, కాంగ్రెస్ 4, బిజెపి 1, ఇండిపెండెంట్ 2, 13 వార్డులో కాంగ్రెస్ 2, టిఆర్ఎస్ 5, 14వ వార్డులో కాంగ్రెస్ 5, బిఆర్ఎస్ 3, బిజెపి 2, టి జె ఎస్ పి 1, ఇండిపెండెంట్ 3, 15 వార్డులో కాంగ్రెస్ 6, బిఆర్ఎస్ 3, సిపిఐ 1, ఏఐఎఫ్బి 1, 16 వార్డులో కాంగ్రెస్ 5, బిఆర్ఎస్ 4, బిజెపి 1, 17 వార్డులో కాంగ్రెస్ 5, టిఆర్ఎస్ 2, బీఎస్పీ 1, ఇండిపెండెంట్ 1,18 వార్డులో , కాంగ్రెస్ 5, బిఆర్ఎస్ 1, బిజెపి 2, జె ఎస్ పి 1, 19 వార్డులో బిఆర్ఎస్ 2, ఏఐఎంఐఎం 1, కాంగ్రెస్ 6, బి ఎస్ పి 1, ఇండిపెండెంట్ 1, 20 వార్డులో బిఆర్ఎస్ 3, బిజెపి 2, కాంగ్రెస్ 5, బి ఎస్ పి 2, 21 వార్డులో ఇండిపెండెంట్ 2, కాంగ్రెస్ 4, బిఆర్ఎస్ 2, 22 వార్డులో కాంగ్రెస్ 2, బిఆర్ఎస్ 3, 23 కాంగ్రెస్ 3, బిఆర్ఎస్ 3, సిపిఐ 1, బిజెపి 2, 24 వార్డులో బిఆర్ఎస్ 1, కాంగ్రెస్ 3, ఏఐఎస్బి 1, 25 వార్డులో బిఆర్ఎస్ 3, కాంగ్రెస్ 1, బి ఎస్ పి 1, ఏఐ ఎంఐఎం 1, 26 వార్డులో బిఆర్ఎస్ 2, కాంగ్రెస్ 5, బిజెపి 1 సిపిఐ 1,,27 వార్డులో కాంగ్రెస్ 2, బిఆర్ఎస్ 3, బిజెపి 1, 28 వార్డులో కాంగ్రెస్ 5, ఎం సి పి ఐ యు 1, బిజెపి 1, బిఆర్ఎస్ 3, 29 వార్డులో కాంగ్రెస్ 3, బిజెపి 3, బిఆర్ఎస్ 4, ఇండిపెండెంట్ 1, 30 వార్డులో కాంగ్రెస్ 2, బిఆర్ఎస్ 2, బిజెపి 1, 31 వార్డులో కాంగ్రెస్ 4, బిఆర్ఎస్ 2, 32 వార్డులో కాంగ్రెస్ 1, బిఆర్ఎస్ 2, ఇండిపెండెంట్ 1, 33 వ వార్డులో బిఆర్ఎస్ 3, కాంగ్రెస్ 3, 34వ వార్డులో కాంగ్రెస్ 5, బిఆర్ఎస్ 3, బిజెపి 1, ఇండిపెండెంట్ 1, 34 వార్డులలో 252 మంది అభ్యర్థులు, 361 నామినేషన్ దాఖలు చేశారు. బెల్లంపల్లి మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ టికెట్ ఆశావాహులు కొందరు బిఆర్ఎస్, బి ఎస్ పి పలు పార్టీలపై కూడా నామినేషన్లు దాఖలు చేశారు. వారు గెలుపు గుర్రాలుగా భావిస్తూ వారికి ఏదో ఒక పార్టీ నుండి టికెట్ వస్తే పార్టీ సింబల్ ఉంటుందని ఆశించి ఉంటారన్న ఆరోపణలు వినబడుతున్నాయి. బెల్లంపల్లి మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ నుండి టికెట్ ఆశించేవారు పార్టీ టికెట్ రాదని పిలవడంతో కొందరు ఇప్పటికే వి ఆర్ ఎస్ పార్టీలో చేరడం జరిగింది. 252 మంది అభ్యర్థులలో ఎంతో మంది బరిలో ఉంటారనేది 2 రోజుల్లో తెలుస్తుంది. ఇప్పటికే టికెట్ కన్ఫామ్ అనుకునేవారు వారి వార్డులలో ప్రచారం సాగిస్తున్నారు.

మనం Manam

Medak మెదక్

# అసమానతలను పెంచే కేంద్ర బడ్జెట్

- **0.0286 శాతం నిధులతో వికలాంగుల అభివృద్ధి ఎలా సాధ్యం?**
- **ఎన్‌పిఆర్‌డి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యం అడివయ్య**

**సంగారెడ్డి, ఫిబ్రవరి 1(మనంప్రతినిధి):** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ వికలాంగుల హక్కులను ఉల్లంఘిస్తుందని, సమానతను పెంపొందిస్తుందని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యం అడివయ్య అన్నారు. మూడో సారి కేంద్రంలో మోడీ అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ 2026-27 మినహాయింపు పథాన్ని కొనసాగిస్తుందని, ఇది అసమానత , ఉపాంతీకరణను తీవ్రతరం చేసే స్పష్టమైన కార్పొరేట్ అనుకూల మరియు ధనిక అనుకూల పక్షపాతాన్ని ప్రతిబింబిస్తుంది. వికలాంగుల విషయంలో, ఈ బడ్జెట్ నిర్లక్ష్యం కాదు, హక్కులను చురుకుగా తిరస్కరించడాన్ని సూచిస్తుంది.

వికలాంగుల హక్కుల చట్టం, 2016 ప్రకారం, భారత రాష్ట్రం చట్టబద్ధంగా సమానత్వం, వివక్షత లేని , వికలాంగుల పూర్తి భాగస్వామ్యాన్ని నిర్ధారించాల్సిన బాధ్యత ఉంది. ఈ చట్టం సమ్మిళిత విద్య, ఆరోగ్య సంరక్షణ, ఉపాధి, సామాజిక భద్రత, అందుబాటులో ఉన్న గృహనిర్మాణం, రవాణా మరియు ప్రజా సేవల హక్కులకు హామీ ఇస్తుంది. అయినప్పటికీ ఈ బడ్జెట్లోని నిబంధనలు ఈ చట్టబద్ధమైన హక్కులను వాస్తవికతలోకి అనువదించడంలో ఎటువంటి తీవ్రతను చూపించవు. వికలాంగుల సాధికారత శాఖ (డి ఈ పిడబ్ల్యుడి ) కు మొత్తం కేటాయింపులలో స్వల్ప పెరుగుదల ఉన్నప్పటికీ, ఈ పెరుగుదల ప్రధానంగా ప్రకటించిన రెండు కొత్త పథకాలకు వెళుతుంది. మొత్తం బడ్జెట్ కేటాయింపులలో కేటాయింపులు 0.0286 శాతం మాత్రమే ఉన్నాయి, ఇది జిడిపి లో దాదాపు 0.008 శాతం. దివ్యాంగ్జన్ కౌశల్ యోజన అని పిలవబడేది వికలాంగులకు ఉపాధిని కల్పించడంలో విఫలమైన అసమర్థమైన నైపుణ్య శిక్షణ పథకాల యొక్క మరొక పునరావృతం. నిధులు ఎక్కువగా శిక్షణా సంస్థలకు ప్రవహిస్తాయి, అర్థవంతమైన నైపుణ్య అభివృద్ధి లేదా ఉద్యోగ నియామకానికి తక్కువ ఆధారాలు ఉన్నాయి. అదేవిధంగా, దివ్యాంగ్జన్ సహారా యోజన కొత్తగా ఏమీ అందించదు; ఇది ఈ ప్రభుత్వం గతంలో ఉపసంహరించుకున్న సహాయాలు మరియు సహాయక పరికరాల తయారీకి ఏ ఎల్ ఐ ఎం సి ఓకి బడ్జెట్ మద్దతు యొక్క పునఃప్యాకేజింగ్. అయితే, ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే వికలాంగుల అమలు చట్టం కోసం పథకానికి మద్దతు తగ్గడం. కీలకమైన కేంద్ర పథకాలు, విద్య, ఆరోగ్యం, గ్రామీణాభివృద్ధి మరియు వ్యవసాయానికి కేటాయింపులలో తీవ్ర తగ్గింపులు వికలాంగులకు మరియు వారి కుటుంబాలకు తీవ్ర పరిణామాలను కలిగిస్తాయి. ఈ కోతలు పాఠశాలలకు అందుబాటులో లేకపోవడం, భరించలేని ఆరోగ్య సంరక్షణ, ఆకలి, అసురక్షిత గృహాలు మరియు జీవనోపాధి అభద్రతకు దారితీస్తాయి. ఆహారం మరియు వ్యవసాయ మద్దతులో కోతలు ముఖ్యంగా గ్రామీణ వికలాంగులను తీవ్రంగా దెబ్బతీశాయి, ఇక్కడ వైకల్యం మరియు పేదరికం చాలా తీవ్రంగా కలుస్తాయి. ముఖ్యంగా, ఇందిరా గాంధీ వికలాంగుల పెన్షన్ పథకంలో ఎటువంటి మెరుగుదల జరగలేదు, ఇది 2012 నుండి నెలకు 300 వద్ద స్తంభించిపోయింది మూలధన వ్యయ కోతలు అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలు, రవాణా మరియు సహాయక సాంకేతిక పరిజ్ఞానాలలో పెట్టుబడులను నిలిపివేసాయి - ఆర్పిడబ్ల్యుడి చట్టం కింద తప్పనిసరి చేయబడిన ప్రాంతాలు. ప్రాప్యత అనేది పొదుపు చర్యలకు నష్టం కలిగించదు. చాలా వైకల్య సంబంధిత పథకాలను అమలు చేయడానికి బాధ్యత వహించే రాష్ట్ర ప్రభుత్వాలు, తగ్గిన కేంద్ర బదిలీలు మరియు బలహీనమైన జిఎస్టి. వసూళ్లు, పెన్షన్లు, పునరావాసం మరియు మద్దతు సేవల ద్వారా ఆర్థికంగా ఉక్కిరిబిక్కిరి చేయబడుతున్నాయి.

వికలాంగుల కోసం, ఆర్థిక మంత్రి ప్రయోగించిన 'ఆర్థిక క్రమశిక్షణ' అంటే క్షీణిస్తున్న సంక్షేమం, ప్రజా సేవలను బలహీనపరచడం మరియు మనుగడ ఖర్చులు పెరగడం. కార్పొరేషన్లు మరియు సంపన్నులకు పన్ను రాయితీలు ఇవ్వబడుతున్నప్పటికీ, మన హక్కులను అమలు చేయగలిగేలా చేసే ఖర్చులు క్రమపద్ధతిలో తగ్గించబడతాయి. ప్రభుత్వం ప్రగతిశీల పన్నులను అనుసరించడానికి నిరాకరిస్తుంది మరియు వ్యయ కుదింపుపై ఆధారపడుతుంది, ఇది ప్రజా వ్యవస్థలు మరియు సామాజిక భద్రతా చర్యలపై ఎక్కువగా ఆధారపడిన వికలాంగులకు కూడా అసమానంగా హాని కలిగిస్తుంది.



# ఇది ముమ్మాటికి కక్ష సాధింపు చర్య



- **కెసిఆర్ సిట్ నోటీసులకు వ్యతిరేకంగా నిరసన**
- **ఎమ్మెల్యే చింత ప్రభాకర్**

**సంగారెడ్డి, ఫిబ్రవరి 1(మనం ప్రతినిధి):** తెలంగాణ ఉద్యమకారుడు తొలి ముఖ్యమంత్రి కల్వకుంట చంద్రశేఖర రావు కు సీట్ నోటీసులు ఇవ్వడాన్ని ఇది ముమ్మాటికీ కక్ష సాధింపు చర్య నే అని సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ అన్నారు. కెసిఆర్ సీట్ నోటీసులకు వ్యతిరేకంగా ఆదివారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు సంగారెడ్డి పట్టణ కేంద్రంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన కార్యక్రమం చేపట్టారు. బిఆర్ఎస్ పార్టీ , ఆధ్వర్యంలో బిఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున నిరసన ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింత ప్రభాకర్ మాట్లాడుతూ, కేసీఆర్ ని టచ్ చేయడం అంటే తెలంగాణ ఆత్మగౌరవాన్ని టచ్ చేయడమే అని హెచ్చరించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం కక్షపూరిత రాజకీయాల్లో భాగంగానే ఈ సిట్ నోటీసులు జారీ చేసిందని తీవ్రంగా ఖండించారు. సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు నల్ల బ్యాడ్జీలు ధరించి, నల్ల కండువాలతో ర్యాలీగా బయలుదేరి కొత్త బస్టాండ్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ రేవంత్ రెడ్డి డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనానికి ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులు-బిఆర్ఎస్ శ్రేణుల మధ్య స్వల్ప తోపులాట చోటుచేసుకుంది. చింత ప్రభాకర్ మాట్లాడుతూ, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్ తెలంగాణను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దారని అన్నారు. దేశంలోనే కాదు, ప్రపంచ వ్యాప్తంగా కేసీఆర్కు గుర్తింపు ఉందని, ఓటుకు నోటు కేసులో ఇరుక్కున్న రేవంత్ రెడ్డి కక్షపూరితంగా వ్యవహరిస్తూ కేసీఆర్కు సిట్ నోటీసులు ఇస్తున్నారని ఆరోపించారు. కేసీఆర్‌కి 60 లక్షల మంది కార్యకర్తల మద్దతుతో పాటు నాలుగు కోట్ల మంది ప్రజల ఆశీస్సులు ఉన్నాయని పేర్కొన్నారు. రాజకీయంగా రేవంత్ రెడ్డి బొంద పెడితే పాతాళానికి వెళ్లడం ఖాయమని వ్యాఖ్యానించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వ మూర్ఖమైన రాజకీయ తీరును ప్రజలు గమనిస్తున్నారని, రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు తప్పకుండా గుణపాఠం చెబుతారని స్పష్టం చేశారు. ఇది చట్టపరమైన విచారణ కాదని, పూర్తిగా రాజకీయ కక్ష సాధింపు చర్యేనని అన్నారు. అధికారం శాశ్వతం కాదు అహంకారం అంతకంటే శాశ్వతం కాదు. మీలాంటి ఎందరో నియంతలు కాలగర్భంలో కలిసిపోయారు అంటూ రేవంత్ రెడ్డిపై చింత ప్రభాకర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సింగరేణి, సోలార్ టెండర్లు, ఇతర అవినీతి ఆరోపణల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఈ సిట్ నోటీసుల డ్రామా చేస్తున్నారని మండిపడ్డారు. ఆరు గ్యారెంటీల అమలు చేతకాక, ప్రజల కడుపు నింపలేక అటెన్షన్ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆరోపించారు.

ఈ కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, మాజీ టీఎన్జీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మామిళ్ళ రాజేందర్, డా. శ్రీహరి, పట్టణ అధ్యక్షులు ఆర్. వెంకటేశ్వర్లు, షేక్ రషీద్, మల్ల గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు చక్రపాణి తదితర పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల్లో అత్యధిక స్థానాలు గెలుస్తాం

- **కరీంనగర్లో బీఆర్ఎస్ బీజేపీల కుమ్మక్కు**
- **ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర కన్వీనర్ అంబటి జోజిరెడ్డి**



**కరీంనగర్, ఫిబ్రవరి 1(మనం న్యూస్):** గత స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ విస్తృతంగా పోటీ చేసి గణనీయమైన విజయాలు సాధించిందని పార్టీ రాష్ట్ర కన్వీనర్ అంబటి జోజిరెడ్డి తెలిపారు. ప్రజల్లో పార్టీకి పెరుగుతున్న ఆదరణకు ఈ ఫలితాలే నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా అంబటి జోజిరెడ్డి మాట్లాడుతూ, గత ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో 224 మంది అభ్యర్థులను బరిలో దింపగా, 102 స్థానాల్లో ఫార్వర్డ్ బ్లాక్ ఘన విజయం సాధించింది. ఇది ప్రజలు మా పార్టీపై పెట్టుకున్న నమ్మకానికి ప్రతీక అని అన్నారు.ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 2 జడ్పీటీసీ స్థానాలు, 49 ఎంపీటీసీ స్థానాలను ఫార్వర్డ్ బ్లాక్ గెలుచుకోవడం గర్వకారణమని తెలిపారు. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ప్రజా సమస్యలపై పోరాడినందుకే ఈ విజయాలు సాధ్యమయ్యాయి అని చెప్పారు. గత మున్సిపల్ ఎన్నికల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మొత్తం 17 స్థానాలను పార్టీ కైవసం చేసుకుందని తెలిపారు. చొప్పదండిలో 1, పెద్దపల్లిలో 1, రామగుండంలో 9, కరీంనగర్లో 3, జగిత్యాలలో 1, రాయికల్లో 2 స్థానాల్లో ఫార్వర్డ్ బ్లాక్ విజయం సాధించిందన్నారు. ప్రస్తుత మున్సిపల్ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 230 మంది అభ్యర్థులను బరిలో దింపినట్లు వెల్లడించారు. ఈసారి మున్సిపల్ ఎన్నికల్లో అత్యధిక స్థానాలు గెలుస్తాం. ప్రజలు ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా ఫార్వర్డ్ బ్లాక్ వైపు చూస్తున్నారు అని ధీమా వ్యక్తం చేశారు. కరీంనగర్లో బీఆర్ఎస్, బీజేపీలు కుమ్మక్కై రాజకీయాలు చేస్తున్నాయని ఆరోపించారు. ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటూ, లోపల మాత్రం అవగాహనతో వ్యవహరిస్తున్నారు. ప్రకటనలకే పరిమితమై, క్షేత్రస్థాయిలో సంక్షేమం ప్రజలకు అందడం లేదు. ఈ ప్రభుత్వ వైఫల్యమే రాబోయే ఎన్నికల్లో తేలిపోతుంది అని జోజిరెడ్డి అన్నారు. రానున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో అన్ని స్థానాల్లో అభ్యర్థులను నిలిపి, అత్యధిక స్థానాలు గెలుచుకోవడమే లక్ష్యంగా ఫార్వర్డ్ బ్లాక్ పనిచేస్తుందని స్పష్టం చేశారు. ప్రజల మద్దతుతో ఫార్వర్డ్ బ్లాక్ను మరింత బలమైన రాజకీయ శక్తిగా తీర్చిదిద్దుతాం అని అంబటి జోజిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు.



# ఆర్టీసీ కండక్టర్ నిజాయితీ ప్యాసింజర్ నగలు పదిలం

**నర్సంపేట, ఫిబ్రవరి 1 (మనం న్యూస్):** మేడారం నుండి నర్సంపేటకి తిరుగు ప్రయాణంలో ప్రయాణికురాలు బస్సులో పోగొట్టుకున్న బంగారాన్ని ఇచ్చిన ఆర్టీసీ కండక్టర్ ను నర్సంపేట నియోజకవర్గం ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి శాల్వా కప్పి పూలమాలతో సత్కరించి అభినందించారు. మహమ్మద్ యాకుబ్ పాషా నిజాయితీని ప్రజలందరూ ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు.

# సొంతగూటికి గువ్వల

**ఉమ్మడి మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 1 (మనం బ్యూరో):** మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకుడు గువ్వల బాలరాజు అచ్చంపేట నియోజకవర్గం లో మళ్ళీ బీఆర్ఎస్ పార్టీకి రావడానికి రీఎంట్రీ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారా....? అన్న ప్రశ్న నియోజకవర్గంలో పెద్ద ఎత్తున చర్చనీయాంశంగా సాగుతుంది. గత సంవత్సరం గువ్వల బాలరాజు బీఆర్ఎస్ పార్టీ నుండి బిజెపి తీర్థం పుచ్చుకొని పార్టీలో చేరారు. గత కొన్ని నెలల నుండి అచ్చంపేట నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీకి సరియైన నాయకుడు లేకపోవడం పట్ల పార్టీ క్యాడర్ రోజురోజుకు దిగజారుతున్న విషయాన్ని గుర్తించిన రాష్ట్ర అధినాయకులు మళ్లీ మాజీ బీఆర్ఎస్ పార్టీ నేతలు పార్టీలోకి వస్తే స్వాగతిస్తామని చెప్పడం జరిగింది. గత మూడు రోజుల క్రితం జన్వాడ ఫామ్ హౌస్ లో గువ్వల బాలరాజు బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ను కలవడం వెనుక ఆంతర్యం ఏంటి...! అనే విషయంపై పెద్ద ఎత్తున నియోజకవర్గంలో చర్చ జరుగుతుంది. నిజంగా మళ్లీ గువ్వల బాలరాజు భారతీయ జనతా పార్టీ ని వీడి బీఆర్ఎస్ పార్టీలోకి చేరుతుండడం కొంతవరకు పార్టీ నేతలు ఆనందం రేకెత్తిస్తుందని చెప్పవచ్చు. గువ్వల బాలరాజు రాకతో బీఆర్ఎస్ పార్టీకి పూర్వ వైభవం వచ్చేనా...? అన్న ప్రశ్న మొదలైంది. ఏదేమైనాప్పటికీ అచ్చంపేట నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీకి బలం చేకూరుతుందని పార్టీ సీనియర్ నేతలు, కార్యకర్తలు చెప్పుకొస్తున్నారు.



# వేములవాడలో కాషాయ జెండా ఎగరడం ఖాయం




- **మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి**

**వేములవాడ, ఫిబ్రవరి1(మనం న్యూస్):** వేములవాడ పట్టణ బిజెపి శాఖ ఆధ్వర్యంలో మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. రాజన్న క్షేత్రంలో గత మూడు రోజులుగా జరుగుతున్న రాజకీయ పరిణామాలు కాషాయ జెండా ఎగరవేయడానికి అత్యంత అనుకూలంగా ఉన్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. వేములవాడ రాజన్నను ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా దర్శించుకున్న పవిత్ర క్షేత్రమని గుర్తు చేస్తూ, పట్టణ సమగ్ర అభివృద్ధి బిజెపి ద్వారానే సాధ్యమని పేర్కొన్నారు. పట్టణ ప్రజలందరూ భారీ మెజార్టీతో బిజెపి బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని, కమలం పువ్వు గుర్తుపై ఓటు వేసి పట్టణ ప్రగతికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి పట్టణ అధ్యక్షులు రాపల్లి శ్రీధర్, జిల్లా అధ్యక్షులు ప్రతాప రామకృష్ణ, నాయకులు లింగంపల్లి శంకర్, సిరికొండ శ్రీనివాస్, బండ మల్లేశం, వైభవ్, బాలరాజు, కృష్ణస్వామి, సత్తయ్యతో పాటు 28 వార్డుల బిజెపి అభ్యర్థులు, పట్టణ కమిటీ సభ్యులు మరియు భారీ సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

# సీతక్క పారిపోయే రకం కాదు

- **మేడారంలో మంత్రి సీతక్క**



**ములుగు, ఫిబ్రవరి 1(మనంప్రతినిధి):** మనసా వాచా కర్మణా చిత్తశుద్ధితో మా ఆదివాసీల అస్తిత్వం కోసం పరితపించే ఆదివాసి బిడ్డను నేను పారిపోయినట్టు కొన్ని మీడియా సంస్థలు తప్పుడు ప్రచారాలు చేశాయని మేడారంలో మంత్రి సీతక్క తెలిపారు భక్తులు ప్రజల కోసం పంతం నెగ్గించుకునే రకం నేను తను వెల్ల ఆదివాసి అస్తిత్వాన్ని, నిలువెల్లా ఆత్మగౌరవాన్ని, తల్లుల పట్ల భక్తిని కలిగి ఉన్న వ్యక్తిని నేనన్నారు. మేడారం జాతర దిగ్విజయాన్ని జీర్ణించుకోలేక కొందరు చేసే కుట్రలకు భయపడే రకం కాదని, జాతరను విజయవంతం చేసిన విధంగానే జాతర తర్వాత చేపట్టాల్సిన పనులను పూర్తి చేస్తున్నామన్నారు. ఐదువేలకు పైగా పారిశుద్ధ్య సిబ్బంది నియమించి మేడాలన్నీ పరిశుభ్రపరుస్తున్నామన్నారు. రేయింబవళ్లు కష్టపడి పనిచేసిన పోలీస్ సిబ్బందికి అభినందనలు తెలిపారు. విఐపి ల తాకిడి వల్ల ట్రాఫిక్ జామ్ అయిందని, ఆ ట్రాఫిక్ జామ్ లో ఆర్టీసీ బస్సులు చిక్కుకుపోయాయన్నారు. ఘట్టమ దేవాలయం వద్ద ఎలాంటి ట్రాఫిక్ జామ్ లేకుండా చర్యలు తీసుకున్నామని, ఘట్టమ్మ తల్లిని దర్శించుకున్న తర్వాత సమ్మక్కకు రావటం ఆనవాయితీగా వస్తుంది కాబట్టి అక్కడ ఎలాంటి ట్రాఫిక్ జామ్ లేకుండా నివారించ గలిగాము రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఈ దఫా నివారించగలిగాము భక్తితో బాధ్యత తొ సంయమనంతో దైవ దర్శనానికి రండి అని భక్తులకు మేము చేసిన విజ్ఞప్తి పనిచేసింది బ్రహ్మాండంగా జాతరను నిర్వహించుకున్నాము అందరికీ అభినందనలు సమ్మక్క సారలమ్మ తో మాకు భావోద్వేగా బంధం ఉంది అందుకే అన్ని జాగ్రత్తలు చేపట్టాము గుడి నిర్మాణ బాధ్యతలను నెత్తికెత్తుకున్నామని, గుడి నిర్మాణం జాతరకు ముందే పూర్తయిందని, గతంలో జాతరకు ముందు రోజుకు ఒకటి రెండు లక్షల మంది భక్తులే వచ్చేవారు కానీ కొత్త గుడి నిర్మాణం తర్వాత ఒకే రోజు 8 లక్షల మంది వరకు భక్తులు గతంలో తాత్కాలికంగా పనులు జరిగేవి కానీ ఈ దఫా శాశ్వత పద్ధతిలో పనులు పూర్తి చేయడం వల్ల భక్తులు విపరీతంగా తరలివచ్చారు త్రాగునీరు టాయిలెట్స్ ముందస్తుగానే సిద్ధం చేశాము సమ్మక్కను సకాలంలో గద్దెల మీదకు తీసుకురావడంలో పూజారులు సహకరించారు ధన్యవాదాలు కొంతమంది కొత్త పోలీస్ సిబ్బంది పూజారులను గుర్తించకపోవడం వల్ల పొరపాటు జరిగింది ఉద్దేశపూర్వకంగా ఎవరిని ఇబ్బందులకు గురిచేయలేదు క్యాబినెట్ ఒక రోజు ఇక్కడే ఉండి నిర్ణయాలు తీసుకోవటం ఒక చరిత్ర ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాము శుక్రవారం నాడు విఐపి తాకిడి పెరిగింది కొందరు విఐపి లు పదుల సంఖ్యలో 30 నుంచీ 40 వాహనాలను వెంటేసుకొని వచ్చారన్నారు. ట్రాఫిక్ జామున కూడా రాజకీయాలు చేసేందుకు కొందరు ప్రయత్నించారని, భక్తులు సజావుగా దర్శనాలు చేసుకున్నారన్నారు.

# కేంద్రం బడ్జెట్ లో తెలంగాణకు మొండి చెయ్యి



**నర్సంపేట ఫిబ్రవరి 1 (మనం న్యూస్):** తెలంగాణ పై కేంద్ర బడ్జెట్ లో మరోసారి మొండి చేయి చూపింది.. మేము అడిగినవి ఏ ఒక్కటి మాకు ఇవ్వలేదని మంత్రి పొన్నం ప్రభాకర్ మండిపడ్డారు. న ర్సంపేట ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి , డీసీసీ అధ్యక్షులు ఆయుభ్ ,అశోక్ గౌడ్ లతో కలిసి మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రజలందరూ ఈ బడ్జెట్ లో అయిన కేంద్రం వివక్షపూరితంగా కాకుండా క్రమశిక్షణ తో న్యాయబద్ధంగా కేటాయిస్తారని ఆశగా ఎదురు చూసాం.. తెలంగాణ పట్ల కేంద్రం మరోసారి వివక్ష చూపింది.. గత ఏడాది కేంద్రం తెలంగాణ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవరిచినప్పుడు శాసన సభ వేదికగా కేంద్రం ను నిలదీయడం జరిగింది. రాష్ట్రానికి కావలసిన అంశాలపై ముఖ్యమంత్రి మంత్రులు ప్రధాన మంత్రి,కేంద్ర మంత్రులను కలిసి విజ్ఞప్తి చేయడం జరిగింది..తమిళనాడు మాదిరి ఇక్కడ రాష్ట్ర ప్రయోజనాల కోసం ఐక్యంగా ఉద్యమించాలని కోరాం..తెలంగాణ ప్రోగ్రెసివ్ గ్రోత్ ఉన్న రాష్ట్రం.. దేశం లో 29 రాష్ట్రాల్లో తెలంగాణ లో పార్టీలకు అతీతంగా తెలంగాణ అభివృద్ధికి 2047 తో ముందుకు పోతున్నాం..హైదరాబాద్ అన్ని రకాల వాతావరణలకు అనుగుణంగా ఉపాధి అవకాశాలు భూగర్భ వనరులు , ప్రకృతి అంశాలు..ఐటీ రంగం దేశంలోనే నెంబర్ వన్ హైదరాబాద్ విస్తరణ పెరుగుతున్నప్పుడు కోర్ అర్బన్ విస్తరిస్తున్నప్పుడు.. రీజనల్ రింగ్ రోడ్డు అడిగాం.. రింగ్ రోడ్డు కి రీజనల్ రింగ్ రోడ్డు కి మధ్య రోడ్ల అభివృద్ధి అడిగాం మొండి చేయి చూపింది.. మూసి అభివృద్ధికి నిధులు అడిగాం.. ఆంధ్రప్రదేశ్ కి నిధులు అడగడం పట్ల ఎందుకు ఇచ్చారని మేము అడగడం లేదు.. ఆ ప్రభుత్వం మీదనే మోడీ ప్రభుత్వం ఉంది.. మాది చిన్న వయసు గల రాష్ట్రం..గత 10 సంవత్సరాలుగా గత ప్రభుత్వం కేంద్రంతో సయోధ్య లేకుండా మాకు రావాల్సినవి అడగలేకపోయింది..మేము అలా కాదు రాష్ట్ర ప్రయోజనాల కోసం ప్రధాన మంత్రి దృష్టికి తీసుకుపోయినా వివక్ష చూపిస్తున్నారు..ప్రతిపక్ష పార్టీల విమర్శిస్తున్న ప్రధాన మంత్రి ,కేంద్ర మంత్రులను మా ముఖ్యమంత్రి తెలంగాణ ప్రయోజనాల కోసం కలుస్తున్న తెలంగాణ పట్ల వివక్ష చూపిస్తున్నారు..ప్రపంచంలో ప్రతి కార్యక్రమానికి హాజరయ్యే వ్యక్తి కుంభమేళ లాంటి మేడారం జాతర కు ఎందుకు రాలేదు ..తెలంగాణ ప్రజల ఆకాంక్ష తల్లిని చంపి బిడ్డను ఇచ్చారని మమల్ని అవమానించారు..బీజేపీ నేతలు ఎందుకు మాట్లాడలేదు..కేంద్రం తెలంగాణ కి ఇచ్చిన మొండి చేయి పై గతంలో ఉద్యమంలో మాదిరి సకల జనులు అప్రమత్తంగా ఉండాలి.. తెలంగాణ నుండి 8 మంది ఎంపీలు ఉన్నారు.. తెలంగాణ ప్రభుత్వం దేవాలయ అభివృద్ధి కి జాతర కి ప్రత్యేక ఏర్పాట్లు చేసింది.. మేడారం జాతర కి 4 వేల బస్సులు నడిపింది.. ప్రత్యేకంగా బస్సులకు కేటాయించిన రూట్లలో అనేక వాహనాలు వచ్చాయి.. మా ఆర్టీసీ డ్రైవర్లకు ,కండక్టర్లకు సెల్యూట్ చేస్తున్న.. విమర్శలు పట్టించుకోవద్దు..50 వేల బారికేడ్లు వేశాం..నిరంతరం మా సిబ్బంది శ్రమించారు.మా సిబ్బంది నిర్లక్ష్యం వల్ల ఎక్కడ ఇబ్బందులు జరగలేదు.. మా పొరపాటు ఎక్కడ లేదు.. జాతర కోసం నిరంతరం శ్రమించిన మా సిబ్బంది కి అభినందనలు..మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలో 7 మున్సిపాలిటీ లు ఉన్నాయి.. నేను ఈ పార్లమెంట్ కి మున్సిపల్ ఎన్నికలకు సమన్వయకర్త గా ఇక్కడికి వచ్చాను..మహబూబాబాద్ లో ఉన్న 156 స్థానాలు గెలవాలని లక్ష్యంగా పెట్టుకున్నాం .. ఈ మున్సిపాలిటీ లు అన్ని కాంగ్రెస్ పార్టీ శాసనసభ్యులు ప్రాతినిధ్యం వహిస్తున్న స్థానాలు.. ఈ ఏడు మున్సిపాలిటీ లలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేస్తాం..గత 10 సంవత్సరాలుగా ఒక్క డబుల్ బెడ్ రూం ఇళ్లు రాలేదు.. మేము నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశాం..రేషన్ కార్డులు ,సన్న బియ్యం,200 యూనిట్ల ఉచిత విద్యుత్,500 కి గ్యాస్, రైతు భరోసా, రైతు రుణమాఫీ, మహిళలకు వడ్డీలేని రుణాలు అందిస్తున్నాం..నర్సంపేట మున్సిపాలిటీ లో ఇప్పటికే అభ్యర్థుల ఎంపిక కొలిక్కి వచ్చింది..వారికి బిఫారమ్స్ అందించి గ్రౌండ్ లో ప్రచారం నిర్వహిస్తున్నారన్నారు.

# అభివృద్ధికే ఓటేయండి.. కాంగ్రెస్ తోనే అభివృద్ధి

## మంత్రి కొండా సురేఖ



ఖమ్మం, ఫిబ్రవరి 1(మనం న్యూస్): మున్సిపల్ ఎన్నికల్లో అభివృద్ధి కి ఓటేయాలని జ్ కాంగ్రెస్ తోనే అభివృద్ధి జరుగుతుందని రాష్ట్ర అటవీశాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ అధ్యక్షతన జరిగిన విలేఖరుల సమావేశంలో ఖమ్మం పార్లమెంటరీ నియోజకవర్ మున్సిపల్ ఎన్నికల ఇంచార్జి రాష్ట్ర అటవీ పర్యావరణ,దేవాదాయ శాఖామాత్యులు కొండా సురేఖ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గత పాలకులు ప్రజా శ్రేయస్సు మరి చారని, రేషన్ కార్డులు ఇవ్వకుండా, డబుల్ బెడ్ రూంలు తూతూ మంత్రంగా కొనసాగించారని ,కోట్లాది రూపాయలు దండుకోవటమే పరమావధిగా పరిపాలన గావించారని ఎద్దేవా చేశారు. అందుకు ప్రజలు గత ప్రభుత్వానికి బుద్ధి చెప్పి,కాంగ్రెస్ పార్టీ కి అధికారాన్ని కట్టబెట్టారని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి ప్రజా పాలన గావిస్తున్నామని అన్నారు. పేదలకు రేషన్ కార్డులు, ఉచిత బస్ సౌకర్యం ,నిరుపేదలకు, ఉచిత విద్యుత్, రైతు బంధు, రైతు రుణమాఫీ అనేక అభివృద్ధి పనులను చేసి అన్నివర్గాల ప్రజల మన్ననలు పొందామని అందుకు నిదర్శనం మొన్న జరిగిన గ్రామీణ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ మద్దతు దారులను అధిక సంఖ్యలో గెలిపించారని దాని ఫలితంగా ప్రజాపాలన గావిస్తున్న తమ ప్రభుత్వానికి మద్దతుగా భావిస్తున్నామని తెలిపారు. ప్రజా ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో అనేక అభివృద్ధి పనులను చేస్తున్నామని,అదేవిధంగా మునిపాలిటీలలోని ప్రజలు మున్సిపాలిటీల అభివృద్ధి జరగాలనే దిశగా పయనించాలని ప్రజా మద్దతుతో మున్సిపాలిటీలను మరింత అభివృద్ధి చేస్తామని అన్నారు, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. మున్సిపల్ వార్డ్ కౌన్సిలర్లగా ఒకరి కంటే ఎక్కువ ఉన్న దగ్గర శాసనసభ సభ్యులు,సీనియర్ కాంగ్రెస్ నాయకులు, ముఖ్య నాయకులు,కార్యకర్తలు అందరూ కలిసి గెలిచే అభ్యర్థులను ఎన్నుకోవాలని దిశా నిర్దేశం చేశారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి తెలంగాణ రాష్ట్ర పార్టీ ఇంచార్జి మీనాక్షి నటరాజన్, టి పి సి సి అద్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ , ఏ ఐ సి సి సెక్రటరీలు, మంత్రివర్గ సభ్యుల సూచనల మేరకు అభ్యర్థుల ఎంపిక సజావుగా జరుగుతుందని,ఎక్కడైనా పొరపొచ్చాలు ఉంటే నాయకుల మధ్య సమన్వయం చేస్తామని, అదే విధంగా అధినాయకత్వానికి వివరిస్తామని అన్నారు.

పాత్రికేయులు అందరు గత ప్రభుత్వానికి, ప్రజా పాలన గావిస్తున్న ప్రజా ప్రభుత్వానికి మద్దతుగా ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీరితో పాటు నగర కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు దీపక్ చౌదరి, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా ఆర్ టి ఏ మెంబర్ గజ్జెల్లి వెంకన్న,జిల్లా అనుబంధ సంఘ అధ్యక్షులు కొత్తా సీతారాములు దొబ్బల సౌజన్య వేజెండ్ల సాయి కుమార్, సయ్యద్ గౌస్, బొడ్డు బొందయ్య, మొక్క శేఖర్ గౌడ్,జెర్రిపోతుల అంజనీ కుమార్, ముళ్ళపాటి సీతారాములు, రంగా జనార్ధన్, ఏలూరి రవికుమార్, గజ్జి సూర్యనారాయణ, బచ్చలకూరి నాగరాజు, బెజ్జం గంగాధర్ ,కిరణ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

## కేంద్ర బడ్జెట్ తో ఖమ్మం జిల్లాకు నిష్ప్రయోజనం

- ప్రత్యేక కేటాయింపులు ఏమీ లేవు
- ఎప్పటినుంచో ఉన్న డిమాండ్లను పట్టించుకోలేదు
- సీపీఐ (ఎం) ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు



ఖమ్మం, ఫిబ్రవరి 1(మనం న్యూస్): 'వికసిత్ భారత్' లక్ష్యంతో రూ. 53.5 లక్షల కోట్లతో 2026-27 సంవత్సరానికి ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెపై సీపీఐ(ఎం) ఖమ్మం జిల్లా కమిటీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ బడ్జెట్ ప్రజా వ్యతిరేకమైనదని, కార్పొరేట్ శక్తులకు మేలు చేసేలా ఉందని విమర్శించింది. బడ్జెట్లో జిల్లాకు ఎటువంటి కేటాయింపులు లేవని జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు ఆరోపించారు. బయ్యారం ఉక్కు పరిశ్రమ, జిల్లా కేంద్రంలో యూనివర్శిటీ, నవోదయ స్కూల్స్ వంటి అంశాలను విస్మరించారని మండిపడ్డారు. వ్యవసాయ రంగానికి నిధులు కొంత పెంచినా, ఎరువుల సబ్సిడీలో కోత విధించడం రైతులపై భారం మోపుతుందని పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఏ) నిధుల తగ్గింపును తప్పుబట్టారు. ఉపాధిహామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే చర్యలో భాగంగానే నిధులు తగ్గించాలని ఆరోపించారు. సామాన్యుల అవసరాలను పక్కనపెట్టి, బడా కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల కోసమే ఈ బడ్జెట్ను రూపొందించారని విమర్శించారు. నిధుల కేటాయింపులు ఏమాత్రం ఆశాజనకంగా లేవని తెలిపారు. వ్యవసాయ రంగాన్ని ప్రోత్సహించే చర్యలు ఏమీ బడ్జెట్లో కనిపించలేదని పేర్కొన్నారు. కనీసం పంటలకు గిట్టుబాటు ధరల కల్పనలో స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను పరిగణలోకి తీసుకోలేదని అన్నారు. ఖమ్మంలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు సాధ్యాసాధ్యాలపై మెకాన్ ద్వారా అధ్యయనం చేయించాలని డిమాండ్ ఉన్నా బడ్జెట్లో దాని ఊసు లేదు. వ్యవసాయానికి మొత్తం రూ.1.27 లక్షల కోట్లు కేటాయించారని, గత బడ్జెట్ తో పోలిస్తే ఏడు శాతం అధికంగా నిధులు కేటాయించినట్లు చెబుతున్నా... అంకెల్లో తప్ప ఆచరణలో అవి కనిపించే పరిస్థితి లేదని తెలిపారు. ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి కింద రైతులకు ఆర్థిక సాయం అందించేందుకు రూ.63,500 కోట్లు కేటాయించారు. కానీ ఈ పథకం కింద ఇచ్చే పంట పెట్టుబడి సహాయాన్ని ఏడాదికి మూడు విడుదలగా రూ. 6000 యథాతథంగా ఉంచారు. రైతులకు సరసమైన ధరకు ఎరువులు అందించేందుకు సుమారు రూ.1.71 లక్షల కోట్లను ఎరువుల సబ్సిడీగా ప్రకటించినా యూరియా కొరతను అధిగమించేందుకు తీసుకునే చర్యలపై స్పష్టత లేదు. సామాన్య ప్రజల కష్టాలను పట్టించుకోలేదని, సంక్షేమ కోతలు విధించారని పేర్కొన్నారు. ఆహార భద్రత, ఆరోగ్యం, విద్య, గృహనిర్మాణం వంటి కీలక రంగాలకు కేటాయింపులను తగ్గించారని ఆరోపించారు. పెరుగుతున్న నిరుద్యోగాన్ని తగ్గించడానికి, సామాన్యుల కొనుగోలు శక్తిని పెంచడానికి ఎటువంటి స్పష్టమైన చర్యలు తీసుకోలేదని నున్నా నాగేశ్వరరావు వివరించారు.

## బడ్జెట్‌తో మరింత సంక్షోభంలోకి సాగు

- సిపిఐ నేత బాగం



ఖమ్మం, ఫిబ్రవరి 1(మనం న్యూస్): కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఆదివారం ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్లో సామాన్యులను పూర్తిగా విస్మరించారని సంపన్న వర్గాలకు ఊతమిచ్చేవిధంగా కేటాయింపులు ఉన్నాయని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. ఈ దేశంలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలకు ఈ బడ్జెట్లో ఎక్కడ పరిష్కారం చూపే ప్రయత్నం చేయలేదని ఆయన తెలిపారు. భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఈ బడ్జెట్ పట్ల తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తుందని మోడీ ప్రభుత్వం కార్పొరేట్, సంపన్న వర్గాలకు అనుకూలమని ఈ బడ్జెట్తో మరోసారి తేటతెల్లమైందన్నారు. భారతదేశంలో అత్యంత ప్రమాదకర స్థాయికి నిరుద్యోగ సమస్య చేరుకుందని దేశ జనాభాలో సగానికి పైగా ఉన్న యువత నిరుద్యోగంతో ఇబ్బందులు పడుతుందని ఉద్యోగ, ఉపాధి కల్పన రంగాలను ఎక్కడ ఈ బడ్జెట్లో ప్రస్థావించలేదని హేమంతరావు తెలిపారు. వాస్తవానికి దూరంగా బడ్జెట్లో అంకెల గారడీ చేశారు తప్ప మరోకటి లేదన్నారు. -మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి ప్రజల గురించి ఈ బడ్జెట్లో ఎక్కడ ప్రస్థావన లేదన్నారు. ముఖ్యంగా గ్రామీణ పేదలకు సంబంధించి జాతీయ ఉపాధి హామీ పథకం పేరును విబి జి రామ్ జీగా మార్చి పూర్తిగా తొలగించే ప్రయత్నాన్ని చేస్తుందని హేమంతరావు తెలిపారు. కేటాయింపులు చేసినప్పటికీ రాష్ట్రాలు 40 శాతం భరించాలని చెప్పటం ద్వారా ఈ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం నీరుగారుస్తుందన్నారు. విద్య, వైద్య రంగాలను పూర్తిగా విస్మరించిందని విద్య, వైద్యం లేని భారతదేశం ఎలా పురోగమిస్తుందని ఆయన ప్రశ్నించారు. ఈ దేశంలో ఇప్పటికీ మెజార్టీ ప్రజలు ఆధారపడిన వ్యవసాయ రంగాన్ని పూర్తిగా విస్మరించారని కేటాయింపులు సరైన రీతిలో లేవని ఆయన తెలిపారు. బడ్జెట్ లెక్కల ప్రకారం రసాయనిక ఎరువుల ధరలు పెరగడంతో పాటు దిగుమతుల కారణంగా వ్యవసాయ ఉత్పత్తుల ధరలు గణనీయంగా పడిపోయే -అవకాశం ఉందని హేమంతరావు తెలిపారు. బడ్జెట్లో అంకెల గారడీ చేసి రూ.53 లక్షల కోట్లు చూపారు తప్ప ఆదాయ మార్గాలను చూపడంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. కేవలం అప్పుల వసూళ్లు, ద్రవ్య లోటు బడ్జెపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. వ్యవసాయ రంగం సంక్షోభంలోకి కూరుకుపోతే దేశ ఆర్థిక పరిస్థితి మరింత ఇబ్బందికర -పరిస్థితులు ఎదుర్కొంటుం దన్నారు. తెలంగాణ పట్ల కేంద్ర మంత్రి మరోసారి వివక్షను ప్రదర్శించారని ఆంధ్రప్రదేశ్తో పోల్చినప్పు డు కనీస కేటాయింపులు కూడా జరపలేదని ఆయన తెలిపారు. కార్పొరేట్, సంపన్న వర్గాలకు అనుకూల బడ్జెట్ తప్ప ఈ బడ్జెట్తో సామాన్యులకు ఒరిగేది ఏమి లేదని ఆయన తెలిపారు.

## కూరపాటి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభించిన మంత్రి తుమ్మల



ఖమ్మం, ఫిబ్రవరి 1(మనం న్యూస్): ఖమ్మంలో నూతనంగా ఏర్పాటు చేసిన కూరపాటి మల్టీ స్పెషాలిటీ అండ్ చిల్డ్రన్ హాస్పిటల్ ను ఆదివారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూరపాటి ప్రదీప్ కుమార్ వైద్య రంగంలో అందిస్తున్న సేవలు అందరికీ ఆదర్శప్రాయమన్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్యం అందుబాటు ధరలో అందిస్తున్న ఘనత కూరపాటికే దక్కుతుందన్నారు. కూరపాటి చిల్డ్రన్ హాస్పిటల్ పేరుతో జిల్లా ప్రజలందరికీ సుపరిచితమైన ప్రదీప్, వైద్యరంగమే కాకుండా, క్రీడలు, సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుండటం అభినందనీయమన్నారు. తలసీమియా పిల్లలకు ఉచిత వైద్యంతోపాటు, రక్తం అందించడం ద్వారా వారి జీవితాల్లో వెలుగులు నింపుతున్నారని కొనియాడారు. ప్రదీప్ కుమార్ తండ్రి కూరపాటి వెంకటేశ్వర్లు తనకు ఎంతో కాలం నుండి సుపరిచితులని, రాజకీయాల్లోనూ, వ్యాపార రంగంలోనూ రాణిస్తూ తనదైన ముద్ర వేశారని అన్నారు. అలాంటి కుటుంబం నుండి వచ్చిన డాక్టర్ ప్రదీప్ కుమార్ ఖమ్మం జిల్లాలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానం సంపాదించుకోవడం అభినందనీయమని కొనియాడారు. ఈ హాస్పిటల్ ద్వారా జిల్లా ప్రజలకు మరిన్ని వైద్య సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఖమ్మం కార్పొరేషన్ మేయర్ పునుకొల్లు నీరజ, సిపిఎం ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై విక్రమ్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు తుమ్మల యుగంధర్, కార్పొరేటర్లు కమర్తపు మురళి, మిక్కిలి నేని నరేందర్, కాంగ్రెస్ నాయకులు ముక్తార్, ఖమ్మం కాంగ్రెస్ అధ్యక్షుడు నాగండ్ల దీపక్ చౌదరి, చింతనిప్పు కృష్ణచైతన్య, ప్రముఖ వైద్యులు పాల్గొన్నారు.

## బిఆర్ ఎస్ ధర్నాలో ఉద్రిక్తత



- వన్ టౌన్ సీఐ కి గాయాలు

ఖమ్మం, ఫిబ్రవరి 1(మనం న్యూస్): తెలంగాణా మాజీ ముఖ్యమంత్రి కేసిఆర్ కు సిట్ నోటీసులు ఇవ్వడాన్ని నిరసిస్తూ ఖమ్మం నగరం లోని ఇల్లందు క్రాస్ వద్ద రోడ్డుపై మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ బైటయించారు. ఈ క్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం చేయడానికి బి.ఆర్.యస్ కార్యకర్తలు ప్రయత్నించిన సమయంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకున్నాయి . దీంతో పోలీసులకు నాయకులకు మధ్య తీవ్ర స్థాయిలో వాగ్వాదం తోపులాట జరిగింది. ఆ క్రమంలో రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం ఆపేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్న సమయంలో ఒకసారిగా దిష్టిబొమ్మపై పెట్రోల్ పోయడంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. కిందపడ్డ వన్ టౌన్ సీఐ కరుణాకర్ తో పాటు టూ టౌన్ సిఐ బాలకృష్ణకు మంటలు అంటుకోవడంతో కరుణాకర్ కు మేజర్ గాయాలు అయ్యాయి. హుటాహుటీనా ఒక ప్రయివేట్ హాస్పిటల్ కు తరలించగా చేతి మణికట్టు విరిగినట్లు డాక్టర్లు నిర్ధారించారు. గతంలో కూడా వన్ టౌన్ సి ఐ కరుణాకర్ ను టార్గెట్ చేసి మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ కీలక వ్యాఖ్యలు చేసినట్లు పోలీసులు చెప్తున్న నేపథ్యంలో నేటి బి ఆర్ ఎస్ నిరసన కార్యక్రమంలో ఉద్దేశ్య పూర్వకంగానే వన్ టౌన్ సిఐ పై దాడి చేసినట్లుగా పోలీసులు అనుమానిస్తున్నారు. కేవలం నిరసన ర్యాలీ కి మాత్రమే అనుమతి ఉన్నప్పటికీ ధర్నా చేయడం,సి ఎం దిష్టిబొమ్మ దగ్ధం చేయడంతో పాటు పెట్రోల్ పోసి నిప్పంటించనందుకు, పోలీసుల విధులకు ఆటంకం కలిగించినందుకు బి.ఆర్.ఎస్ నేతలపై పలు సెక్షన్ ల క్రింద టూ టౌన్ పోలీస్ స్టేషన్లో కేసులు నమోదు చేసే అవకాశం ఉన్నట్లు పోలీసులు పేర్కొంటున్నారు..

## సీట్ విచారణ వ్యతిరేకిస్తూ బిఆర్ఎస్ శ్రేణుల నిరసన



దమ్మపేట, ఫిబ్రవరి 1(మనం న్యూస్): తెలంగాణ జాతిపిత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్,కి.ఫోన్ ట్యాపింగ్ అక్రమ కేసులో సిట్ విచారణను వ్యతిరేకిస్తూ బిఆర్ఎస్ శ్రేణులు నల్ల బ్యాడ్జిలు ధరించి భారీ బైక్ ర్యాలీ సీఎం రేవంత్ రెడ్డి డౌన్ డౌన్ నినాదాలతో దద్దరిల్లిన దమ్మపేట బైక్ ర్యాలీతో గులాబీమాయమైన దమ్మపేట మండల కేంద్రం తెలంగాణ జాతి పిత,కోట్లాది మంది ప్రజల ఆరాధ్యుడు కేసీఆర్,పై రేవంత్ రెడ్డి ప్రభుత్వం రాజకీయ కక్షతో సాగిస్తున్న కుతంత్రాలను నిరసిస్తూ దమ్మపేట నుంచి మందలపల్లి వరకు బిఆర్ఎస్ మండల అధ్యక్షులు దొడ్డా రమేష్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు నల్ల బ్యాడ్జీలు ధరించి భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు.ఈకార్యక్రమంలో అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే,బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ మెచ్చా నాగేశ్వరరావు,మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ తీరును తీవ్రంగా ఖండించారు.తెలంగాణ కోసం పోరాడిన నాయకుడిపై అక్రమంగా వ్యవహరిస్తే సహించేది లేదని హెచ్చరించారు. మున్సిపాలిటీ ఎన్నికల్లో ప్రజలు హామీల గురించి అడుగుతున్న నేపథ్యంలో వారందరిని డైవర్ట్ చేయడం కోసమే కెసిఆర్,కెటిఆర్,హరీష్ రావు,ని బద్నాం చేస్తున్నారని, కక్ష పూరిత రాజకీయాలు మానుకొని ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలని, కెసిఆర్,జోలికి వస్తే చూస్తూ ఊరుకోమని కాంగ్రెస్ ప్రభుత్వన్ని హెచ్చరించారు.ఈర్యాలీలో వైస్ ఎంపీపీ దారా మల్లిఖార్జునరావు,మాజీ సొసైటీ చైర్మన్ రావు జోగేశ్వరావు,నియోజకవర్గ నాయకులు సోయ్యం విరభద్రం,మండల ఉపాధ్యక్షుడు గాజుబోయిన యేసు బాబు,యువజన విభాగ నియోజకవర్గ అధ్యక్షులు యార్లగడ్డ శ్రీనివాసరావు, నాయకపోడు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు రావుల శ్రీనివాసరావు,సర్పంచ్ లు కొమరం సుశీల,యట్ల రామదాసు, ఊప సర్పంచ్ రామకృష్ణ,మహేష్,మాజీ ఎంపీటీసీ కాసిని శ్రీను,మండల నాయకులు జలగం వాసుగారు,తుమ్మల లక్ష్మనరావు,సోయం రాజబాబు,అబ్దుల్ జిన్న,పాస్యం ప్రసాద్,సోడెం గంగరాజు, కృష్ణ,కోర్స వెంకటేశ్వరావు,మాజీ సర్పంచ్ ఉయ్యాల చిన వెంకటేశ్వరావు, నారాం రాజు,ఎస్ సి సెల్ నాయకులు మద్దెల పుల్లారావు,కార్మిక సంఘం నాయకులు గాజుబోయిన శ్రీనివాసరావు (ఆటో )కొలికపోగు ధర్మ,వార్డు సభ్యులు ఉయ్యాల లక్ష్మీనారాయణ, దారా రాము,రూప రాంబాబు,బండి ప్రసాద్, నాగయ్య,కాకా ప్రసాద్,శేషాద్రి, ముత్తు,సున్నం నరేంద్ర,వల్లెపు నాగేశ్వారావు,మడిపల్లి పోలయ్య, తోగర్త వెంకటేశ్వరావు,పిట్టల లాలు, తదితరులు పాల్గొన్నారు.

## విద్య జీవితాన్ని మార్చే ఆయుధం



- జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్

భద్రాద్రి కొత్తగూడెం, ఫిబ్రవరి 01 (మనంప్రతినిధి): విద్య జీవితాన్ని మార్చే ఆయుధం అని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. ఆదివారం జిల్లాలో షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న 16 షెడ్యూల్ కులాల వసతి గృహాలలో 10వ తరగతి చదువుతున్న 212 మంది విద్యార్థినీ విద్యార్థులకు ప్రేరణ, శిక్షణ తరగతులను కొత్తగూడెం క్లబ్లో ఏర్పాటు చేయడం జరిగింది. విద్యార్థులలో ఆత్మవిశ్వాసం పెంపొందించి, పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ముందుగా జ్యోతి ప్రజ్వలన గావించి, భారత రాజ్యాంగ శిల్పి డా. బి.ఆర్. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల అలంకరణ గావించి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, విద్య అనేది జీవితాన్ని మార్చే ప్రధాన ఆయుధమని, విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయిలో స్థిరపడాలని సూచించారు. 10వ తరగతిలో వచ్చే మార్కులు మాత్రమే జీవిత విజయానికి కొలమానం కాదని, నిర్దేశించుకున్న లక్ష్యాన్ని సాధించి సమాజంలో స్థిరపడినప్పుడే నిజమైన విజయాన్ని పొందినట్లు అవుతుందని తెలిపారు.విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణ, సమయపాలన, పట్టుదల వంటి విలువలను అలవర్చుకోవాలని సూచించారు. ప్రభుత్వము ఎస్సీ విద్యార్థుల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకొని ముందుకు సాగాలని తెలిపారు. విద్యార్థులు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, వార్డెన్ల సూచనలను పాటిస్తూ నిరంతర కృషితో ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు.ఈ ప్రేరణ, శిక్షణ తరగతుల ద్వారా విద్యార్థుల్లో చదువుపై ఆసక్తి పెరిగి, మెరుగైన విద్యా ఫలితాలు సాధించేందుకు దోహదపడుతాయని కలెక్టర్ తెలిపారు. అనంతరం సబ్జెక్టు నిపుణులు విద్యార్థులకు 10వ తరగతి పరీక్షలకు సంబంధించిన ముఖ్యమైన బోధన అంశాలపై శిక్షణ అందించారు. ప్రతి సబ్జెక్టులో ముఖ్యమైన అధ్యాయాలు, ప్రశ్నల రూపకల్పన, సమయ నిర్వహణ, పరీక్షలలో మార్కులు ఎలా సాధించాలి అనే అంశాలపై వివరంగా బోధించారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తూ, పరీక్షలపై ఉన్న భయాన్ని తొలగించే విధంగా మార్గదర్శనం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారి ఎ. శ్రీలత, సహాయ సంక్షేమ అధికారులు కొప్పుల హనుమంతరావు, సిహెచ్. అక్షయ్, జిల్లాలోని వసతి గృహ సంక్షేమ అధికారులు, కార్యాలయ సిబ్బంది ఆర్.వి.ఆర్. ప్రసాద్, నరసింహారావు, సాయి చరణ్, నాగలక్ష్మి మరియు బోధన సిబ్బంది తారాచంద్, మోహన్ రావు, దస్తగిరి, బి.వి.ఎల్. కుమార్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

## నిరాశ నిస్పృహలకు గురి చేసిన బడ్జెట్ : నూతి సత్యనారాయణ గౌడ్



ఖమ్మం, ఫిబ్రవరి 1(మనం బ్యూరో): కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఆదివారం ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్లో సామాన్యులను పూర్తిగా విస్మరించారని సంపన్న వర్గాలకు ఊతమిచ్చేవిధంగా కేటాయింపులు ఉన్నాయని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ తెలిపారు. ఈ దేశంలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలకు ఈ బడ్జెట్లో ఎక్కడ పరిష్కారం చూపే ప్రయత్నం చేయలేదని ఆయన తెలిపారు. ఈ బడ్జెట్ పట్ల తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తుందని మోడీ ప్రభుత్వం కార్పోరేట్, సంపన్న వర్గాలకు అనుకూలమని ఈ బడ్జెట్తో మరోసారి తేటతెల్లమైందన్నారు. ముఖ్యంగా గ్రామీణ పేదలకు సంబంధించి జాతీయ ఉపాధి హామీ పథకం పేరును విబి జి రామ్ జీ గా మార్చి పూర్తిగా తొలగించే ప్రయత్నాన్ని చేస్తుందని నూతి తెలిపారు. కేటాయింపులు చేసినప్పటికీ రాష్ట్రాలు 40 శాతం భరించాలని చెప్పటం ద్వారా ఈ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం నీరుగారుస్తుందన్నారు. తెలంగాణ పట్ల కేంద్ర మంత్రి మరోసారి వివక్షను ప్రదర్శించారని ఆంధ్రప్రదేశ్ తో పోల్చినప్పుడు కనీస కేటాయింపులు కూడా జరపలేదని ఆయన తెలిపారు. కార్పోరేట్, సంపన్న వర్గాలకు అనుకూల బడ్జెట్ తప్ప ఈ బడ్జెట్తో సామాన్యులకు ఒరిగేది ఏమి లేదని ఆయన తెలిపారు.

# ఐవిఎఫ్ రాష్ట్ర అధ్యక్షునిగా కోనా శ్రీనివాస్

- 15లక్షల విలువైన సేవా కార్యక్రమాలు అందించిన కోనా కుటుంబ సభ్యులు



**తాడేపల్లిగూడెం ఫిబ్రవరి 1 మనం న్యూస్:** ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షునిగా డాక్టర్. కోనా శ్రీనివాసరావు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ ప్రమాణస్వీకారం మహోత్సవానికి రాష్ట్ర నలుమూలల నుండి సుమారు 4000 మంది ఆర్య వైశ్య ప్రముఖులు నాయకులు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్, తెలంగాణ రాష్ట్ర ఐవీఎఫ్ అధ్యక్షులు ఉప్పల శ్రీనివాసగుప్త, మహారాష్ట్రకు చెందిన ఐవిఎఫ్ వ్యవస్థాపక కుటుంబ సభ్యులు రమేష్ అగ్రవాల్ మాజీ శాసనసభ్యులు, చలనచిత్రం నిర్మాత అంబికా కృష్ణ, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాకేష్ హాజరయ్యారు. ముందుగా సుమారు వాసవి మాత దేవాలయంలో పూజలు చేసిన అతిథులు 100 కారుల ర్యాలీతో వాసవి మాత ఆలయం నుండి ప్రమాణ స్వీకార వేదిక కమ్మ కళ్యాణ మండపానికి బాణాసంచా నడుమ, ప్రత్యేక పాటలతో పూలవర్షం కురుస్తూ ఉండగా కళ్యాణ మండపానికి హాజరయ్యారు. ఉప్పల శ్రీనివాస గుప్తా పర్యవేక్షణలో డాక్టర్ కోనా శ్రీనివాసరావు రాష్ట్ర అధ్యక్షులుగా ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం మహిళా విభాగం, యువజన భాగం, సేవా కార్యక్రమాలకు సంబంధించిన వివిధ కమిటీలు, రాష్ట్ర కమిటీలు జిల్లా కమిటీలు ప్రమాణ స్వీకారాలు చేశారు. ముఖ్యఅతిథి టీజీ వెంకటేష్ మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు, కొణిజేటి రోశయ్య వంటి మహనీయులు రాష్ట్రం కోసం అశులు బాసితే వారిని సామాజిక వర్గాలకు అంటకట్టడం మంచిది కాదని హితవు పలికారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేస్తున్న సేవా కార్యక్రమాలలో ఆర్యవైశ్యులకే ఎవరైనా అర్హులై సేవా కార్యక్రమాలు అందకపోతే వారికి ఐవీఎఫ్ ద్వారా తప్పకుండా సహాయ సహకారాలు అందిస్తామని తెలియజేశారు. వివిధ రకాల వైశ్య సంఘాలు ఉన్నప్పటికిని అవన్నీ సమాజ శ్రేయస్సు కోసం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయని తెలియజేశారు. పలు సందర్భాలలో ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యల ఫలితంగా వ్యాపారాల్లో అధికంగా ఉండే వైశ్యులు ఇబ్బంది పడుతున్నారని తెలియజేశారు. కోనా శ్రీనివాసరావు రానున్న మూడు సంవత్సరాల కాలంలో కోటి రూపాయల విలువైన సేవా కార్యక్రమాలు నిర్వహించడానికి ముందుకు రావడం గర్వించదగ్గ విషయమని సింహం ఎక్కడున్నా సరే సింహం గానే బతుకుతుంది. పదవి, అధికారం లేకపోయినా అదే స్థితిలో పనిచేసే వ్యక్తి కోనా శ్రీనివాస అని కొనియాడారు. తెలంగాణ ఐ వి ఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఉప్పల శ్రీనివాస గుప్తా మాట్లాడుతూ సేవ చేయాలనే దృక్పథం ఉన్న ప్రతి ఒక్కరూ తన జీవిత సంపాదనలో ఎంతో కొంత సేవా కార్యక్రమాలకు వినియోగించాలని కులమతాలకు అతీతంగా వ్యవహరించాలని సూచించారు. అంబికా కృష్ణ మాట్లాడుతూ సేవా కార్యక్రమానికి మారుపేరు కోనా శ్రీనివాస్ అని తెలియజేశారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాకేష్ మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ప్రభుత్వం పేదల కోసం ఆర్యవైశ్యుల కోసం అనేక సేవా కార్యక్రమాలు అందిస్తుందని, పొట్టి శ్రీరాములు విగ్రహ ఏర్పాటుకు తగిన ఏర్పాటు చేస్తుందని, పెనుగొండ గ్రామాన్ని వాసవి పెనుగొండ గా మార్చి మండల కేంద్రంగా ఘనత చంద్రబాబుకు దక్కుతుందని గ్రామీణ ప్రాంతాల్లో ఆర్యవైశ్యుల అభివృద్ధికి దోహదపడే అంశాలతో ముందుకు సాగుతామని తెలియజేశారు.

**కోన శ్రీనివాస్ అనే నేను**

ఐవిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా డాక్టర్ కోన శ్రీనివాస్ భావోద్వేగంగా మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా ఐవిఎఫ్ సంస్థను మరింత బలోపేతం చేసి ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అహర్నిశలు కృషి చేస్తామని తెలిపారు. ఆర్యవైశ్యుల సంక్షేమం తన బాధ్యతగా భావిస్తూ, వారికి అన్ని విధాలా అండగా నిలుస్తానని స్పష్టం చేశారు. ఆంధ్ర ప్రదేశ్ అన్ని జిల్లాల్లో మాత్మ గాంధీ, పొట్టి శ్రీరాములు మాజీ సీఎం రోశయ్య 300 విగ్రహాలు ఆయన సొంత ఖర్చుతో ఇస్తానని తెలిపారు. తన పుట్టినరోజు సందర్భంగా పేదలకు సేవ చేయడం జీవితంలో లభించిన గొప్ప అవకాశంగా భావిస్తున్నానని చెప్పిన డాక్టర్ కోన, సమాజ సేవే నిజమైన పండుగ అని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు 20 ల్యాప్టాప్లు, పేద మహిళలకు 30 కుట్టు మిషన్లు, 100 గ్రైండర్లు అందజేయడంతో పాటు ఉచిత వైద్య సేవలు, మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు భవిష్యత్తు లోనూ కొనసాగిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

**ప్రత్యక్ష రాజకీయాలకు రాను**

సేవ చేయాలనే దృక్పథం ఉంది. అందుకు రాజకీయాల్లో ఉండవలసిన అవసరం ఆవశ్యకత లేదని, కోవిడ్ లో ఎన్నో సేవా కార్యక్రమాలు చేశానని లక్షలాది మందికి కోవిడ్ మందు తయారు చేయించి తెప్పించి ఇచ్చినట్లు గుర్తు చేశారు. అధికారం ఉంటే అది మరి కొంత సహాయంగా ఉంటుంది గానీ అధికారం కోసం రాజకీయాల్లోకి రానని నామినేటెడ్ గా ఏ రాజ్యసభకు ఇచ్చిన తను వెళ్లడానికి సుముఖంగా ఉన్నానని తన మనోభావాన్ని తెలియజేశారు.

## ఉచిత వైద్య శిబిరాలు పేదల పాలిట వరం



- ఎంఏ షరీఫ్, పొత్తూరి రామరాజు

**నరసాపురం, ఫిబ్రవరి 1 (మనం న్యూస్):** ఆరోగ్య వర్షిణి స్వచ్ఛంద సంస్థ అందిస్తున్న సేవలు అభినందనీయమని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు ఎంఏ షరీఫ్, తెదేపా ఇంచార్జి పొత్తూరి రామరాజు అన్నారు. మొగల్తూరు మండలం ముత్యాలపల్లి గ్రామం జెడ్పీ స్కూల్లో ఆరోగ్య వర్షిణి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య, రక్తదాన శిబిరాలను వారు ప్రారంభించి మాట్లాడారు. ఉచిత వైద్య శిబిరాలు పేదలపాలిట వరంగా నిలుస్తాయని ప్రతి ఒక్కరూ సేవా భావంతో ఉండాలని అన్నారు. రక్తదానం వల్ల ఆపదలో ఉన్నవారి ప్రాణాలు కాపాడవచ్చునని ఆరోగ్య వర్షిణి ట్రస్ట్ చైర్మన్ నాగిడి రాంబాబు గత కొన్నేళ్లుగా అందిస్తున్న నిస్వార్థ సేవలను కొనియాడారు. 77 వ సారి రక్తదానం చేసిన ఆదరణ ట్రస్ట్ చైర్మన్ కృష్ణ భగవాన్ ను అభినందించారు. వైద్యులు బర్రె నాయకర్, పీ చంద్రశేఖర్ వర్మ, కొమ్మూరి రామకృష్ణ, దీప్తి మాధురి, పీవీ మహాలక్ష్మి, భరత్ , యం రామకృష్ణ, బి విక్రమ్, పీ రాణిచంద్ర, టి నరసింహరాజు గుండె, ఊపిరి తిత్తులు, వేరికోస్ వేయిన్స్, చెవి, ముక్కు, గొంతు, స్త్రీ సమస్యలు తదితర రోగాలకు వైద్య పరీక్షలు చేసి అవసరమైన రోగులకు ఈసీజీ, 2 డి ఏకో , బీపీ, షుగర్ పరీక్షలతో పాటు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. నరసాపురం వరలక్ష్మీ హాస్పటల్, టివిన్నార్ ఫిజియో థెరపీ, భీమవరం తేజ హాస్పటల్, విష్ణు దంత వైద్యశాల, మీనాక్షి కంటి ఆసుపత్రి, ఏఎస్ఎన్ బ్లడ్ బ్యాంకు సంస్థలకు నాగిడి రాంబాబు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర మత్స్యకారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ కొల్లు పెద్దిరాజు, ఏఎంసీ చైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ, కొప్పాడ రవీంద్రనాథ్ ఠాగూర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉమ్మెంత్యాలలో వ్యక్తి హత్య



- దాయాధులే దాడి చేసి చంపారనీ ఆరోపణ
- ఉమ్మెంత్యాల గ్రామంలో ఘటన

**షాద్ నగర్, ఫిబ్రవరి 1 (మనం న్యూస్):** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం కొందుర్గు మండలం ఉమ్మెంత్యాల గ్రామంలో దారుణం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కల్లాపురం నరసింహులు (43) ను అతని దాయదులు వ్యక్తిగత కక్షలతో కొట్టి చంపినట్లు స్థానికులు తెలిపారు. ఇరువర్గాల మధ్య ఉన్న మనస్పర్థలను ఆసరా చేసుకుని నరసింహులును ఆదివారం అదే గ్రామానికి చెందిన కల్లాపురం యాదయ్య కల్లాపురం మంజుల కల్లాపురం జంగమ్మ కల్లాపురం నరసింహులు ఈ దారుణానికి పాల్పడినట్లు గ్రామస్తులు పేర్కొంటున్నారు.. పోలీసులు కేసు దర్యాప్తు జరుపుతున్నారు

## వైసిపి ప్రభుత్వ ఐదేళ్ల పాలన విధ్వంసమే

- దొడ్డిపట్ల గ్రామంలో 60 లక్షలతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి



**పాలకొల్లు, ఫిబ్రవరి 1,మనం ప్రతి నిధి :** రాష్ట్రంలో గత వైసిపి ప్రభుత్వ పాలన కోట్లాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన ప్రజా వేదిక విధ్వంసంతో ప్రారంభమై ఐదేళ్లు సాగిందని,నేడు కూటమి ప్రభుత్వ 20 నెలల పాలనా అభివృద్ధి సంక్షేమం దిశగా పయనిస్తుందని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. యలమంచిలి మండలం దొడ్డిపట్ల గ్రామంలో 60 లక్షలతో పలు అభివృద్ధి పనులకు కూటమి నాయకులతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడుకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. గ్రామంలో రూ 7 లక్షల తో తాడిమెరకలో డ్రైన్ నిర్మాణ పనులకు, మరో 5 లక్షలతో విజయసారధి కాలని లో కల్వర్ట్ నిర్మాణ పనులకు, 15 లక్షలతో గుబ్బల తాతయ్య నగర్ సిసి రోడ్ మరియు డ్రైన్ నిర్మాణ పనులకు, 30 లక్షలతో స్మశాన వాటిక అభివృద్ధి పనులకు శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో జగన్కు 151 సీట్లు ఇచ్చి అధికారిమిస్తే రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమాన్ని పట్టించుకోలేదని అందువల్లన వైసీపీకి 11 సీట్లతో ప్రతిపక్ష హోదా కూడా లేకుండా ప్రజల సంచలమైన తీర్పునిచ్చారన్నారు.అధికారం కోల్పోయిన హింసన వదల్లేదని అంబటి రాంబాబు బూతుల పురాణమే అందుకు నిదర్శనం అన్నారు. ఇటువంటి పార్టీ పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, పని చేసే కూటమి ప్రభుత్వాన్ని ప్రభుత్వాన్ని మరో పదిహేను ఇరవై ఏళ్లు ఆశీర్వదించాలని మంత్రి రామానాయుడు కోరారు. దొడ్డిపట్ల గ్రామ అభివృద్ధి గత టిడిపి ప్రభుత్వంలోనూ, నేడు మళ్లీ కూటమి ప్రభుత్వంలోనూ మాత్రమే జరిగిందే గాని గత వైసిపి ప్రభుత్వం లో సున్నా అన్నారు. పాలకొల్లు-దొడ్డిపట్ల రోడ్డును 20 కోట్లతో నిర్మాణం చేశామని, మళ్లీ నేడు ఐదు కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. 18 కోట్లతో గోదావరి ఏటిగట్టు పటిష్ట అభివృద్ధి పనులు పూర్తిగా వస్తున్నాయన్నారు. గ్రామంలో కూటమి ప్రభుత్వ 20 నెలల్లో 27 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి అన్నారు. దొడ్డిపట్ల గ్రామ సమగ్ర అభివృద్ధికి, అవసరమైన నిధులు భవిష్యత్తులోనూ తీసుకువస్తానని మంత్రి రామానాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు.ఏ ఎం సి చైర్మన్ కోడి విజయ్ భాస్కర్, ఎంపీపీ ధనలక్ష్మి, బోనం నాని, మామిడి శెట్టి పెద్ది రాజు, డేగల సత్తికొండ, కడలి గోపి తదితరులు పాల్గొన్నారు.



## వైభవంగా శివపార్వతుల కళ్యాణ మహోత్సవం

**రంగారెడ్డి, ఫిబ్రవరి 1 (మనం న్యూస్):** మహేశ్వరం నియోజకవర్గం, రామకృష్ణాపురం డివిజన్ పరిధిలోని అల్మాపురి కాలనీ శివాలయంలో శివపార్వతుల కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. వేడుకలో రామకృష్ణాపురం డివిజన్ మాజీ కార్పొరేటర్ దేప సురేఖ భాస్కర్ రెడ్డి,రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక మధుర ఉపేందర్ రెడ్డి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శివపార్వతుల కృపాకటాక్షాలతో నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త కె.వి శ్రీనివాస్, ప్రధానార్చకులు సుధాకర్ శర్మ, స్థానిక నాయకులు, కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## జింక పై కుక్కల దాడి



- ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇచ్చిన స్థానికులు
- చికిత్స నిమిత్తం హైదరాబాద్ కు తరలింపు

షాద్ నగర్, ఫిబ్రవరి 1 (మనం న్యూస్): రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణం పరిధిలోని నేషనల్ మార్ట్ ముందు జింక రాగా కుక్కలు ఒకసారిగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. ఆదివారం నేషనల్ మార్ట్ ముందు జింక రాగా కుక్కలు వెంబడించి తీవ్రంగా గాయపరిచాయి. ఈ సంఘటనను గమనించిన స్థానికులు కుక్కలను తరిమి ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించారు. వెంబడే ఫారెస్ట్ అధికారులు తరలివచ్చి చికిత్స నిమిత్తం హైదరాబాద్ కు తరలించినట్లు స్థానికులు తెలిపారు.

## నిధులు కోసమే పదవులుపై కన్ను

- టీడీపీ వర్గ విభేదాల మధ్య వేగేశ్వరపురం ఎత్తి పోతలు



**తాళ్లపూడి, 1 ఫిబ్రవరి (మనం న్యూస్):** తాళ్లపూడి మండలం లోని ఐదు గ్రామాల పంట పొలాలకు 25 సంవత్సరాలుగా నిర్విరామంగా సాగు నీరు అందిస్తూ, మధ్య, చిన్న, తరగతి రైతాంగానికి లబ్ది చేకూరేలా, నామ మాత్రపు ఫీజు నీటి తీరువా గా వసూలు చేస్తూ ఏ.పి.ఎస్..ఐ.డి.సి సహకారం తో రైతు సంఘం అధ్యక్షులు కైగాల రాంబాబు అద్వర్యం లో 25 సంవత్సరాలుగా సజావుగా సాగుతున్న వేగేశ్వరపురం ఎత్తిపోతల పథకం పై రాజకీయ క్రీ (నీ)డ పడి, విభేదాలకు విమర్శలకు తావిస్తోంది. విపక్షం కంటే స్వపక్షం లోని విభేదాలే వేగేశ్వరపురం ఎత్తిపోతల నిర్వహణ కు అడ్డంకిగా మారి, సాగు నీరు పంపిణీ ప్రశ్నార్థకంగా మారనున్న పరిస్థితులు నెలకొన్నాయి. ఏ.పి.ఎస్.ఐ.డి.సి పరిధి లోకి వచ్చే ఎత్తిపోతలను నిర్వహించ లేని స్థితి లో రాష్ట్ర వ్యాప్తంగా రైతు సంఘాల పేరుతో నిర్వహణకు శ్రీకారం చుట్టారు. అప్పటి ఎమ్మెల్యే పెండ్యాల వెంకట కృష్ణారావు సమక్షం లో కైగాల రాంబాబు చేతికి నిర్వహణ పగ్గాలు అందించారు. దాదాపుగా 27 సంవత్సరాలుగా ఆయనే అధ్యక్షునిగా కొనసాగుతున్నారు. ఇదే విషయంతో వైఎస్సార్, కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాలు ఉన్న సమయం లో రాంబాబు ఆరోపణలు ఎదుర్కొన్నారు. అయిన నేటి వరకు నిర్వహణ కొనసాగుతూనే ఉంది. ప్రస్తుతం 3400 ఎకరాలకు మాత్రమే నీరు సరఫరా అవుతుండగా, వేగేశ్వరపురం, తిరుగుడుమెట్ట, బల్లిపాడు, పెద్దేవం, గ్రామాల పంటలకు నీరు అందుతుంది. 2004లో ప్రభుత్వం ఎత్తిపోతల పథకాల అభివృద్దికి ఉచిత విద్యుత్ సహ అనేక విదాలుగా నియోజక వర్గంలోని ఎత్తిపోతల పథకాలను అభివృద్ధి చేసి రైతులను ఆదుకోవడం జరిగింది. ఎత్తిపోతల పథకం అధ్యక్షుడిగా కైగాల రాంబాబు అద్వర్యం లో రైతులకు సాగు నీరు ఇబ్బంది లేకుండా 630 కేవీ, 160 కేవీ విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లను ఏర్పాటు చేయడం జరిగింది. అదే విదంగా విద్యుత్కు అంతరాయం లేకుండా ఉండడానికి గాను ప్రక్కిలంక నుండి వేగేశ్వరపురం ఎత్తిపోతల పథకం వరకు 11 కేవీ ప్రత్యేక విద్యుత్ లైన్ కూడా సొంత ఖర్చులతో ఏర్పాటు చేయడం, 320 కేవీ జనరేటర్ను కూడా ఏర్పాటు చేయడం జరిగింది.

## పోక్సో చట్టంపై అవగాహనతో ఉండాలి

- న్యాయమూర్తి ఎ. వాసంతి

**నరసాపురం, ఫిబ్రవరి 1 (మనం న్యూస్):** మహిళలు, బాలికలు సోషల్ మీడియాను అవసరం ఉన్నంతవరకే ఉపయోగించుకోవాలని, తెలియని వ్యక్తుల తో పరిచయాలు పెంచుకోవద్దని నరసాపురం 10వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎ. వాసంతి సూచించారు. నల్సా ప్లాన్ ఆఫ్ యాక్షన్ లో భాగంగా ఆమె శనివారం రాత్రి స్థానిక రాయపేటలోని బి.జి.బి.ఎస్ సాంఘిక సంక్షేమ మహిళా వసతి గృహాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. వసతి గృహంలో అందుతున్న సదుపాయాలు, ఆహార పదార్థాల వివరాలను విద్యార్థినులను న్యాయమూర్తి అడిగి తెలుసు కున్నారు. పడక గదులు, మరుగుదొడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి వాసంతి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ పోక్సో చట్టంపై మహిళలందరూ అవగాహన కలిగి ఉండాలని, విద్యార్థినిలు ప్రతి ఒక్కరు లక్ష్యాలను నిర్దేశించుకుని చదువుకొని తల్లిదండ్రులకు మంచి కీర్తిని తేవాలని, చదువుతో బాటు ప్రముఖుల జీవిత చరిత్రలను తెలుసుకోవాలని, క్రీడా రంగాలలో కూడా ప్రావీణ్యం పొందాలని సూచించారు. ఈ కార్య క్రమంలో పట్టణ సర్కిల్ ఇనస్పెక్టర్ బి. యాదగిరి, కోర్టు లైజన్ సూర్య భాస్కరరావు, ప్యానెల్ న్యాయవాదులు పద్మజ, శిరీష, వెంకటేశ్వరరావు, పి.ఎల్.వి దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

# స్క్రీనింగ్ పరీక్షల ద్వారా ప్రాథమిక దశలోనే బాధితుల గుర్తింపు

- ఆసుపత్రుల్లో చికిత్స మెరుగుపరిచేందుకు అన్నిరకాల చర్యలు
- క్యాన్సర్ కారణంగా తల్లి, సోదరిని కోల్పోయ్యానని ఆవేదన
- విశాఖలో జరిగిన వాక్ థాన్' లో సత్యకుమార్ యాదవ్ భావోద్వేగ ప్రసంగం

**విశాఖపట్టణం, ఫిబ్రవరి 1(మనంప్రతినిధి):** క్యాన్సర్ కారణంగా తల్లి, సోదరిని కోల్పోయ్యా. క్యాన్సర్ ప్రభావం నన్ను తీవ్రంగా కలచివేస్తోంది. ఈ పరిస్థితుల్లో నేను మంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన వెంటనే తొలి సంతకాన్ని క్యాన్సర్ స్క్రీనింగ్ ఫైలుపై పెట్టాను. క్యాన్సర్ కేసులు తగ్గించేందుకు, నాణ్యత కలిగిన వైద్యాన్ని అందుబాటులోనికి తెచ్చేందుకు, ప్రజల్లో అవగాహన తెచ్చేందుకు అవసరమైన అన్ని చర్యలను శాఖాపరంగా తీసుకుంటున్నట్లు' రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. విశాఖలో ఆదివారం ఉదయం బీచ్ ఒడ్డున మహాత్మాగాంధీ హాస్పిటల్, రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ ఆధ్వర్యంలో జరిగిన 'వాక్ థాన్' అవగాహన కార్యక్రమంలో మంత్రి శ్రీ సత్యకుమార్ పాల్గొని భావోద్వేగంతో పలు సందర్భాల్లో మాట్లాడారు తొలిదశలోనే గుర్తిస్తే క్యాన్సర్ బారి నుంచి బయటపడవచ్చునని పేర్కొన్నారు. అందుకే రాష్ట్రంలో ఎన్సీడీ-04 (నాన్-కమ్యూనికబుల్ డీసీజ్) కింద రాష్ట్ర వ్యాప్తంగా ఓరల్, బ్రెస్ట్, సర్వైకల్ లక్షణాలతో ఉన్న వారిని ఉచిత పరీక్షల ద్వారా గుర్తించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

**పరీక్షలు చేయించుకోవడంలో సంకోచం వద్దు!**

రాష్ట్రంలో క్యాన్సర్ కేసుల పెరుగుదల జాతీయ సగటు కేసుల నమోదుతో పోల్చితే ఎక్కువగా ఉందని ఆందోళన వ్యక్తంచేశారు 2020 నాటికి 25,487 కేసులు ఉండగా 2025 నాటికి 35,546కు కేసులు (39.5%) పెరిగాయన్నారు. జాతీయ స్థాయిలో 12.8% మాత్రమే కేసులు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా 18% మంది ప్రతి ఏటా క్యాన్సర్ కారణంగా మరణిస్తున్నారన్నారు. ఈ జాబితాలో భారత్ మూడో స్థానంలో ఉందన్నారు. ఈ కేసులను తగ్గించేందుకు ఓరల్, బ్రెస్టు, సర్వైకల్ కేసులను ప్రాథమిక దశలోనే గుర్తించేందుకు స్క్రీనింగ్ పరీక్షలను మొదలు పెట్టామన్నారు ఇప్పటివరకు ఓరల్ టెస్టును 1,39,07,523 మందికి ఉచితంగా చేయగా అవసరమని గుర్తించిన 3,41,179 మందికి దశల వారీగా పరీక్షలు జరుపుతుండగా ఇప్పటివరకు 98 కేసులు నిర్ధారణ అయినట్లు మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ చెప్పారు. బ్రెస్ట్ పరీక్షను 73,78,836 మంది మహిళలకు చేయగా తదుపరి పరీక్షలు అవసరమని గుర్తించిన 1,65,022 మందికి మళ్ళీ పరీక్షలు చేస్తుండగా ఇప్పటివరకు 104 కేసులు బయటపడ్డాయన్నారు. ఇదేవిధంగా సర్వైకల్ పరీక్షలను 73,78,836 మంది మహిళలకు చేయగా మళ్లీ 2,25,049 మందికి పరీక్షలు చేయాల్సిన అవసరం ఉందని గుర్తించినట్లు తెలిపారు. వీరిలో ఇప్పటివరకు 58 కేసులు బయటపడ్డాయని మంత్రి శ్రీ సత్యకుమార్ వివరించారు కేసులు గుర్తించడం ద్వారా సదరు బాధితుల కుటుంబాలు జాగ్రత్త పడటమే కాకుండా త్వరగా చికిత్స పొంది. క్యాన్సర్ బారి నుంచి బయటపడేందుకు అవకాశం ఉందని తెలిపారు.

**18వేల మందికి శిక్షణ**

ఎన్సీడీ-3.0 ద్వారా చేసిన పరీక్షలు, ఫలితాలు సంతృప్తికరంగా లేనందున 40 ద్వారా మళ్లీ ప్రజలకు పరీక్షలు చేస్తున్నామని వెల్లడించారు. ఇళ్లకు వచ్చే సిబ్బందికి సహకరించి పరీక్షలు చేయించుకోవాలని కోరారు. సంకోచించకుండా పరీక్షలు చేయించుకోవాలని, ఏమరుపాటుగా ఉండొద్దని, ఆందోళన చెందనక్కర్లేదని పేర్కొన్నారు. తగిన జాగ్రత్తలు పాటిస్తే క్యాన్సర్ కేసులు పెరగకుండా చూడొచ్చునని తెలిపారు క్యాన్సర్ స్టేజి 3, 4 దశల్లోనికి వస్తే చికిత్స సంక్లిష్టమవుతుందని చెప్పారు. పరీక్షల నిర్వహణ కోసం హోమిబాబా క్యాన్సర్ హాస్పిటల్ సహకారంతో 18వేల వైద్య సిబ్బంది, 550 మంది వైద్య నిపుణులకు ప్రత్యేకంగా శిక్షణ ఇప్పించామని తెలిపారు.

**నోరి దత్తాత్రేయుడు సూచనల మేరకు..!**

ప్రముఖ క్యాన్సర్ వైద్య నిపుణులు, ప్రభుత్వ సలహాదారు నోరి దత్తాత్రేయుడు సూచనల మేరకు ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు ద్వారా చికిత్స పొందిన బాధితుల వివరాల ఆధారంగా సదరు జిల్లాల్లో ముందస్తు చర్యలు తీసుకోవడం, వైద్య సేవలు మరింత చేరువ చేయడం, వైద్యులను నియమించడం, ఆసుపత్రులను అన్ని రకాలుగా సన్నద్ధం చేసేందుకు చర్యలు తీసుకునేందుకు ప్రత్యేకంగా కార్యాచరణ సిద్ధం చేయడానికి అవకాశం వచ్చిందన్నారు.

**పేదలకు క్యాన్సర్ చికిత్స చేరువ చేసేందుకు అన్నిరకాల చర్యలు!**

ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు కింద క్యాన్సర్ బాధితులకు ప్రభుత్వం అందించిన ఉచిత చికిత్స వ్యయం ఏడాదికి రూ.600 కోట్లకు చేరుకుంటుందన్నారు. 17 టీచింగ్ ఆసుపత్రుల్లో ప్రివెంటువ్ ఆంకాలజీ కేంద్రాలను ఏర్పాటుచేసినట్లు తెలిపారు. అలాగే.. డే-కేర్ కిమోథెరపీ సెంటర్లను సెకండరీ ఆసుపత్రుల్లోనూ పెంచుతున్నామని చెప్పారు. దీనివల్ల బాధితులు వైద్యుల సూచనల మేరకు కిమోథెరపీ చేయించుకోవడంలో ఇబ్బందులు తలెత్తకుండా ఉంటాయన్నారు. గుంటూరు జీజీహెచ్ లో లెవల్-1 క్యాన్సర్ కేర్ సెంటర్ అభివృద్ధి చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. కర్నూలు జీజీహెచ్లో రూ. 120 కోట్లతో రాష్ట్ర స్థాయి క్యాన్సర్ సెంటర్, కడపలోని క్యాన్సం సెంటర్వరా కూడా రోగులకు సాంత్వన చేకూర్చేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని మంత్రి శ్రీ సత్యకుమార్ వివరించారు విశాఖ కేజీహెచ్లోని క్యాన్సర్ సెంటరులో ఇట్స్కాన్ సౌకర్యాన్ని కల్పించాలని కోరుతున్నారని, తప్పకుండా పరిశీలిస్తానని మంత్రి శ్రీ సత్యకుమార్ హామీ ఇచ్చారు.

## కుప్పకూలిన వెండి బంగారం దరలు




ముంబై, ఫిబ్రవరి 1: జెట్ స్పీడ్ తో పైపైకి దూసుకుపోయిన బంగారం, వెండి ధరలు భారీగా పతనం అవుతున్నాయి. వరుసగా మూడో రోజు వీటి ధరలు కుప్పకూలాయి. కేంద్ర బడ్జెట్ వేళ దేశీయ కమొడిటీ మార్కెట్ లో బంగారం, వెండి ధరలు 9 శాతం మేర పడిపోయాయి. మల్టీ కొడిటీ ఎక్స్ఛేంజీలో ఫ్యూచర్స్ ట్రేడింగ్ లో ఏప్రిల్ కాంట్రాక్ట్ బంగారం ధర ఆదివారం పతనమైంది. 10 గ్రాముల బంగారం ధర ఒక్కరోజులోనే రూ. 13,711 క్షీణించి రూ. 1,38,634 కు చేరింది. ఇక వెండి ధర కూడా తగ్గుముఖం పడుతోంది. మార్చి కాంట్రాక్ట్ వెండి ధర ఒక్క రోజులోనే కిలోకు రూ.26,273 (9శాతం) పతనమై రూ. 2,65,652 కు చేరింది. మరోవైపు అంతర్జాతీయ మార్కెట్ లోనూ ఇదే తగ్గుదల కనపిచింది. కామెక్స్ లో స్పాట్ బంగారం ధర ఒన్సుకు 4,879 డాలర్లు పలికిం ది. జాతీయ, అంతర్జాతీయ మార్కెట్ లోల మూడు రోజులుగా చోటు చేసుకుంటున్న పరిణామాలు బంగార ం, వెండి ధరలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి.

# ఆపరేషన్ సిందూర్

## దేశ రక్షణకు రూ.7.85 లక్షల కోట్ల బడ్జెట్




ఢిల్లీ, ఫిబ్రవరి 1 : దేశ రక్షణ కోసం కేంద్ర బడ్జెట్లో అత్యంత ప్రాధాన్యత ఇచ్చారు. ఆపరేషన్ సింధూర్, ఉగ్రవాద బెదిరింపులు, రక్షణ వ్యయంలో పెరుగుదల నేపథ్యంలో కేంద్ర ఆర్థిక మంత్రి సీతారామన్ రెండో అతి పెద్ద నిధులు కేటాయించారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికిగాను రక్షణ మంత్రిత్వ శాఖకు రూ. 7.85 లక్షల కోట్ల బడ్జెట్ మంజూరు చేశారు. ఈ పెరిగిన మొత్తం జీడీపీలో 11 శాతానికి సమానం. 2025-26 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ రూ. 6.81 లక్షల కోట్ల కంటే ఇది ఎనిమిది శాతం ఎక్కువ. రఫేల్ యుద్ధ విమానాలు, జలాంతర్గాములు, మానవరహిత వైమానిక వాహనాల కాంట్రాక్టుల వంటి అనేక ప్రధాన ప్రాజెక్టులు రక్షణ మంత్రిత్వ శాఖ పరిధిలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో రక్షణ దళాల ఆధునీకరణ కోసం రూ. 2.19 లక్షల కోట్లు కేటాయించారు. గత బడ్జెట్ కంటే ఇది 21.84 శాతం అధికం. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రక్షణ మంత్రిత్వ శాఖ మూలధన వ్యయం కోసం రూ.1.8 లక్షల కోట్లు.

మరోవైపు మూలధనంలో విమానాలు, ఏరో ఇంజిన్ల కోసం రూ. 63,733 కోట్లు కేటాయించారు. రక్షణ సేవల (రెవెన్యూ) కోసం బడ్జెట్ కేటాయింపును అదనంగా 17.24 శాతం పెంచారు. నిర్వహణ, మందుగుండు సామగ్రి, ఇంధనం, మరమ్మతులు మొదలైన ఖర్చులు, సహాయక సిబ్బంది జీతాలతో సహా రోజువారీ కార్యకలాపాల కోసం ఈ నిధులు వినియోగిస్తారు. పెన్షన్ల కేటాయింపును 6.53 శాతం పెంచి రూ. 1.71 లక్షల కోట్లకు చేర్చారు. కాగా, రక్షణ రంగంలోని యూనిట్ల ద్వారా నిర్వహణ, మరమ్మత్తు లేదా సమగ్ర పునరుద్ధరణ అవసరాల కోసం ఉపయోగించే విమానాల భాగాల తయారీకి దిగుమతి చేసుకునే ముడి పదార్థాలపై ప్రాథమిక కస్టమ్స్ సుంకాన్ని మాఫీ చేస్తామని కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్లో ప్రతిపాదించారు.

## ఈసీకి భారీగా నిధుల కేటాయింపు

ఢిల్లీ, ఫిబ్రవరి 1 : ఎన్నికల సంఘానికి కేటాయించిన నిధుల్లో రూ.367.69 కోట్లు ఎన్నికల సంబంధిత వ్యయం కాగా, తక్కిన మొత్తాన్ని పరిపాలన, నిర్వహణా ఖర్చులకు వెచ్చిస్తారు. రాబోయే రెండేళ్లలో పలు రాష్ట్రాలకు ఎన్నికలు జరుగనున్నాయి. ప్రస్తుతం రెండో విడత ఎస్ఐఆర్ ప్రక్రియ కొనసాగుతోంది. ఈ ప్రక్రియలో అధికార బీజేపీతో ఎన్నికల సంఘం కుమ్మక్కై పెద్దఎత్తున ఓటర్లను తొలగిస్తున్నారంటూ విపక్షాలు ఆరోపణలు గుప్పిస్తున్న నేపథ్యంలో ఈసీకి బడ్జెట్లో నిధుల కేటాయింపులు 25 శాతం పెరగడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

ఈ ఏడాది తమిళనాడు, పశ్చిమబెంగాల్, అస్సాం, కేరళ రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉండగా, 2027లో ఉత్తరప్రదేశ్, పంజాబ్లో ఎన్నికలు ఉంటాయి.

ఎన్నికల కమిషన్కు కేంద్రం కేటాయించిన నిధులను సాంకేతికత, ఎన్నికల నిర్వహణ, ఓటర్ల అవగాహన తదితర కార్యక్రమాల కోసం వినియోగిస్తారు. ఈవీఎంలు, వీవీపాట్ యంత్రాల ఆధునీకరణ, పోలింగ్ కేంద్రాల భద్రతకు కూడా ఈ నిధులు వెచ్చిస్తారు.

## ఐటీ, ఏఐకి రెడ్ కార్పెట్

### టెక్ కంపెనీలకు 20 ఏండ్ల పాటు ట్యాక్స్ హాలీడే

ఢిల్లీ, ఫిబ్రవరి 1 : కృత్రిమ మేధ, డిజిటల్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్లో భారత్ ను ప్రపంచ హబ్ గా మార్చేందుకు కేంద్ర బడ్జెట్లో ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ కీలక ప్రతిపాదనలు చేశారు. భారత్లోని డేటా సెంటర్లు ఏర్పాటు చేసే విదేశీ కంపెనీలకు 2047 వరకు 'ట్యాక్స్ హాలిడే'ను ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదన దేశీయంగా డేటా సెంటర్ల ఏర్పాటును వేగవంతం చేయడంతో పాటు క్లౌడ్ కంప్యూటింగ్ కు భారత్ ను ఎగుమతి హబ్గా మార్చనుంది. ఉపాధి అవకాశాలకు కూడా ఊతమివ్వనుంది. 'భారత్లోని డేటా సెంటర్లను ఉపయోగించి ప్రపంచవ్యాప్త కస్టమర్లకు క్లౌడ్ సేవలను అందించే విదేశీ కంపెనీలకు 2047 వరకు ట్యాక్స్ హాలిడే కల్పిస్తాం. అయితే, ఈ ట్యాక్స్ హాలిడేను పొందేందుకు కంపెనీలు భారతీయ రీసెల్లర్ల ద్వారానే భారత కస్టమర్లకు సేవలను అందించాల్సి ఉంటుంది' అని నిర్మలా సీతారామన్ తన బడ్జెట్ ప్రసంగంలో వెల్లడించారు. ఈ విదేశీ కంపెనీలకు డేటా సెంటర్ సేవలందించే భారతీయ కంపెనీలు 15 శాతం సేఫ్ హార్బర్ మార్జిన్ (విదేశీ కంపెనీలకు సేవలందించే దేశీయ ఐటీ సంస్థలకు వర్తించే నిర్దిష్ట లాభ మార్జిన్) పొందొచ్చు. 'భారత్లోని డేటా సెంటర్లను ఉపయోగించి ప్రపంచవ్యాప్త కస్టమర్లకు క్లౌడ్ సేవలను అందించే విదేశీ కంపెనీలకు 2047 వరకు ట్యాక్స్ హాలిడే కల్పిస్తాం. అయితే, ఈ ట్యాక్స్ హాలిడేను పొందేందుకు కంపెనీలు భారతీయ రీసెల్లర్ల ద్వారానే భారత కస్టమర్లకు సేవలను అందించాల్సి ఉంటుంది' అని నిర్మలా సీతారామన్ తన బడ్జెట్ ప్రసంగంలో వెల్లడించారు. ఈ విదేశీ కంపెనీలకు డేటా సెంటర్ సేవలందించే భారతీయ కంపెనీలు 15శాతం సేఫ్ హార్బర్ మార్జిన్ (విదేశీ కంపెనీలకు సేవలందించే దేశీయ ఐటీ సంస్థలకు వర్తించే నిర్దిష్ట లాభ మార్జిన్) పొందొచ్చు.

**ఈ రెడ్ కార్పెట్ వల్ల లాభాలెన్నో..**

ఇప్పటికే ఆంధ్రప్రదేశ్లో గూగుల్ భారీ డేటా సెంటర్ను ఏర్పాటు చేసేందుకు సిద్ధమైంది. దీంతో పాటు రైడెన్ ఇన్ఫో, ఇతర కంపెనీలు కూడా భారత్లో డేటా సెంటర్లను ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతున్నాయి. తాజా 'ట్యాక్స్ హాలిడే'తో ఈ కంపెనీలకు రెడ్కార్పెట్ పరిచినట్లయ్యింది. ఈ నిర్ణయంతో ఐటీ, ఇంజినీరింగ్, సైబర్ సెక్యూరిటీ, డేటా మేనేజ్మెంట్ వంటి రంగాల్లో వేలాది ఉద్యోగాలు ఏర్పడే అవకాశం ఉంది. అంతేగాక విద్యుత్, మౌలిక సదుపాయాల కల్పన వంటి రంగాల్లోనూ అభివృద్ధి జరగనుంది. దేశ భద్రత పరంగానూ ఇది కీలకంగా మారనుంది.

**ఏంటీ డేటా సెంటర్లు..**

## బడ్జెట్లో 7 హైస్పీడ్ రైల్ కారిడార్లు..

- **జాబితాలో హైదరాబాద్**

ఢిల్లీ, ఫిబ్రవరి 1 : 2026-27 బడ్జెట్లో ఏడు నగరాల మధ్య హైస్పీడ్ రైల్ కారిడార్లు ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. వాటిలో హైదరాబాద్ కూడా ఉండడం విశేషం.

**ముంబయి-పుణె, పుణె-హైదరాబాద్, హైదరాబాద్-బెంగళూరు, హైదరాబాద్-చెన్నై, దిల్లీ-వారణాసి, వారణాసి-సిలిగుడి**

వీటి మౌలిక సదుపాయాల కల్పనకు రూ.12.2 లక్షల కోట్లు కేటాయిస్తున్నట్లు తెలిపారు. గతేడాది రూ.11.2 లక్షల కోట్లు కేటాయించగా.. ఈసారి స్వల్పంగా పెంచారు. దేశ మౌలికసదుపాయాల కల్పన గురించి మాట్లాడుతూ.. ఈ కారిడార్ల గురించి సీతారామన్ వెల్లడించారు. వీటిద్వారా ప్రధాన ఆర్థిక, సాంస్క ృతిక కేంద్రాల మధ్య అనుసంధానం పెరుగుతుందని చెప్పారు. సుదూర ప్రయాణాల విషయంలో పర్యావరణహితమైన రవాణా వ్యవస్థగా ఈ కారిడార్లు మారుతాయని ఆశాభావం వ్యక్తంచేశారు. ఇవి ప్రయాణ సమయాన్ని కుదిస్తాయని, రోడ్డు మార్గం, ఇప్పటికే ఉన్న రైలు నెట్వర్క్లో రద్దీని తగ్గిస్తాయని నిర్మల వెల్లడించారు.



## కవలలకు జన్మనిచ్చిన రామ్చరణ్ దంపతులు

మెగా కుటుంబంలో సందడి నెలకొంది. సినీ నటుడు రామ్ చరణ్, ఉపాసన దంపతులకు కవలలు జన్మించారు. ఉపాసన ఓ మగ, ఆడ శిశువుకు జన్మనిచ్చినట్లు మెగాస్టార్ చిరంజీవి ఎక్స్ వేదికగా వెల్లడించారు. తల్లీ బిడ్డలు ఆరోగ్యంగా ఉన్నారని.. తమ కుటుంబంలోకి కొత్త సభ్యులు రావడం సంతోషం కలిగిస్తోందని చెప్పారు. ఇప్పటికే రామ్ చరణ్ దంపతులకు కుమార్తె క్లింకార ఉన్న సంగతి తెలిసిందే. ఈ వార్తతో మెగా అభిమానులు సంబరాలు చేసుకుంటున్నారు.




## ఆద్యంతం నవ్వించేలా 'ఫంకీ'

''కుటుంబ సమేతంగా చూడదగ్గ సినిమా 'ఫంకీ'. ఇది అందరికీ మంచి అనుభూతిని అందిస్తుంది' అన్నారు హీరో విష్వక్ సేన్. ఆయన.. కయాదు లోహర్ జంటగా నటించిన ఈ సినిమాని కేవీ అనుదీప్ తెరకెక్కించారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. నరేశ్, వీటీవీ గణేశ్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా ఈ నెల 13న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే శనివారం హైదరాబాద్లో ఈ చిత్ర రెండో గీతాన్ని విడుదల చేశారు. ''రట్టాటటావ్..'' అంటూ సాగిన ఈ పాటకు భీమ్స్ సిసిరోలియో స్వరాలు సమకూర్చగా.. దేవ్ పవార్ సాహిత్యమందించారు. రామ్ మిరియాల ఆలపించారు. ఈ సందర్భంగా హీరో విష్వక్ సేన్ మాట్లాడుతూ.. ''నా గత రెండు చిత్రాలు ప్రేక్షకుల్ని పూర్తి స్థాయిలో మెప్పించలేకపోయాయి. అందుకే అందరి ఫీడ్బ్యాక్ తీసుకుని.. 'ఫంకీ'తో నా ప్రయాణాన్ని మళ్లీ ఒకటి నుంచి మొదలు పెడుతున్నా. అనుదీప్ రచన, హాస్యం భిన్నంగా ఉంటాయి. తను చాలా ప్రత్యేకమైన వ్యక్తి. ఆయనతో పని చేశాక నేను సినిమాని, జీవితాన్ని చూసే కోణం మారిపోయింది'' అన్నారు. ''ఆద్యంతం నవ్వించే సినిమా ఇది. దీంట్లో భాగమవ్వడం చాలా ఆనందంగా ఉంది'' అంది నటి కయాదు లోహర్. దర్శకుడు అనుదీప్ మాట్లాడుతూ.. ''ఇది మంచి ఫ్యామిలీ ఎంటర్టైనర్. ప్రారంభం నుంచి చివరి వరకు నవ్వులు పంచుతుంది'' అన్నారు. ఈ కార్యక్రమంలో దేవ్ పవార్తో పాటు చిత్ర బృందం పాల్గొంది.

## నాకు ఆ పాత్రలు చేయాలని కోరిక: శ్రుతి హాసన్

కమల్ హాసన్ కుమార్తెగా సినీ లోకానికి పరిచయమైన శ్రుతి హాసన్ మొదటి నుంచి గాయనిగా, సంగీత దర్శకురాలిగా, నటిగా ఇలా తనలోని మల్టీ టాలెంటెడ్ పర్సన్ ని అప్పుడప్పుడు ప్రేక్షకులకు పరిచయం చేస్తూనే వచ్చారు. ఐతే, తాజాగా శ్రుతి హాసన్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. ''నాకు విభిన్న మార్గాల్లో నడవడం ఇష్టం. ఒకే గుర్తింపులో నన్ను నేను బంధించాలనుకోవట్లేదు. నాకు సంగీతం, నటన, రచన అంటే చాలా ఇష్టం. అయినప్పటికీ అన్నింటి కన్నా ముందు నటిగా ఉండటానికే ఇష్టపడతాను. నాకు అదే ఆనందాన్నిస్తుంది' అని శ్రుతి తెలిపింది. శ్రుతి హాసన్ ఇంకా మాట్లాడుతూ.. 'నాకు నచ్చే పాత్రల విషయానికి వస్తే.. నేను శారీరక శ్రమతో కూడిన పాత్రలు చేయాలనే కోరిక నాకు ఉంది. అలాగే, బోల్ పాత్రలను చేసేటప్పుడు కూడా నేను బాగా ఎంజాయ్ చేస్తాను. సినిమా నా వృత్తి జీవితంలో ఒక భాగం. కానీ సంగీతం నా వ్య క్తిగత విషయం. సినిమా నాకు ప్రజలతో ఎలా ఉండాలో నేర్పించింది. ఆ పాఠాలే ఒక సంగీతకారిణిగా, మనిషిగా నన్ను ముందుకు నడిపిస్తున్నాయి' అని శ్రుతి హాసన్ చెప్పుకొచ్చింది.






### సాఫ్ట్వేర్ నుంచి వ్యవసాయం..

## ఆకట్టుకుంటున్న 'మిస్టర్ వర్క్ ఫ్రమ్ హోమ్' ట్రైలర్

విలక్షణమైన పాత్రలతో తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకున్న నటుడు త్రిగుణ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'మిస్టర్ వర్క్ ఫ్రమ్ హోమ్'. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి ట్రైలర్ను విడుదల చేసింది చిత్రయూనిట్.

మధుదీప్ చెలికాని దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం, ఆధునిక సాఫ్ట్వేర్ జీవనశైలికి మరియు గ్రామీణ మూలాలైన వ్యవసాయానికి మధ్య ఉన్న సంబంధాన్ని సరికొత్త కోణంలో ఆవిష్కరించనుంది. సిటీలో సెటిల్ అవ్వాలనే ఆలోచన పక్కన పెట్టి, వర్క్ ఫ్రమ్ హోమ్ చేస్తూనే తన ఊరిలో వ్యవసాయాన్ని కొత్త పుంతలు తొక్కించే యువకుడి కథా నేపథ్యంతో ఈ సినిమా రూపొందింది. ముఖ్యంగా ''వ్యవసాయం చేసే విధానం మారితే, దాన్ని చూసే తీరు మారుతుంది'' వంటి డైలాగులు ప్రేక్షకులలో ఆలోచన రేకెత్తిస్తున్నాయి. లోటస్ క్రియేటివ్ వర్క్స్ బ్యానర్పై అరవింద్ మండెం నిర్మిస్తున్న ఈ చిత్రంలో పాయల్ రాధాకృష్ణ హీరోయిన్గా నటించగా, అనీష్ కురువిల్లా, శివాజీ రాజా ఇతర కీలక పాత్రలు పోషించారు. బాబా సెహగల్ పాడిన సాంగ్ ఇప్పటికే యూట్యూబ్లో ట్రెండ్ అవుతుండగా, చిన్న సినిమాల పట్ల ప్రేక్షకులు చూపిస్తున్న ఆదరణ చూస్తుంటే ఈ చిత్రంపై మంచి అంచనాలు ఏర్పడ్డాయని హీరో త్రిగుణ్ ధీమా వ్యక్తం చేశారు. తక్కువ టికెట్ ధరలతో ప్రేక్షకులను థియేటర్లకు రప్పించేలా ప్లాన్ చేస్తున్న ఈ మూవీ విడుదల తేదీని మేకర్స్ త్వరలోనే ప్రకటించనున్నారు.

## రిషబ్ శెట్టి కండీషన్స్తో టాలీవుడ్ నిర్మాతలు అసంతృప్తి



కన్నడ నటుడు రిషబ్ శెట్టి 'కాంతార' ఫ్రాంచైజీతో అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకోవడమే కాకుండా, టాలీవుడ్లో కూడా హాట్ టాపిక్గా మారారు. ఈ చిత్రాల భారీ విజయంతో ఆయన క్రేజ్ ఆకాశాన్ని తాకగా, ప్రస్తుతం రిషబ్ శెట్టి తెలుగులో రెండు భారీ ప్రాజెక్టులకు సంతకం చేశారు. అయితే, ఈ సినిమాల కోసం ఆయన డిమాండ్ చేస్తున్న పారితోషికం ఇప్పుడు సినీ వర్గాల్లో చర్చనీయాంశమైంది. సాధారణంగా లాభాల్లో వాటా తీసుకునే పద్ధతిలో పనిచేయమని నిర్మాతలు కోరినప్పటికీ, రిషబ్ శెట్టి మాత్రం ఒక్కో సినిమాకు రూ. 80 కోట్ల పారితోషికం డిమాండ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఆయన ప్రస్తుతం మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాణంలో, ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో రాబోతున్న 'జై హనుమాన్' చిత్రంలో నటించనున్నారు. దీనితో పాటు సితార ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్పై అశ్విన్ గంగరాజు దర్శకత్వంలో ఒక పీరియాడిక్ డ్రామాలో కూడా రిషబ్ భాగం కానున్నారు. ప్రస్తుతం ఈ రెండు సినిమాలకు సంబంధించిన ప్రీ-ప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఈ ఏడాది కేవలం ఈ రెండు ప్రాజెక్టులపైనే పూర్తిగా దృష్టి పెట్టాలని నిర్ణయించుకున్న రిషబ్, ఇతర ఏ కొత్త సినిమాలకు డేట్స్ కేటాయించడం లేదని సమాచారం. మరి ఆయన అడుగుతున్న ఈ భారీ పారితోషికం విషయంలో నిర్మాతలు ఎలా స్పందిస్తారో వేచి చూడాలి.

# బుజ్జగింపుల పరువం షురూ...!

- అన్ని ప్రధాన పార్టీలది ఇదే తంతు
- ఇతర పార్టీల వైపు కొందరి చూపు
- డబ్బు..నామినేటెడ్ పదవుల ఆశ చూపి ఉపసంహరణల కోసం వెంపర్లాట
- అప్పుడే వార్డుల్లో ప్రచారం ప్రారంభించిన కౌన్సిలర్ అభ్యర్థులు



**సూర్యాపేట, ఫిబ్రవరి 01 (మనం ప్రతినిధి):** మున్సిపల్ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ పూర్తి కావడంతో ఇక ప్రధాన పార్టీల అభ్యర్థులకు రెబల్ బెడద మొదలైంది. జిల్లాలోని ప్రతి మున్సిపాలిటీలో వార్డులో బరిలో నిలిచిన ప్రధాన పార్టీలైన బి ఆర్ఎస్... కాంగ్రెస్ పార్టీలలో ముగ్గురు... నాలుగురు చొప్పున నామినేషన్లు దాఖలు చేయడం గమనర్హం. జిల్లాలోని ప్రధాన పార్టీలు ఇప్పటివరకు తమ తమ పార్టీలకు చెందిన అభ్యర్థులకు బీఫారమ్స్ అందరికీ ఇచ్చిన సందర్భాలులేవు. సంబంధిత నాయకులు బరిలో నిలిచిన పార్టీ అభ్యర్థులకు చివరి నిమిషంలో ఇచ్చే అవకాశం ఉంది. పార్టీ బీఫామ్ అందుకునే అభ్యర్థి మినహా మిగిలిన అభ్యర్థులను ఎలా బుజ్జగించాలనే పర్వం అప్పుడే మొదలైంది .ప్రధాన పార్టీలు రేబల్స్. ఎదుర్కోవటం ఎలా అని విషయమై .తల మునకలై నాయి ఇందులో భాగంగా సోమవారం నామినేషన్ ఉపసంహరణ ఘట్టం చివరి రోజు కావడంతో ప్రధాన పార్టీల నేతలు రెబల్ అభ్యర్థుల నామినేషన్ ఉపసంహరణకు మల్ల గుల్లలు పడుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ప్రధాన పార్టీలు తమ తమ అభ్యర్థుల గెలుపు కోసం వార్డుల్లో నిర్వహించిన సర్వే ఆధారంగా గెలుపు గుర్రాలను బేరీజు వేసుకుంటూ అభ్యర్థులను బరిలో నిలిపేందుకు సిద్ధమయ్యాయి. ముఖ్యంగా ప్రజాబలం... అంగ ఆర్థిక బలం మెండుగా ఉన్న అభ్యర్థులను రంగంలోకి దించేందుకు ప్రామాణికంగా తీసుకొని పార్టీ తరపున బి ఫామ్ కేటాయించేందుకు ప్రధాన పార్టీలు సిద్ధపడుతున్నట్లు సమాచారం. ఇక పార్టీ నుండి రెబల్. నామినేషన్ వేసిన బరిలో నిలిచిన అభ్యర్థులను బామాలి... పూజగించి తమ దారికి తెచ్చుకునేందుకు పార్టీల బాధ్యులు ప్రయత్నం మొదలుపెట్టారు. అభ్యర్థులకు ప్రధానంగా ఆయా పార్టీల నుండి పార్టీ నామినేటెడ్ పదవులు. అలాగే అధికార పార్టీ అభ్యర్థులకు. పార్టీ నుండే కాక ప్రభుత్వ నామినేటెడ్ పదవులను కట్టబెడతామంటూ హామీ ఇస్తున్నట్లు.. ప్రచారం జరుగుతోంది. మరి కొంతమంది అభ్యర్థులకు డబ్బులను ఆశ చూపి నామినేషన్ ఉపసంహరించుకునే విధంగా పార్టీలు రంగంలోకి దిగాయి. ఈ నేపథ్యంలో ఎలాగైనా తమకు వార్డుల్లో ప్రజాబలం ఉందని నమ్ముతూ మరి ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా నామినేషన్ ఉపసంహరణ అనేది సశే మీరా అంటూ స్వతంత్ర అభ్యర్థిగా అయిన బరిలోకి దిగేందుకు మరి కొందరు అభ్యర్థులు దానికి తగ్గ రంగం సిద్ధం చేసుకుంటున్నారు.. దీనితో వీరిని బుజ్జగించేందుకు ఆయా పార్టీల నేతలు.. ఒప్పించి మెప్పించలేక..తలమునకలై పోతున్నారు. అంతేకాకుండా ఇతర పార్టీల నుండి మద్దతు కోరుతూ వార్డులో తమతో ప్రచారానికి రావలసిందిగా విజ్ఞప్తి చేస్తూ ఆ పార్టీల మద్దతును కూడగొట్టుకునేందుకు మరికొందరు అభ్యర్థులు వ్యూహరచనలు చేస్తున్నారు. దానిలో భాగంగానే.. పోటీల్లో లేని ఇతర పార్టీల నేతలతో రహస్య సంప్రదింపులు చేస్తూ వారి ఓటు బ్యాంకు తమ వైపు తిప్పుకునేలా పావులు కలుపుతున్నారు... ఇప్పటికే ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థులు ఇంటింటి ప్రచారాన్ని మొదలుపెట్టారు. తమకు ఓటు వేయాల్సిందిగా ఓటర్ దేవుళ్లను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు.. వీటన్నిటికీ చెక్ పడి వార్డుల్లో ప్రధాన పార్టీలకు ఎలాంటి రెబల్ బెడద లేకుండా ఏ మేరకు బుజ్జగింపుల పర్వం ముగుస్తుందో వేచి చూడాలి మరి.

# నిరీక్షణకు ఫలితం





- 34వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థిగా సాజిద్ ఖాన్
- హామీ నిలబెట్టుకున్న పార్టీ నేతలు

**సూర్యాపేట, ఫిబ్రవరి 1 (మనం ప్రతినిధి):** మున్సిపల్ ఎన్నికల్లో 34 వ వార్డు నుండి కౌన్సిలర్ అభ్యర్థులుగా కాంగ్రెస్ పార్టీలో ఆశావాహులు అధికంగా ఉండడంతో అదృష్టం ఎవరికి వరిస్తుందో అని కాంగ్రెస్ శ్రేణుల్లో, వార్డు ప్రజల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. దీనికి తెర దింపుతూ.. ఆదివారం ఏఐసీసీ సభ్యుడు. రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర టూరిజం బోర్డ్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డిలు. పట్టణంలోని 34 వ వార్డు నుండి నామినేషన్ దాఖలు చేసిన సీనియర్ కాంగ్రెస్ మైనార్టీ నాయకుడు సాజిద్ ఖాన్ వైపు మొగ్గు చూపారు. దీంతో ఎన్నో సంవత్సరాల నిరీక్షణకు ఫలితం దక్కింది.కరుడుకట్టిన కాంగ్రెస్ నేతగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి.మాజీమంత్రి దామన్న ల అభిమానిగా పిలువబడే. సాజిద్ ఖాన్ కు టికెట్ హామీ లభించడంతో స్థానిక వార్డు. ప్రజలు కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇందులో భాగంగా సూర్యాపేట జిల్లా కేంద్రానికి వచ్చిన ఏఐసీసీ. ఇంచార్జి కార్యదర్శి విశ్వనాథన్ ను ఈ సందర్భంగా బరిలో నిలిచిన అభ్యర్థి సాజిద్ ఖాన్ మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు.



# అంగరంగ వైభవంగా శ్రీ వేణుగోపాల స్వామి కళ్యాణం

- కనులారా తిలకించిన భక్తజనులు

**నేరేడుచర్ల, ఫిబ్రవరి 1 మనం న్యూస్:** సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం పొనుగోడు గ్రామంలో కొలువై ఉన్న చారిత్రాత్మక శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామి వారి వార్షిక కళ్యాణం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం సుప్రభాత సేవతో ప్రారంభించి తోరణ అలంకరణ శ్రీ ఆంజనేయ స్వామి వారికి అభిషేకం నవగ్రహ హోమం సుదర్శన హోమం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వేద పండితులు అలహరి నరసింహచార్యులు రవి అయ్య గార్ల ఆధ్వర్యంలో శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామి కళ్యాణం వేదమంత్రాల నడుమ కన్నుల పండుగలా నిర్వహించారు. అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు స్వామి వారి కళ్యాణాన్ని కనులారా తిలకించారు. స్వామివారిని స్మరిస్తూ పాడిన భజన పాటలు భక్త లోకాన్ని తరింపజేశాయి. దేవాదాయ ధర్మాదాయ శాఖ మేనేజర్ కొంకపాక మృత్యుంజయ శాస్త్రి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. స్వామి వారి కళ్యాణం అనంతరం అన్నప్రసాద పంపిణీ నిర్వహించారు. ఈ కళ్యాణ ఉత్సవంలో పొనుగోడు గ్రామ సర్పంచ్ కటకం వేణు, ఉప సర్పంచ్ జోగు అరవింద రెడ్డి, కటకం రమేష్, అలుగుబెల్లి రవీందర్ రెడ్డి, ఎల్లావుల పిచ్చయ్య కంది బండ చిన్నరామయ్య రామదాసు, శ్రీ వాణి స్కూల్ కొణతం సీతారాం రెడ్డి , కందిబండ నాగేశ్వరరావు, శ్రీపాది సైదయ్య అలుగుబెల్లి దేవి రెడ్డి, బాల్తు సుధాకర్, జోగు లింగారెడ్డి, చందా మోహన్ రెడ్డి, నక్కమట్టయ్య, అనంతు వెంకన్న గౌడ్, చంద రామకోటమ్మ, ఏడిపాల శ్రీదేవి, అలుగుబెల్లి మాధవి, మట్టా నర్మదా రెడ్డి, సునీత, శ్రీపాది, వాణి, బాల్తు స్వర్ణ నాగమణి యశోద తదితరులు పాల్గొన్నారు.

## రామాపురం ఉద్యోగ మిత్ర మండలి నూతన కమిటీ ఎన్నిక



**చిలుకూరు, ఫిబ్రవరి 01(మనం న్యూస్):** చిలుకూరు మండలం రామాపురం గ్రామంలో ఉద్యోగ మిత్ర మండలి మాజీ అధ్యక్షులు వేమూరి జానకి రామ్ అధ్యక్షతన సాధారణ సమావేశం నిర్వహించి ఈ సమావేశంలో నూతన కార్యవర్గం ఎన్నికచేయటం జరిగింది. నూతన అధ్యక్షులుగా పాయిలి రమేష్, ప్రధాన కార్యదర్శిగా షేక్. జబ్బార్, ఉపాధ్యక్షులుగా ఆరె నాగరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ సభ్యులను రాజకీయాలకు అతీతంగా గ్రామ ప్రజలను,రాజకీయ ప్రతినిధులను, గ్రామ అధికారులను సమన్వయ పరుస్తూ అనేక సేవ కార్యక్రమాలు చేస్తూ గ్రామ అభివృద్ధికి తోడ్పాడుతూ రామాపురం ఉద్యోగ మిత్ర మండలికు గుర్తింపు తెస్తామని నూతన అధ్యక్షులు తెలియజేశారు ఈ కార్యక్రమంలో లెఫ్టినెంట్ జనరల్ సాయి భార్గవ్ ఉపాధ్యాయులు షేక్ రఫీ పాల్గోన్నారు.

# ఫిర్యాదు లేని విచారణ ఏంటి

- కెసిఆర్‌పై కక్షతోనే సిట్ విచారణ
- మున్సిపాలిటీ ఎన్నికల వేల రాజకీయం
- తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్



**తిరుమలగిరి, ఫిబ్రవరి 1 (మనం న్యూస్):** కెసిఆర్ పైన ఎవరు ఫిర్యాదు చేయకుండానే సిట్ పేరుతో విచారణ చేయడం ఏంటి అని తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కెసిఆర్ పై సిట్ విచారణకు నిరసనగా భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఓటుకు నోటు కేసులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జైలుకు వెళ్లాడు కాబట్టే కేసీఆర్ పైన కక్షపూరితంగా సీట్ పేరుతో విచారణ చేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ సాధించి పెట్టిన తెలంగాణ జాతిపిత కెసిఆర్ పై సిట్ పేరుతో విచారణ చేయడం అంటే తెలంగాణ ప్రజలను అవమానించినట్లే అని అన్నారు. మున్సిపాలిటీ ఎన్నికలు వచ్చిన సమయంలో నేరుగా ఎన్నికలలో ఎదుర్కోలేని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిట్ పేరుతో డైవర్స్ రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. కెసిఆర్ తెలంగాణ సాధించి పెట్టడంతోనే ఈనాడు రేవంత్ రెడ్డి కూర్చున్న సీఎం పదవి కెసిఆర్ పెట్టిన భిక్ష అని అన్నారు. తెలంగాణను కెసిఆర్ ముఖ్యమంత్రిగా ఉండి అభివృద్ధి చేసి నీ చేతిలో పెడితే నువ్వు మాయమాటలు చెప్పి అధికారులకు వచ్చావని అన్నారు. తెలంగాణకు దేశంలో ఒక గుర్తింపు వచ్చిందా టె కెసిఆర్ వల్లనే ప్రపంచంలో గుర్తింపు వచ్చిందన్నారు. నోటుకు ఓటు కేసులో జైల్లో ఉండాల్సిందే అని ఆనాడు చట్టం తన పని చేసిందని,దానిని దృష్టిలో పెట్టుకొని నేను జైల్లో చిప్ప కూడు తిన్నాను కాబట్టి ఇవాళ బిఆర్ఎస్ నాయకులు కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు, జగదీశ్ రెడ్డి మీద కేసులు పెట్టాలని పెట్టాలని ప్రయత్నిస్తున్నారని, మా నాయకుల జోలికొస్తే తస్మా జాగ్రత్త అన్నారు. తెలంగాణ సాధన ఉద్యమం కేసీఆర్ కెసిఆర్ తో ఉండి ఎన్నో కేసులు ఎదుర్కొన్నానని, ఎన్ని తప్పుడు కేసులు పెట్టిన చట్టపరంగా ఎదుర్కొంటామని తెలిపారు. తిరుమలగిరి మున్సిపాలిటీ ఎన్నికలల్లో గులాబీ జెండా ఎగరాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలు మోసం చేసిన విషయాలను ఇంటింటికి ప్రచారం ప్రభుత్వ వైఫల్యాన్ని ఎండగాడుదామన్నారు. నాయకులు, కార్యకర్తలు అందరూ సమిష్టిగా పనిచేసి బీఫామ్ ఇచ్చిన టిఆర్ఎస్ కౌన్సిలర్ గెలిపించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ తిరుమలగిరి మున్సిపాలిటీ ఎన్నికల ఇంచార్జ్ వై. వెంకటేశ్వర్లు, బి పార్ట్ మండల అధ్యక్షులు ఎస్.రఘునందన్ రెడ్డి, ఎం ఎ. రజాక్, కల్లెట్ల పెల్లి ఉప్పలయ్య, శోభన్ బాబు, నరోత్తం రెడ్డి, దూపటి రవి, బర్ల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా లక్ష్మీ సరస్వతి హావనం



- మాతలచే సామూహిక అఖండ లలిత సహస్రనామ స్తోత్ర పారాయణం

**జగిత్యాల ఫిబ్రవరి 01 (మనం న్యూస్):** జగిత్యాల రూరల్ మండలం పొలాసలోని108 శ్రీ చక్ర సహిత లలితమాత ఆలయంలో లలితమాత జయంతి సందర్భంగా శ్రీ లలితా మూలమంత్ర సహిత లక్ష్మి సరస్వతీ హావనయజ్ఞ కార్యక్రమాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. లలితమాత ఆలయ సేవా ట్రస్టు సభ్యులు, ఆలయ ఫౌండరి ట్రస్టీ చైర్మన్ చెల్లం స్వరూప ఆధ్వర్యంలో 108 శ్రీ చక్ర సహిత శ్రీ లలితామాత ఆలయంలో ఆదివారం మాఘ శుద్ధ పౌర్ణమినీ పురస్కరించుకొని ఐదుగురు దంపతులు పాల్గొనగ యజ్ఞం నిర్వహించారు. బ్రహ్మశ్రీ తీగుళ్ల విష్ణుశర్మ శాస్త్రోక్తంగా పూర్ణహుతి చేసి యజ్ఞకార్యక్రమాన్ని ముగించారు. లోక కళ్యాణర్థమై పౌర్ణమి సందర్భంగా ఉదయం 8 గంటలక నుండి సాయంత్రం వరకు మహిళలు లలితసాహస్రణమా పారాయణం గావించగా, ఉదయం పూట శ్రీ చక్రాలకు మహిళలు కుంకుమార్చన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం ఆలయంలో నక్షత్ర హారతి, దీపాలంకరణ చేశారు. మాఘ మాసంలో జరుపుకొనే మొదటి పండగ పోచమ్మ తల్లికి చలి బోనం సమర్పిస్తారు. అందులో భాగంగానే జగిత్యాల పట్టణంలోని పోచమ్మవాడలోని పోచమ్మతల్లికి రాత్రి వండిన బోనాన్ని ఉదయమే మహిళలు చలి బోనంగా సమర్పించి కుటుంబాలను చల్లంగా చూడాలని బిసి సంక్షేమ సంఘం మహిళా రాష్ట్ర నాయకురాలు దాసరి రజని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మార రాజేశం, చెల్లం సత్తయ్య, సతీష్, రాజేష్, మహేందర్, పాంపట్టి సులోచన, ఉటూరి కళ్యాణి, పెద్ది అశ్విని, శ్రీదేవి, ఉటూరి అర్చన, భక్తులు, మాతలు పాల్గొన్నారు.

## రాజకీయ కక్షతోనే కేసీఆర్కు సిట్ నోటీసులు



- ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఆధ్వర్యంలో హుజురాబాద్లో భారీ ర్యాలీ

**హుజురాబాద్, ఫిబ్రవరి 1 (మనం న్యూస్):** తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, తెలంగాణ బాపూజీగా ప్రజల గుండెల్లో నిలిచిన కేసీఆర్కు సిట్ నోటీసులు పంపడాన్ని నిరసిస్తూ హుజురాబాద్లో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఆధ్వర్యంలో టిఆర్ఎస్ శ్రేణులు ఘనంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. హుజురాబాద్ పట్టణ సమీపంలోని సిరసపల్లి క్రాస్ రోడ్ నుంచి శాలపల్లి ఇందిరానగర్ వరకు బైక్ ర్యాలీ కొనసాగింది. రంగాపూర్, గొల్లపల్లి, రాజపల్లి, చెల్పూర్ గ్రామాల మీదుగా సాగిన ఈ ర్యాలీ అంతా జై తెలంగాణ జై కెసిఆర్ సీఎం డౌన్ డౌన్ నినాదాలతో మారుమోగింది. ఈ బైక్ ర్యాలీలో సుమారు 2000 బైకులు పాల్గొనగా 4000 మంది కార్యకర్తలు, అభిమానులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ సాధన కోసం తన జీవితాన్ని అంకితం చేసిన కేసీఆర్కు సిట్ నోటీసులు పంపడం హేయమైన చర్య అని అన్నారు. రాజకీయ కక్షతో చేసిన ఈ చర్యను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. కేసీఆర్ మచ్చలేని నాయకుడని, ప్రజలే ఆయనకు అండగా నిలుస్తారని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ మున్సిపల్ ఎన్నికల ఇంచార్జ్ భూపతి రెడ్డి, జమ్మికుంట మున్సిపల్ ఇంచార్జ్ సుదీర్, టిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రారంభమైన ప్రైవేట్ పీఈటి క్రికెట్ ఛాంపియన్షిప్ పోటీలు



- అంబరానంటిన పి ఈ టి క్రికెట్ సంబరాలు

**కరీంనగర్ స్పోర్ట్స్ ఫిబ్రవరి 1 (మనం న్యూస్):** కరీంనగర్ ప్రైవేట్ పి ఈ టి అసోసియేషన్ ఆధ్వర్యంలో కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో ఆదివారం క్రికెట్ ఛాంపియన్షిప్ పోటీలను ఉత్సాహంగా ప్రారంభించారు.ఈ పోటీలకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన డివైస్ఓ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ క్రీడల ద్వారా స్నేహ సంబంధాలు మెరుగుపడతాయని క్రీడలు శారీరక మానసిక ఆరోగ్య పరిరక్షణ కు తోడ్పడతాయని అన్నారు, వివిధ పాఠశాలల్లో పనిచేస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులు ఇలాంటి క్రీడా పోటీలు నిర్వహించుకుని క్రీడలు ఆడడం వలన విద్యార్థుల్లో మరింత ఉత్సాహం కలుగుతుందని క్రీడలకు పుట్టినిల్లు కరీంనగర్లో స్వయంగా వ్యాయామ ఉపాధ్యాయులు క్రీడలు ఆడడం సంతోషకరమని తెలిపారు. జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు నందెల్లి మహిపాల్, గసిరెడ్డి జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో పీఈటి అవసరమని వ్యాయామ ఉపాధ్యాయులు లేకపోతే అత్యుత్తమ క్రీడాకారులు లేరని విద్యార్థుల్లో క్రమశిక్షణను నేర్పేది వ్యాయామ ఉపాధ్యాయులేనని రాష్ట్ర, జాతీయ ,అంతర్జాతీయ క్రీడాకారులుగా తీర్చిదిద్దుతున్న పీఈటీలను గౌరవించే బాధ్యత ప్రతి ఒక్కరిదని అన్నారు, జిల్లాలో క్రీడలు పెంపొందించడంలో వ్యాయామ ఉపాధ్యాయులదే గొప్ప బాధ్యతని కొనియాడారు. ఈ క్రికెట్ ఛాంపియన్షిప్ పోటీలలో పాల్గొంటున్న వ్యాయామ ఉపాధ్యాయులకు టీ సెట్స్ తోపాటు ఛాంపియన్షిప్ ట్రోఫీని స్పాన్సర్ గా శ్లోకా స్పోరట్స్ సెంటర్ యజమాన్యం బూర్ల అమృత్ కుమార్, బూర్ల అనిల్ కుమార్ లు అందజేశారు, ఈ సందర్భంగా కరీంనగర్ ప్రైవేట్ పి ఈ టి అసోసియేషన్ అధ్యక్షులు బత్తిని శ్రీధర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి గౌతమ్ రెడ్డి, ట్రెజరర్ అనూప్ శ్లోకా స్పోరట్స్ సెంటర్ యజమాన్యమును శాలువా మెమొంటో జ్ఞాపకతో తో సత్కరించారు.ఈ సందర్భంగా శ్లోక స్పోరట్స్ సెంటర్ యజమాన్యం బూర్ల అమృత్ కుమార్ మాట్లాడుతూ వ్యాయామ ఉపాధ్యాయులకు ఎల్లప్పుడు సహాయ సహకార అందించేందుకు ముందుంటానని క్రీడలను ప్రోత్సహించడమే తమ బాధ్యతని ఇలాంటి క్రీడలు మరెన్నో నిర్వ హించుకోవాలని అన్నారు, ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని వారి చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.

# విరగబూసిన మామిడి తోటలు





**చిగురు మామిడి,ఫిబ్రవరి 1 (మనం న్యూస్):** కాతగా మారిన ప్రతి మామిడిలో ఒక సంవత్సరం జీవనాధారం మామిడి తోట రైతు జీవితం ఇదే. సంవత్సరాల తరబడి చేసిన శ్రమకు ఫలితం ఒక్క సీజన్లో తేలిపోతుంది. కానీ ఆ ఒక్క సీజన్ కూడా ప్రకృతి వైపరీత్యాల చేతిలో పడితే-రైతు జీవితం మొత్తం తారుమారు అవుతుంది. ఈసారి కూడా అదే జరుగుతోందా అన్న ఆందోళన మామిడి రైతు గుండెల్లో మబ్బులా కమ్ముకుంటోంది. గతేడాది పంట చేతికొచ్చే కీలక దశలో వడగండ్ల వానలు విరుచుకుపడ్డాయి. నిమిషాల్లోనే తోటలు యుద్ధభూమిలా మారాయి. చెట్లపై ఉన్న కాత నేలపాలైంది. కొమ్మలు విరిగాయి. ఆకులు చిందర వందరయ్యాయి. ఇది ఒక్క రైతు నష్టం కాదు-తోటలపై ఆధారపడి జీవించే వేలాది కుటుంబాల ఆర్థిక పతనం. ఇలాంటి దృశ్యాలు కొత్తవి కావు. అయినా ప్రతి ఏడాది అదే నష్టం. ప్రతి ఏడాది అదే నిస్సహాయత. ప్రతి ఏడాది అదే ప్రశ్న- ఇన్ని సార్లు జరుగుతున్నా ముందస్తు జాగ్రత్తలు ఎందుకు లేవు? రైతు బాధ్యత - మార్పు తప్పని పరిస్థితి మామిడి సాగు దీర్ఘకాల పెట్టుబడి వ్యవసాయం. ఒకసారి చెట్లు నాటితే పది నుంచి పదిహేను సంవత్సరాల పాటు అవే జీవనాధారం. కాబట్టి సంప్రదాయ పద్ధతులకే పరిమితమవకుండా, మారుతున్న వాతావరణానికి అనుగుణంగా రైతు కూడా తన సాగు విధానాలను మార్చుకోవాల్సిన అవసరం ఉంది.చిన్న, మధ్య తరహా మామిడి రైతు ఈ భారాన్ని ఒంటరిగా భరించలేడు. అందుకే ప్రభుత్వ బాధ్యత - మరింత పెద్దది వాతావరణ మార్పులు భవిష్యత్తులో వచ్చే ప్రమాదం కాదు. అవి ఇప్పటికే రైతు పొలాల్లో విధ్వంసం సృష్టిస్తున్న వాస్తవం. అయినా ప్రభుత్వ విధానాల్లో తోట పంటలకు సరైన ప్రాధాన్యం ఎందుకు కనిపించడం లేదు? మామిడి వంటి దీర్ఘకాల తోట పంటలకు ప్రత్యేక విపత్తు నిర్వహణ విధానం ఎందుకు లేదు? వడగండ్ల వానల వంటి ఆకస్మిక ప్రమాదాలపై ముందస్తు హెచ్చరికలు గ్రామస్థాయిలో రైతుకు ఎందుకు చేరడం లేదు? నష్టం జరిగిన తర్వాత పరామర్శలు, ప్రకటనలే తప్ప ముందే రైతును కాపాడే విధానాలు ఎందుకు రూపుదిద్దుకోలేదు? నష్టం అంచనాలు నెలల తరబడి సాగుతాయి. పరిహారం వచ్చే సరికి రైతు అప్పుల ఊబిలో మరింత లోతుకు జారిపోతాడు. ఈ ఆలస్యం రైతుకు సహాయం కాదు-ఆలస్యమైన సానుభూతి మాత్రమే. ఇప్పటికైనా మారాల్సిన దారి ఇది కేవలం విమర్శల సమయం కాదు-పాలనలో స్పష్టమైన నిర్ణయాలు తీసుకోవాల్సిన సమయం. ప్రభుత్వం వెంటనే అమలు చేయాల్సిన అంశాలు ఇవి: తోట పంటలకు త్వరిత నష్టం అంచనా వ్యవస్థ, వడగండ్ల ముప్పు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో సబ్సిడీతో రక్షణ సదుపాయాలు, పంట బీమా క్లెయిమ్లను సరళీకృతం చేసే విధానం, రైతులకు ఆధునిక సాగుపై అవగాహన కల్పించే గ్రామస్థాయి శిక్షణ కార్యక్రమాలు, వాతావరణ మార్పుల నేపథ్యంలో తోటల కోసం ప్రత్యేక దీర్ఘకాల విధానం. ఇవి ప్రకటనల్లో కాదు-క్షేత్రస్థాయిలో కనిపించాలి. రైతు పట్ల దయ చూపమని అడగడం లేదు..! తన శ్రమకు భద్రత కోరుతున్నాడు. తన పెట్టుబడికి రక్షణ కోరుతున్నాడు. ప్రకృతి దెబ్బను తట్టుకునేలా పాలన దండుగా నిలవాలని మాత్రమే అడుగుతున్నాడు. చిగురించిన ఆశలు మళ్లీ వడగండ్లకు గురికాకుండా ఉండాలంటే- ముందస్తు జాగ్రత్తలు రైతు చేతిలోనూ ఉండాలి, బలమైన, అమలు చేయగల విధానాలు ప్రభుత్వ చేతిలోనూ ఉండాలి. అప్పుడే మామిడి తోటలు నిజంగా పండుతాయి. అప్పుడే రైతు గుండెల్లో నమ్మకం మళ్లీ చిగురిస్తుంది.

# తల్లుల ఆశీస్సులతో మహా జాతర విజయవంతం

- భక్తుల సహకారంతో ఘనంగా జాతర
- ఫలించిన ముందస్తు ప్రణాళికలు, నూతన అభివృద్ధి పనులు
- మంత్రి సీతక్క

**ములుగు, జనవరి 1(మనంప్రతినిధి):** మేడారం సమ్మక్క సారలమ్మ మహాజాతర ఈ ఏడాది అత్యంత ఘనంగా, చరిత్రలో నిలిచిపోయే విధంగా విజయవంతంగా ముగిసిందని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా.దనసరి అనసూయ సీతక్క తెలిపారు. కోట్లాది మంది భక్తులు ఎలాంటి అసౌకర్యాలు ఎదుర్కోకుండా తల్లులను ప్రశాంతంగా దర్శించుకోవడం ప్రభుత్వ యంత్రాంగం సాధించిన ముఖ్యమైన విజయంగా మంత్రి పేర్కొన్నారు. తల్లుల వన ప్రవేశం అనంతరం మేడారంలోని మీడియా సెంటర్లో మంత్రి సీతక్క మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాతర నిర్వహణకు ముందే రూపొందించిన సమగ్ర ప్రణాళికలు, స్పష్టమైన వ్యూహాలు, శాఖల మధ్య సమన్వయంతో చేపట్టిన ఏర్పాట్లు పూర్తిస్థాయిలో ఫలించాయని తెలిపారు. రవాణా సౌకర్యాలు, వైద్య సేవలు, త్రాగునీటి సరఫరా, పారిశుధ్య ఏర్పాట్లు, విద్యుత్, అగ్నిమాపక, పోలీస్ భద్రత వంటి అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయడం వల్ల జాతర ఎక్కడా అంతరాయం లేకుండా సాగిందని చెప్పారు. ఈ ఏడాది జాతరకు ప్రత్యేక ఆకర్షణగా నూతనంగా చేపట్టిన అభివృద్ధి పనులు నిలిచాయని మంత్రి సీతక్క పేర్కొన్నారు. అమ్మవార్ల గద్దెల ప్రాంగణాలను మరింత సౌకర్యవంతంగా, శోభాయమానంగా తీర్చిదిద్దడం వల్ల భక్తులకు మెరుగైన అనుభూతి లభించిందని తెలిపారు. గద్దెల పరిసరాల్లో విస్తరణ, పాదచారులకు సౌకర్యవంతమైన మార్గాలు, శాశ్వత మౌలిక వసతులు జాతర ప్రతిష్టను మరింత పెంచాయని అన్నారు. ఈ అభివృద్ధి పనుల కారణంగా మేడారం మహాజాతరకు మరింత శోభ



చేకూరిందని, సంప్రదాయం ఆధునిక సదుపాయాలు సమన్వయమై భక్తుల మనసును ఆకట్టుకున్నాయని మంత్రి తెలిపారు. భవిష్యత్తు తరాలకు ఉపయోగపడేలా చేపట్టిన ఈ పనులు మేడారం చారిత్రక ప్రాధాన్యతను మరింత బలపరుస్తాయని పేర్కొన్నారు. ఈ మహాజాతరను విజయవంతం చేయడంలో అహర్నిశలు కృషి చేసిన జిల్లా యంత్రాంగం, పోలీస్ శాఖ, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, ఉద్యోగులు, మీడియా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు, స్వచ్ఛంద సేవకులు, సహకరించిన ప్రతి ఒక్కరికీ మంత్రి సీతక్క హృదయపూర్వక కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలిపారు. గుడి అభివృద్ధి పనులు ప్రారంభమైన నాటి నుండి కొన్ని శక్తులు పనికట్టుకుని దుష్ప్రచారం చేశాయని, జాతర సందర్భంగా కూడా సోషల్ మీడియా వేదికగా గందరగోళం సృష్టించే ప్రయత్నం చేశాయని, వారి ప్రచారాన్ని తిప్పి కొట్టీ తల్లుల సేవలో భక్తులు తరించారని పేర్కొన్నారు.
సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో యుద్ధ ప్రాతిపదికన వంద రోజుల్లోనే మేడారం అభివృద్ధి పనులను పూర్తి చేశామన్నారు. మేడారం చరిత్రలో సీఎం రేవంత్ రెడ్డి పేరు చిరస్థాయిలో నిలిచిపోతుందన్నారు. మేడారం అభివృద్ధిలో కీలక భూమిక పోషించిన మంత్రివర్గ సహచరులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. భక్తుల సహనం, సహకారం వల్లే మేడారం జాతర ఇంత ఘనంగా విజయవంతమైందని పేర్కొంటూ, సమ్మక్క సారలమ్మ ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరికీ శాంతి, సుఖ సంతోషాలు, సమృద్ధి కలగాలని మంత్రి సీతక్క ఆకాంక్షించారు.



## ప్రజావాణి కార్యక్రమం రద్దు

- జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్

**ములుగు, ఫిబ్రవరి 1, మనం ప్రతినిధి:** ములుగు కలెక్టరేట్ లో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో సమస్యల పరిష్కారం కోసం ప్రజల నుండి వినతులను స్వీకరించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు పేర్కొన్నారు. ప్రజావాణి కార్యక్రమం రద్దయిన విషయాన్ని జిల్లా ప్రజలు గమనించాలని సూచించారు. ఎన్నికల కోడ్ ముగిసేంత వరకు ప్రజావాణి కార్యక్రమము ఉండదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత ప్రజావాణి కార్యక్రమాన్ని యధావిధిగా కొనసాగిస్తామని కలెక్టర్ వెల్లడించారు.

## సౌమ్య మృతి చాలా బాధకరం



**ములుగు, జనవరి 1(మనంప్రతినిధి):** గంజాయి స్మగ్లర్ల దాడిలో తీవ్రంగా గాయపడి నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య మృతి చెందడం పట్ల రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్క తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన సౌమ్య కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. విధి నిర్వహణలో ఉన్న అధికారుల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తామని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు చేపడతామని, నిందితులపై కఠినంగా వ్యవహరిస్తామని మంత్రి హెచ్చరించారు.

## జాతర విజయానికి పారిశుధ్య సిబ్బంది సేవలు అనిర్వచనీయం

- మేడారంలో పారిశుధ్య నిర్వహణపై సమీక్ష
- రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క



**ములుగు, ఫిబ్రవరి 1,మనం ప్రతినిధి:** ప్రపంచ ప్రసిద్ధ మేడారం సమ్మక్క-సారలమ్మ మహా జాతర సందర్భంగా చేపట్టిన పారిశుధ్య నిర్వహణపై పంచాయతీరాజ్, శానిటేషన్ శాఖల సిబ్బందితో మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. తో కలిసి మేడారంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, కోట్లాది మంది భక్తులు హాజరైన మహా జాతరను పరిశుభ్రంగా, సురక్షితంగా నిర్వహించడంలో పారిశుధ్య సిబ్బంది కీలక పాత్ర పోషించారని ప్రశంసించారు. జాతర కాలమంతా నిరంతరంగా క్షేత్రస్థాయిలో పనిచేసి, మేడారాన్ని పరిశుభ్రంగా ఉంచి నందుకు సిబ్బందికీ ధన్యవాదాలు తెలిపారు. జాతర ముగిసిన తర్వాత కూడా పారిశుధ్య పనులు ఎంతో ముఖ్యమని పేర్కొన్న మంత్రి, మేడారంలో పూర్తిస్థాయిలో పరిశుభ్రత సాధించే వరకు శానిటేషన్ సిబ్బంది విధులు కొనసాగించాలని ఆదేశించారు. మేడారానికి రాకపోకలు సాగించిన రహదారులు, పరిసర ప్రాంతాలు గద్దెల ప్రాంగణాలు, భక్తుల బస ప్రాంతాలు పూర్తిగా శుభ్రపడి, స్వచ్ఛమైన మేడారాన్ని గ్రామస్తులకు అప్పగించే వరకు అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలోనే పనిచేయాలని స్పష్టం చేశారు. అధికారులు సమన్వయంతో పనిచేసి, మేడారాన్ని పూర్తిగా పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని సూచించారు. జాతర అనంతరం కూడా అదే బాధ్యతతో పనిచేసి, గ్రామస్తులకు స్వచ్ఛమైన మేడారాన్ని అప్పగించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశం లో అదనపు కలెక్టర్ రెవిన్యూ సి హెచ్ మహేందర్ జి, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, డి పి ఓ వెంకయ్య, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీదేవి భూదేవి సహిత గరుడసేవ నిర్వహించిన వెంకటేశ్వర ఆలయ కమిటీ



**కోరుట్ల ఫిబ్రవరి 1 (మనం న్యూస్)** కోరుట్ల పట్టణం లో గ అతి పురాతనమైన శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయము లో ఈ రోజు పౌర్ణమి సందర్భంగా గరుడ సేవ కార్యక్రమం అర్చకులు బీర్ణంది నర్సింహా చారి వైదిక నిర్వహణలో వైభవంగా నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేతంగా స్వామివారు గరుడ వాహనంపై పురవీధుల గుండా వెళ్ళగా మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. ఇట్టి కార్యక్రమానికి ఎలుగూరి కిరణ్ - శ్వేత దంపతులు కైంకర్య దాతలుగా వ్యవహరించారు. ఇట్టి కార్యక్రమం లో ధర్మపురి దేవస్థాన మాజీ చైర్మన్ జువ్వాడి కృష్ణారావు, ఆలయ ఛైర్మన్ ఎతిరాజం నర్సయ్య, ధర్మకర్తలు నేతి శ్రీనివాస్, కటుకం దివాకర్, కోట గంగాధర్, గొడికె రాములు, చిలువేరి విజయ్ కుమార్, చిట్యాల పద్మ, ఈఓ క విక్రమ్ జూనియర్ అసిస్టెంట్ పెడివెల్లి నర్సయ్య, భక్తులు మహిళలు పాల్గొన్నారు.

## గుమ్లాపూర్ లో ఘనంగా వెంకటేశ్వర స్వామి జాతర మహోత్సవం

**కోరుట్ల, ఫిబ్రవరి 1 (మన న్యూస్)** కోరుట్ల మండలం గుమ్లాపూర్ గ్రామంలో శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ, జాతర మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో, అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు ఘనంగా జరిగాయి. జాతర మహోత్సవంలో భాగంగా నూతన సర్పంచ్ రొట్ల స్రవంతి-శ్రీకాంత్ దంపతులు భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి విశేష ప్రశంసలు అందుకున్నారు. అలాగే చిన్నారులు ప్రదర్శించిన నృత్య కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.ఈ జాతరకు చుట్టుపక్కల గ్రామాలైన వల్లంపెల్లి, మాచాపూర్, మోహన్రావుపేట, వెంకటాపూర్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మరింగంటి శ్రీవత్సవులు మాట్లాడుతూ,



శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం రోజురోజుకీ అభివృద్ధి చెందుతూ భక్తుల ఆదరణ పొందుతోందని తెలిపారు. భక్తుల భక్తిశ్రద్ధలతో ఈ ఆలయంలో సాక్షాత్తు తిరుపతి తిరుమలలోని శ్రీ వెంకటేశ్వర స్వామి వారు దర్శనమిస్తారన్న విశ్వాసం ప్రజల్లో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ అరుణ్రావు, మాజీ ఉపసర్పంచ్ గంగనరసయ్య, నాయకులు శ్రీనివాస్రావు, భాస్కర్రావు, వెంకటేశం, అల్లాడి శ్రీనివాస్, వెంకటేశ్, ప్రశాంత్, ప్రవీణ్, రెడ్డి, గ్రామ ప్రజలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్లో నేడు పీజీఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్

- జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్

**విశాఖపట్నం, ఫిబ్రవరి 1(మనంప్రతినిధి):** విశాఖపట్నం జిల్లా కలెక్టరేట్లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్), రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం వరకు జరుగుతాయని, రెవెన్యూ అధికారులతో పాటు అన్ని శాఖల జిల్లా అధికారులు హాజరవుతారని పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన అర్జీలను పూర్తి వివరాలతో సమర్పించాలని సూచించారు. అలాగే 'మీ కోసం' కాల్ సెంటర్ 1100 సేవలు, వెబ్సైట్ను వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు.

## రాజకీయ కక్ష్యతోనే కెసిఆర్ కు సిట్ నోటీసులు

**రాష్ట్ర నాయకులు శివ ప్రకాష్**

**రంగారెడ్డి ఫిబ్రవరి 1 (మనం న్యూస్)** రాజకీయ కక్ష్య తోనే కెసిఆర్ కు సిట్ నోటీసులు ఇచ్చారు అని బి ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు శివ ప్రకాష్ అన్నారు. ఆదివారం ఎల్బీనగర్ నియోజకవర్గం చైతన్యపురి డివిజన్ లో శివ ప్రకాష్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తారని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, అవి చేయలేక ప్రతిపక్ష నాయకులను వేధింపుల గురి చేస్తున్నారని అన్నారు. ఇలాంటి బెదిరింపులకు ఉద్యమ పార్టీ భయపడదని రేవంత్ రెడ్డి గుర్తుంచుకోవాలని అన్నారు. ఎన్ని నోటీసులు ఇచ్చిన ప్రశ్నిస్తునే ఉంటామని అన్నారు. ఈ సందర్భంగా నిరసన చేస్తున్న నాయకులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్కు



తరలించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ విట్టల్ రెడ్డి, తోట మహేష్, యాదవ్ చందు, నాగలక్ష్మి, రాపోలు సుధాకర్,త్రివేది,అజయ్ కుమార్,రవి యాదవ్, బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు కార్యకర్తలు తో కలిసి ఆందోళన కార్యక్రమం లో పాల్గొన్నారు.

## రేవంత్ సర్కారు తీరుపై భగ్గుమన్న గులాబీ దండు

- కేసీఆర్ కు సీట్ నోటీసులు ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండించిన నేతలు
- కాంగ్రెస్ ప్రభుత్వ వ్యవహార తీరును నిరసిస్తూ నియోజకవర్గ వ్యాప్తంగా నిరసనలు
- కక్షపూరిత రాజకీయాలను మానుకోకుంటే తగిన బుద్ధి చెప్పక తప్పదని హెచ్చరించిన నేతలు



**షాద్ నగర్, ఫిబ్రవరి 1 (మనం న్యూస్):** మాజీ ముఖ్యమంత్రి, తెలంగాణ రాష్ట్ర సాధకులు కేసీఆర్కి రేవంత్ రెడ్డి సర్కార్ సిట్ నోటీసులు ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ ప్రభుత్వ వ్యవహార తీరుపై షాద్ నహార్ నియోజకవర్గ గులాబీ నేతలు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ఆదేశానుసారం సిట్ విచారణ వ్యతిరేకిస్తూ షాద్ నగర్ నియోజకవర్గంలోని ఫరూఖ్ నగర్, కొందుర్గు, కొత్తూరు, నందిగామ, జిల్లేడు చౌదరిగుడ కేశంపేట మండల కేంద్రాలతో పాటు ఆయా గ్రామాలలో బీఆర్ఎస్ పార్టీ నేతలు, కార్యకర్తలు,నిరసనలు తెలిపారు. పాలన చేతకాక చిల్లర రాజకీయాలు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వం మానుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాలకు మంచినీళ్లను, సాగునీలను అందించడంతోపాటు సకల జనులకు సంక్షేమ పథకాల అందించిన మహానేత కేసీఆర్ అని, అన్నింటికీ మించి 13 ఏళ్ల పాటు నిరంతరంగా తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమాన్ని చేసి రాష్ట్రాన్ని సాధించిన మహానుభావుడు కేసీఆర్ అని, అలాంటి నేతపై విచారణ పేరుతో నిందలు వేయడం వేయడంకాంగ్రెస్ ప్రభుత్వ చిల్లర బుద్ధికి నిదర్శనం అని మండిపడ్డారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం తన కుట్రపూరితమైన ఆలోచనలను మానుకోవాలని, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సూచించారు. కేసీఆర్ ను ఉద్దేశపూర్వకంగావేధింపులకు గురిచేస్తే తెలంగాణ సమాజం కాంగ్రెస్ ప్రభుత్వంపై తిరగబడుతుందని హెచ్చరించారు.

## కేసీఆర్ పై వేధింపులకు దిగిన కాంగ్రెస్ సర్కార్

**మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి**

**రంగారెడ్డి, ఫిబ్రవరి 1(మనం న్యూస్):** రాజకీయ కక్షతో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పైఆధారాలు లేని ఫోన్ ట్యాపింగ్ అనే అక్రమ కేసులో నోటీసులు ఇచ్చి విచారణకు పిలిచి వేధింపులకు కాంగ్రెస్ సర్కార్ దిగింది అని మాజీ మంత్రి, మహేశ్వరం శాసన సభ్యురాలు పటోళ్ల సబితా ఇంద్రారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మహేశ్వరం నియోజకవర్గం పరిధి మీర్పేట్ డివిజన్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముందు బిఆర్ఎస్ పార్టీ పిలుపు మేరకు పి. సబితా ఇంద్రారెడ్డి ఆదేశాలతో డివిజన్ అధ్యక్షులు అర్కల కామేష్ రెడ్డి , రామిడి రాంరెడ్డి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. నిరసనలతో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సబితా ఇంద్రా రెడ్డి మాట్లాడుతూ... ప్రజలకు ఎన్నో అలవికాని హామీలిచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ దొంగలు..ఆ హామీలను నెరవేర్చడం చేతకాక పరిపాలనను గాలికొదిలేసి రాష్ట్రాన్ని నాశనం చేస్తూ ప్రజా వ్యతిరేకతను తట్టుకోలేక.. వారి దృష్టి మళ్లించేందుకే సిట్ నోటీసులు ఇస్తున్నారు అని అన్నారు.రాజకీయ కక్షతో చరిత్ర సృష్టికర్తల జోలికి వస్తే, చివరికి చరిత్రహీనులుగా మిగిలిపోవడం ఖాయం అని అన్నారు. ఈ తెలంగాణ కేసీఆర్ 25 ఏళ్ల నిరంతర శ్రమ ఫలితం. తెలంగాణకు అన్నీ తానై ముందుండి నడిపించారు. అలాంటి కేసీఆర్ పై నేడు కేవలం రాజకీయ కక్షతో, తలాతోకా లేని కేసులు పెట్టి, విచారణల పేరుతో ఆయన స్థాయిని తగ్గించాలని ప్రయత్నిస్తున్నారు. తెలంగాణ పట్ల ఎలాంటి నిబద్ధత లేని వ్యక్తి చేస్తున్న కుట్ర ఇది. ఇప్పుడు మీరు చేస్తున్న ప్రతి చర్యకీ సమాధానం సాధారణంగా ఉండదు. ఈసారి



అంతకుమించి ఉంటుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కార్యకర్తలు మహిళలు వేల సంఖ్యలో పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**రంగారెడ్డి ఫిబ్రవరి 1 (మనం న్యూస్):** చైతన్యపురి డివిజన్ లోని ప్రభాత్ నగర్ కాలనీ గంగ హాస్పిటల్ రోడ్డు , న్యూ మారుతి నగర్ రోడ్ నెంబర్ 12 బి , ఫనిగిరి కాలనీ పాము పుట్ట దగ్గర 37 నెంబర్ రోడ్డు లలో కార్పొరేటర్ రంగా నర్సింహ గుప్తా అభివృద్ధి పనులకు ఆదివారము శంకుస్థాపన చేశారు. ఫణిగిరి కాలనీ రూ. 21.20 లక్షలు , ప్రబాతనగర్ రూ .25.50 లక్షల , న్యూ మారుతి నగర్ 12 బి రూ .35.30 లక్షలు , మొత్తంతో వివిధ రోడ్డు లు శాంక్షన్ చేయించి , టెండరింగ్ రోడ్ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీలోకి కొత్త రోడ్లు వచ్చిన సందర్భంగా కాలనీవాసులందరికీ శుభాకాంక్షలు తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రభాత్ నగర్ కాలనీ



అధ్యక్షులు బాల్ రెడ్డి , వెంకటరమణ , కుల్ దీప్ , రామారావు ,నరసింహారావు ,రాజగోపాల్ ,మారుతి నగర్ అసోసియేషన్ అధ్యక్షులు రవి ,ప్రభాకర్ , శ్రీనివాస్ కృష్ణ , సత్తయ్య , అశోక్ ,బిజెపి నాయకులు రుద్ర శంకర్ ,వినోద్ యాదవ్ ,బిజెపి డివిజన్ అధ్యక్షులు నవీన్ యాదవ్ ,కొల్లూరు నవీన్ ,రాజేష్ ,జగన్ పాల్గొన్నారు.

## కమ్యూనిటి హాల్ ప్రారంభం

**రంగారెడ్డి, ఫిబ్రవరి 1( మనం న్యూస్):** మాన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని రాజ రాజేశ్వరి కాలనీ ఫేస్.2 కమ్యూనిటి హాల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి హాజరు అయ్యారు.ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ కాలనీవాసులు తమ స్వంత నిధులతో కమ్యూనిటి హాల్ నిర్మించుకోవడం జరిగింది అని అన్నారు.అలాగే మరో అదనపు అంతస్తు కోసం నా వంతు సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి,శ్రీధర్ గౌడ్,కోసనం



వెంకట్ రెడ్డి,జక్కిడి రఘువీర్ రెడ్డి,భాస్కర్ సాగర్,అనిల్ కుమార్ కాలనీ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

రుచి అనేది ఒక ఆర్జిత లక్షణం! మనందరికీ ఆరాధ్యనీయమైన అతిపెద్ద జిహ్వా పురాణం. మనం రుచి గురించి మాట్లాడేటప్పుడు.., అది అలవాటు, సంస్కృతి లేదా మనం తినే ఆహారం ద్వారా ఏర్పడుతుందని తరచుగా అనుకుంటాం. కొంతమందికి కాఫీ అంటే ఇష్టం, మరికొందరు దానిని చేదుగా భావిస్తారు. కొందరు తీపిని తట్టుకోలేరు, మరికొందరు రుచికరమైన వాటిని ఇష్టపడతారు. ఇది కేవలం ఒక అభిరుచిలా అనిపిస్తుంది, కానీ రుచి అనేది కేవలం మన మానసిక, శారీరక ప్రభావాలపై మాత్రమే ఆధారపడదు, జన్యుపరంగా కూడా రుచుల వైఖరి ఉంటుందని సైన్స్ చెబుతుంది. అవును, రుచి మన జన్యువులోనే దాగి ఉంటుంది, కాల్చిన పుట్టగొడుగుల 'ఉమామి' రుచిని, కాఫీ చేదును, మామిడి తియ్యదనాన్ని, చింతకాయ పులుపును మనం ఎంత బలంగా గ్రహించాలో మన జన్యువులు నిర్ణయిస్తాయి. ఉదాహరణకు, కొంతమంది చేదు సమ్మేళనాలకు చాలా సున్నితంగా ప్రతిస్పందిస్తారు, మరికొందరు దీనిని సాధారణమని భావిస్తారు, దీనికి కారణం జన్యువులలోని వైవిధ్యం. రుచి వెనుక ఉన్న జన్యుశాస్త్రాన్ని అర్థం చేసుకుందాం.

# అభిరుచి కాదు!

రుచి అనేది మన ప్రాథమిక ఇంద్రియాలలో ఒకటి, ఇది మనం తీసుకునే ఆహారం, పానీయాల రుచులను గుర్తించడంలో సహాయపడుతుంది. ప్రాథమికంగా, కొన్ని అణువుల రసాయన అవగాహన మన నాలుకతో సంకర్షణ చెందినప్పుడు మనం రుచిని అనుభవిస్తాం. మానవ నాలుక గుర్తించగల ఐదు ప్రాథమిక రుచి అంశాలు ఉమామి (రుచికరమైన), తీపి, ఉప్పు, పులుపు, చేదు. ఈ రుచులు మనం స్పృహతో కూడిన ఆహార ఎంపికలు చేసుకోవడంలో సహాయపడతాయి, ప్రమాదకరమైన పదార్థాల (తరచుగా చేదు ద్వారా సూచించబడే విషపదార్థాల వంటివి) గురించి మనల్ని అప్రమత్తం చేస్తాయి. మనం జీవించడానికి అవసరమైన పోషకాలను పొందుతున్నామని నిర్ధారించుకుంటాయి.

## మనం రుచిని ఎలా గ్రహిస్తాం?

రుచి అనేది మన నాలుకపై ఉన్న ప్రత్యేక కణాల ద్వారా కలిగే ప్రాథమిక భావన. 'పాపిల్లే' అనేవి మన నాలుకపై ఉన్న చిన్న గడ్డలు, ఇవి రుచి మొగ్గలు అనే కణాల సమూహాలను కలిగి ఉంటాయి. ఈ రుచి మొగ్గలు గ్రాహకాల ద్వారా వివిధ రుచి అణువులను గుర్తించడానికి ప్రత్యేక గ్రాహక కణాలను కలిగి ఉంటాయి. అందువల్ల, అది ఒక నిర్దిష్ట రుచి అణువును కనుగొన్నప్పుడు, గ్రాహకం సక్రియం అవుతుంది. ఉదాహరణకు, ఉప్పు కణాలు లవణ గ్రాహకాలను సక్రియం చేస్తాయి, అయితే చక్కెర అణువులు తీపి గ్రాహకాలను ప్రేరేపిస్తాయి. మనం తినే ఆహారం మన రుచి మొగ్గలలోని గ్రాహక కణాలతో సంకర్షణ చెందుతుంది. ఈ గ్రాహకాలు ప్రాథమికంగా ప్రోటీన్లు, ప్రతి ఒక్కటి ఒక నిర్దిష్ట రకమైన రుచిని గుర్తించడానికి ప్రత్యేకతను కలిగి ఉంటాయి. ఈ గ్రాహక ప్రోటీన్లు మనలోని నిర్దిష్ట జన్యువుల ద్వారా క్రోడీకరణకు గురవుతాయి. ఇక్కడే జన్యుశాస్త్రం అడుగుపెడుతుంది. నిర్దిష్ట రుచి గ్రాహకం కోసం జరిగే జన్యు వ్యక్తీకరణను బట్టి మనం రుచిని గుర్తిస్తాం. ఈ గ్రాహకాలు ప్రేరణకు గురైనప్పుడు, అవి నరాల ద్వారా మెదడుకు విద్యుత్ సంకేతాలను పంపుతాయి. ఆ సంకేతాలను మెదడు గుర్తిస్తుంది. ఇది మనం తినే వివిధ రకాల ఆహార పదార్థాల రుచులను గుర్తించి ఆస్వాదించడానికి అనుమతిస్తుంది.

## జన్యుమూలాలు

మన రుచి మొగ్గలు పుల్లని, తియ్యని, ఉప్పగా, చేదు, ఉమామి రుచులను గుర్తించడానికి ప్రత్యేకమైన గ్రాహకాలను కలిగి ఉంటాయి. ఇప్పుడు, మనలో వివిధ జన్యువులు ఉన్నాయి, ఇవి ఒంటరిగా లేదా ఇతర జన్యువులతో కలిపి ఒక నిర్దిష్ట లేదా అభిరుచుల సమితిని నిర్ణయిస్తాయి. వివిధ రుచి గ్రాహకాలకు కొన్ని సాధారణ జన్యువులు TAS2R1, TAS2R2, TAS2R3, SCNN1A, SCNN1B కారణమవుతాయి. అయినప్పటికీ, నిర్దిష్ట జన్యువులలోని తేడాలు మనం ఈ అభిరుచులను ఎంత బలంగా లేదా బలహీనంగా గ్రహిస్తామో నిర్ణయిస్తాయి. ఉదాహరణకు, TAS1R జన్యువులు తీపి, ఉమామి రుచులను గుర్తించడంలో పాల్గొంటాయి, అయితే TAS2R కుటుంబంలోని జన్యువులు చేదుకు సున్నితత్వాన్ని నిర్వహిస్తాయి. అయితే, జన్యు వైవిధ్యమైన సింగిల్-న్యూక్లియోటైడ్ పాలిమార్ఫిజం (SNP) ఒక వ్యక్తి రుచి అవగాహనను మార్చగలదని అధ్యయనాలు సూచిస్తున్నాయి. ఇద్దరు వ్యక్తులు ఒకే ఆహారం పట్ల చాలా భిన్నమైన ప్రతిచర్యలను కలిగి ఉండటానికి ఇదే కారణం - ఉదాహరణకు, ఒక వ్యక్తికి బ్రోకలీ చాలా చేదుగా అనిపించవచ్చు, మరొక వ్యక్తికి అది ఆనందదాయకంగా అనిపించవచ్చు. ఇదే విధంగా, కొంతమందికి ఎక్కువ క్రియాత్మక రుచి గ్రాహక జన్యువులు ఉంటాయి, దీనివల్ల వారు రుచి సున్నితత్వాన్ని పెంచిన 'సూపర్ టేస్టర్లు'గా మారతారు, మరికొందరు 'రుచి లేనివారు', తేలికపాటి రుచి గ్రహణశక్తిని కలిగి ఉంటారు. ఈ లక్షణ వైవిధ్యాలన్నీ రుచి జన్యువుల తాలూకు భిన్నత్వాల కారణంగా సంభవిస్తాయి.

## రుచి వారసత్వంగా వస్తుందా?

అవును, రుచి అనేది వారసత్వంగా వచ్చే లక్షణం. రుచి గ్రాహకాలు నిర్దిష్ట జన్యువుల ద్వారా క్రోడీకరణ జరిగిన ప్రోటీన్లు కాబట్టి, ఈ జన్యువులలో ఏదైనా వైవిధ్యం ఒక తరం నుండి మరొక తరానికి సంక్రమించవచ్చు. అయితే, ఇది పూర్తిగా జన్యుపరమైనది కాదు, కాబట్టి మన జీవనశైలి, పర్యావరణం కూడా మన రుచి ప్రాధాన్యతలను రూపొందిస్తాయి. ఇది బహుళజన్యు లక్షణం కాబట్టి, సాధారణంగా రుచికి లేదా వివిధ రుచి ప్రాధాన్యతలకు నిర్దిష్ట వారసత్వ నమూనాను నిర్ణయించడం కష్టం. రుచి అనేది ఒక సంక్లిష్టమైన జన్యు లక్షణం, ఇందులో జన్యువులు మాత్రమే కాకుండా పర్యావరణం కూడా ఉంటుంది. ఉదాహరణకు, మన తల్లిదండ్రులు, కుటుంబం లేదా ప్రాంతీయ ఆహారపు అలవాట్లు, మన జీవనశైలి, ఆర్థిక స్థితి కూడా, ఈ అంశాలన్నీ సమిష్టిగా మన రుచి ప్రాధాన్యతలను నిర్ణయించే జన్యు వైవిధ్యాలను ఏర్పరుస్తాయి.

రుచి అనేది ప్రవర్తనా లక్షణం అని నమ్ముతారు, కానీ అది పాక్షికంగానే. ఇప్పుడు, రుచి కూడా మన జన్యుశాస్త్రం ద్వారా ఎక్కువగా ప్రభావితమవుతుందని మీకు తెలుసు. తీపి, చేదు, ఉప్పు, ఇతర రుచులను మనం ఎలా గ్రహిస్తామన్న అంశాన్ని ప్రభావితం చేసే నిర్దిష్ట జన్యువులు ఉన్నాయి. ఈ జన్యువులలోని వైవిధ్యాలు కొన్ని ఆహారాలకు మనం ఎంత బలంగా స్పందించాలో నిర్దేశిస్తాయి.

- పసుపులేటి గీత (అసిస్టెంట్ ఎడిటర్)







'ఉమామి' అంటే ఏమిటి? కేవలం 'స్వాదిష్టంగా ఉండడం' అని మాత్రమే దీనికి సంపూర్ణార్థం కాదు, ఇది మన నోట్లో లోతైన, మాంసంలా, బ్రోత్‌లా, సరైన సమతుల్యతను కలిగిన సంపూర్ణమైన రుచి, కాస్త తేలికభాషలో చెప్పుకోవాలంటే 'కమ్మదనం' అని అనుకోవచ్చు! ఇది తీపి, పులుపు, ఉప్పు, చేదు తర్వాత వచ్చిన ఐదో ప్రాథమిక రుచి. దీన్ని మన శరీరం ప్రోటీన్ అందడానికి సంకేతంగా గుర్తిస్తుంది. 'ఉమామి' రుచి వచ్చినప్పుడు నోట్లో నీరు కారడం, జీర్ణ రసాలు ఎక్కువగా విడుదల కావడం జరుగుతాయి. ఇది శరీరానికి 'ప్రోటీన్ వచ్చేసింది, జీర్ణం చేయడానికి సిద్ధంగా ఉండు!' అని చెప్పే సూపర్ సిగ్నల్! ఈ రుచి రహస్యాన్ని మొదట గుర్తించినది జపనీస్ శాస్త్రవేత్త 'కికునాయే ఇకేడా'.

# ఐదో రుచి.. అద్భుతం!




1908లో టోక్యో ఇంపీరియల్ యూనివర్సిటీలో పనిచేస్తున్న ఇకేడా, తన భార్య చేసిన 'దాషి' (కొంబు సీవీడ్ బ్రోత్) అనే వంటకం రుచిని ఆస్వాదిస్తూ - ఇది తీపి, ఉప్పు, పులుపు, చేదు ఏదీ కాదు, వేరే ఒక రుచి! అని గ్రహించారు. ఆయన కొంబు సీవీడ్ (సముద్రపు నాచు)లోని గ్లూటమేట్ అనే అమినో యాసిడ్ ఈ రుచికి కారణమని కనుగొన్నారు. ఆ తర్వాత 'మోనోసోడియం గ్లూటమేట్'ను కనిపెట్టి, దాన్ని మసాలా దినుసుగా ఉపయోగించే విధానాన్ని పేటెంట్ చేశారు. ఆయన దీనికి తాత్కాలికంగా 'ఉమామి' అని పేరు పెట్టారు - అంటే 'స్వాదిష్టమైన రుచి' అని అర్థం! ఆసక్తికర రహస్యం ఇక్కడే ఉంది, ఉమామి ఒంటరిగా బలంగా ఉండదు, కానీ ఇతర ఉమామి ప్రేరేపణలతో కలిస్తే ఒక సమ్మేళన ప్రభావం వస్తుంది - రుచి 8-10 రెట్లు ఎక్కువగా అనిపిస్తుంది!

ఉమామి రుచికి మన పేగుల్లో, ఊపిరితిత్తుల్లో కూడా రిసెప్టర్లు ఉన్నాయి! అంటే ఆహారం నోటికి రాక ముందే శరీరం దాన్ని 'టేస్ట్' చేసి జీర్ణక్రియకు సిద్ధం చేస్తుంది. పాశ్చాత్య దేశాల్లో గ్లూటమేట్ రుచిని 'అసలు రుచి'గా భావించలేదు, జపనీస్ పాకశాస్త్రం మాత్రమే బలంగా ఉండేది. కాగా 2000ల తర్వాతే ఉమామి రిసెప్టర్లు (T1R1 + T1R3) డిస్కవర్ అయ్యాక ప్రపంచవ్యాప్తంగా అంగీకరించారు!

## 'హెటెరోడైమర్' అద్భుత రహస్యాలు!

మన నోట్లో ఉమామి రుచి గుర్తింపు ఎలా జరుగుతుంది? ఇది కేవలం రుచి కాదు - ఇది శాస్త్రీయంగా శక్తివంతమైన రిసెప్టర్ మెకానిజం! ప్రధాన ఉమామి రిసెప్టర్ 'T1R1, T1R3' అనే రెండు ప్రోటీన్లు కలిసి ఏర్పడిన 'హెటెరోడైమర్' (T1R1&T1R3). ఇది ఎ-ప్రోటీన్ కపుల్ రిసెప్టర్ (GPCR) కుటుంబానికి చెందినది - ఇది మెదడులోని గ్లూటమేట్ రిసెప్టర్లతో సమానంగా పనిచేస్తుంది కానీ నోటి రుచి కణాల్లో ప్రత్యేకంగా ఉంటుంది. ఈ రిసెప్టర్ ఎలా పనిచేస్తుంది? దీని నిర్మాణం 'వీనస్ ఫ్లైట్రాప్ డొమైన్' (Venus Flytrap –omain & VFT) అనే భాగంతో ప్రారంభమవుతుంది. ఇది ఒక చిన్న బంతి లాంటి ఆకారంలో ఉంటుంది - ఓపెన్ అయినప్పుడు లిగాండ్ (గ్లూటమేట్ లేదా ఇతర ఉమామి పదార్థాలు) లోపలికి వచ్చి బైండ్ అవుతుంది, ఆ తర్వాత డొమైన్ మూసుకుంటుంది. ఈ మూసుకోవడం వల్ల రిసెప్టర్ తాలూకు అమరిక మారుతుంది, ఎ-ప్రోటీన్ యాక్టివేట్ అవుతుంది, కాల్షియం సిగ్నల్స్ పెరిగి రుచి కణం నుంచి మెదడుకు 'ఉమావి' అనే సిగ్నల్ వెళుతుంది.

ఉమామి కేవలం రుచి మాత్రమేకాదు - ఇది మన శరీరానికి ప్రోటీన్ లభ్యత తెలిపే ప్రకృతి ఇచ్చిన గొప్ప కానుక!

- కల్కి



# ఆహా..!!

## అనాది చరిత్రలో ఆనవాళ్ళు

రుచి శాస్త్రంలో ప్రాథమిక రుచుల గురించి మనకు పరిజ్ఞానం పురాతన కాలం నుంచి మారుతూ వచ్చింది. ప్రపంచవ్యాప్తంగా వివిధ సంస్కృతుల్లో వేర్వేరు విధాలుగా వీటి వర్గీకరణ జరిగింది, కానీ పాశ్చాత్య సంప్రదాయంలో నాలుగు ప్రాథమిక రుచులు (తీపి, పులుపు, ఉప్పు, చేదు) దాదాపు 2300 సంవత్సరాలుగా గుర్తింపులో ఉన్నాయి.

గ్రీకు తత్వవేత్త అరిస్టాటిల్ (క్రీ.పూ. 350) మొదట తీపి, చేదు అనే రెండు ప్రాథమిక రుచులను పేర్కొన్నారు. వీటికి అనుబంధంగా సరసమైన, ఉప్పు, తీవ్రమైన/కారం, కఠినమైన, పొడి/కసాయి, పులుపు వంటివి ఉన్నాయని చెప్పారు. డెమోక్రిటస్ (క్రీ.పూ. 460-370) నాలుగు మూలకాలు (అగ్ని, జలం, వాయువు, భూమి) ఆధారంగా రుచులను వివరించారు - తీపి, చేదు, పులుపు, ఉప్పు. ప్లేటో, అరిస్టాటిల్ వంటివారు ఈ నాలుగు రుచులను ఆమోదించారు. ఈ నాలుగు (sweet, sour, salty, bitter) ప్రపంచవ్యాప్తంగా దాదాపు 2000 సంవత్సరాల పాటు ప్రామాణికంగా ఉన్నాయి. మధ్యయుగం నుంచి ఆధునిక కాలం వరకు, పాశ్చాత్య శాస్త్రవేత్తలు, మనస్తత్వవేత్తలు 19వ శతాబ్దం వరకు ప్రాథమిక రుచులు నాలుగు మాత్రమే ఉంటాయని నమ్మారు. రుచి మొగ్గల్ని కనుగొన్న తర్వాత కూడా నాలుగు వేర్వేరు రకాలు ఉన్నాయని అనుకున్నారు. ఈ నాలుగు రుచులు శరీరానికి సంకేతాలు - తీపి శక్తి (energy), పులుపు పాడైన ఆహారం లేదా అపక్వం, ఉప్పు ఖనిజాలు, చేదు విషాలు అని భావించారు.



- కావేరి

## 'పాకశాస్త్ర' విశ్వానికి తాళంచెవి

# ఫ్లేవర్

ఎవరైనా 'ఫ్లేవర్' అనగానే మన మనస్సులో మనకు అత్యంత ఇష్టమైన ఆహారం గుర్తుకు వస్తుంది. చాలా మంది ఫ్లేవర్‌ను రుచితో సమానంగా ఉపయోగిస్తారు. కానీ నిజానికి ఒక వంటకం ఫ్లేవర్‌ను నిర్ణయించేది కేవలం నాలుక రుచి మాత్రమే కాదు. ఫ్లేవర్ అనేది రుచి, వాసన రెండింటి సంయుక్త సంచలనం. ఆహారం వాసన, రుచి, రంగు, ఆకృతి, ఉష్ణోగ్రత, గత అనుభవాలు (మెమరీ) కలిసి ఆహార ఫ్లేవర్‌ను రూపొందిస్తాయి. ఈ అంశాల సమ్మేళనం ఒక ఆహారాన్ని రుచికరంగా, అసహ్యకరంగా లేదా పూర్తిగా వికర్షణీయంగా మారుస్తుంది. రుచి, వాసనలు ప్రత్యేక ఇంద్రియాలు కాగా, ఫ్లేవర్ ఒక సమగ్ర అనుభవం. ఈ రుచి-వాసనలు బలమైన భావోద్వేగాలు, జ్ఞాపకాలతో ముడిపడి ఉంటాయి.

రుచి, వాసన సంచలనాల వెనుక శాస్త్రీయ వివరణ ఇలా ఉంది. రుచి సంచలనం మనకు తినే ఆహారం సురక్షితమైనదేనా అని తెలుసుకోవడానికి సహాయపడుతుంది. ఇది జీవిత రక్షణ, పరిణామ క్రమంలో భాగం. ప్రాథమిక రుచులు ఐదు - తీపి, పులుపు, చేదు, ఉప్పు, ఉమామి (సేవొరీ). రుచిని గ్రహించే అసంఖ్యాకమైన ప్రత్యేక కణాలు ఉంటాయి. వీటిని టేస్ట్ బడ్స్ లేదా పాపిల్లే అంటారు. ఇవి సెన్సరీ రిసెప్టర్ కణాలు. ఆహార పదార్థాలు ద్రవంలో కరిగి రసాయనికంగా స్పందించినప్పుడు ఈ కణాలు ఉద్దీపన అవుతాయి. ఈ సంకేతాలు మెదడుకు చేరుతాయి. నాలుక పై భాగంలో సుమారు 10,000 టేస్ట్ బడ్స్ ఉంటాయి. కొన్ని మృదువైన అంగిటి, ఎపిగ్లాటిస్, యువులా, లారింక్స్, ఎగువ భాగం ఈసోఫాగస్‌లో కూడా వ్యాపించి ఉంటాయి. నాలుకపై ఈ బడ్స్ చిన్న గడ్డల్లా కనిపిస్తాయి. ప్రాథమిక రుచులన్నీ ఇవే గ్రహిస్తాయి. నోటిలోని థర్మోరిసెప్టర్ కణాలు ఉష్ణోగ్రతను గుర్తిస్తాయి.

ఆహార ఫ్లేవర్‌ను అనుభవించడంలో వాసన కీలక పాత్ర పోషిస్తుంది. వాసన గ్రహణం ఒల్ఫాక్టరీ న్యూరాన్స్ అనే ప్రత్యేక కణాల ద్వారా జరుగుతుంది. ఈ రిసెప్టర్లు ముక్కు పైభాగంలోని చిన్న ప్రాంతంలో ఉంటాయి. గాలిలోని అణువుల రూపంలో పదార్థాలు ముక్కులోకి చేరి ఒల్ఫాక్టరీ న్యూరాన్లను ఉద్దీపన చేస్తాయి. ఈ నరాలు నేరుగా మెదడుతో అనుసంధానమై ఉంటాయి. మనుషుల్లో సుమారు 400 రకాల ఒల్ఫాక్టరీ రిసెప్టర్లు ఉండగా, దాదాపు 10,000 విభిన్న వాసనలను గుర్తించగలం. వాసన సంచలనం మెదడులోని భావోద్వేగాలను నియంత్రించే ప్రాంతంతో కలిసి ఉంటుంది.

మనకు ఇష్టమైన ఆహారాన్ని ఆస్వాదించేందుకు వాసనే ప్రధానం. ఆహారాన్ని నమలగానే కొన్ని పదార్థాలు ఆవిరై, నోటి వెనుక భాగం నుంచి ముక్కులోకి చేరి ఒల్ఫాక్టరీ రిసెప్టర్లను ఉద్దీపన చేస్తాయి. చెడిపోయిన ఆహారం, దుర్వాసన వంటి ప్రమాదాలను హెచ్చరించే వ్యవస్థగా కూడా వాసన పనిచేస్తుంది.

- అభిరామి

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No: 98/1, CIE Phase II, Gandhinagar, Quthabullapur Mandal, Medchal-Malkajgiri, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.